నవశక్తి

Vol. 2, no. 31

(Jul. 19, 1939)

బెజవాడ, 1939

Navaśakti

Vol. 2, no. 31

(Jul. 19, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

Regd. No. M. 3824

నవశక్తి

సం॥ చందా రు 3

విడి ప్రతి అణా

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపుటం 2 | బుధవారం 19-7-39 బెజవాడ | సంచిక 31

"స్వరాజ్య పోరాటం వృద్ధి చెందడానికే డిసిప్లిన్"

—బోసు

బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ యొక్క రెండు తీర్మానాలయెడల అసమ్మతిని ప్రకటిస్తూ యీ నెల 9 వ తేదీని "అతివాద సమ్మేళన సంఘం" వారి ఆదేశాను సారం భారతదేశం అంతటా ఊరేగింపులు, బహిరంగసభలు జరిగాయి. కలకత్తా, బొంబాయి, పూనా, షోలాపూర్, నాగపూర్, కాన్పూరు, అగ్రా, లక్నో, అలహాబాద్, పాట్నా, మద్రాసు, కాలికట్, మొదలైన పట్టణాలలో, ఆంధ్రదేశంలో దాదాపు అన్ని జిల్లాలలోను, ఊరేగింపులు, బహిరంగ సభలు, జరిగాయి. అ. భా. కాం. కమిటీవారి రెండు తీర్మానాలను అమలు జరపవద్దని వర్కింగ్ కమిటీని కోరుతూ పై సభలలో తీర్మానాలు ఆమోదించబడ్డాయి.

మితవాదనాయకుల దిగజారుడు వి. ధాకు లొంగిపోవడం కంటె కాంగ్రెస్ సామాన్య సభ్యులందరికీ యీ విషమావస్థను గురించి చెప్పి, తాము డిసిప్లినరీ చర్యకు గురి అయినా సరే కాంగ్రెసు ఐక్యతను కాపాడడానికి అతివాదులు ఆ రోజున తెగించి ముందుకు వచ్చారు.

అతివాదుల్లోనే చీలికలు

కాని, "అతివాద సమ్మేళన సంఘం" వారు ఏకగ్రీవంగా చేసుకొన్న పైనిర్ణయాన్ని ధిక్కరించి ఎం. ఎన్. రాయి బహిరంగ సభలలో కాంగ్రెసు వాదులెవరూ పాల్గొన కూడదని ప్రకటన చేశాడు. మితవాద నాయకులందర్నీ సాంతంగా తొలగించి, 100 కి 100 అతివాదులే వారి స్థానాన్ని ఆక్రమించాలని వాదించే రాయి. యీ ప్రకటన ద్వారా మితవాదుల దిగజారుడు విధానానికి యేవిధంగా తోడ్పడు తున్నాడో గుర్తించి, రాయి అనుచరులు కమ్యూనిస్టుల తోను, ఫార్వర్డుబ్లాక్‌తోను, కలిసి బహిరంగ సభలలో పాల్గొన్నారు.

ఇటీవల కమ్యూనిస్టుల్ని దుమ్మెత్తిపోస్తూ అ. భా. కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ కార్యనిర్వాహక వర్గానికి రాజీనామా యిచ్చి, "అతివాద సమ్మేళన సంఘా"న్ని వ్యతిరేకిస్తూన్న మసానీ అచ్యుత పట్వర్ధన్ అశోక మెహతా, రాం మనోహర లోహియా—యీ నలుగురు "సోషలిస్టు" నాయకులు కూడా రాయి ఫంధానే అనుసరించి బహిరంగసభలకు వ్యతిరేకంగా ప్రకటన చేశారు. మహారాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కూడా 9 తేదీని బహిరంగ సభలలో పాల్గొనకూడదని తీర్మానించింది. రాయిస్టులు "అతివాద సమ్మేళన సంఘం" నుండి తొలగిపోవడానికి నిశ్చయించు కున్నారు.

కాని అన్ని రాష్ట్రాలలోను దిగ్విజయంగా బహిరంగ సభలు జరిగాయి. అతివాద ముఠాలన్నీ కలసి పనిచేశాయి. బెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ 50 : 17 వోట్ల తేడాతో అతివాద సమ్మేళన సంఘం" వారి తీర్మానాన్ని ఆమోదించింది.

బోసు జవాబు

రాజేంద్ర ప్రసాద్ సుభాష్‌బోసుకు యిచ్చిన రెండవ తంతికి జవాబుగా బోసు యీ క్రింది తంతి యిచ్చాడు: "నిన్నటి స్టేట్‌మెంటులో నేను నా అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేశాను. డిసిప్లిన్‌కి మీరు యిస్తూన్న అర్థం కాంగ్రెసు సూత్రాలకే, కాంగ్రెసు సాంప్రదాయలకే విరుద్ధంగా ఉంది. కాంగ్రెసు యొక్క ప్రజాతంత్ర విధానానికే, అభివృద్ధికే, అది వ్యతిరేకం"

సంస్థను బలపరచడానికి డిసిప్లిన్.

10 వ తేదీని బోసు పూనాలో ఉపన్యసిస్తూ యీ విధంగా పలికాడు: "డిసిప్లినరీ చర్య అంటే నాకు ఏమాత్రం భయం లేదు. అన్నింటికీ నేను సిద్ధంగా ఉన్నాను. డిసిప్లిన్ సంస్థను బలపరచడానికి, స్వరాజ్య పోరాటం వృద్ధిచెందడానికి, గాని మరెందుకూ కాదు."

అప్పుడే ప్రారంభమా?

బొంబాయి నగరంలో తొమ్మండుగురు సుప్రసిద్ధ కాంగ్రెస్‌వాదులు 9 వ తేదీ నాటి సభలలో పాల్గొని, బొంబాయి రాష్ట్రకాంగ్రెస్ కమిటీని కాంగ్రెసు అధ్యక్షుని ధిక్కరించి, డిసిప్లిన్‌కి వ్యతిరేకంగా నడిచారట! అందువల్ల, తగిన సంజాయిషీ యివ్వకపోతే, వారిమీద డిసిప్లినరీ చర్య తీసుకొనబడుతుందని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి తెలియజేశాడు. ఆ తొమ్మండుగురిలో ముగ్గురు కె. యఫ్. నారీమన్-సి. కె. నారాయణస్వామి-రాజారాంపాండే, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యులు. మిగిలిన 6 గురు వేర్వేరు జిల్లా కాంగ్రెస్ కమిటీల (బొంబాయి నగరంలోనివే) అధ్యక్షకార్యదర్శులు వీరిలో రాయి అనుచరులైన వి. బి. కార్నిక్, మణిబెన్ మూల్జీ సతి, కూడా ఉన్నారు. 13 వ తేదీని మరొక 10 మందికి యిట్టి నోటీసులే జారీ చేయబడ్డాయి.

మహారాష్ట్రంలోకూడా ఏ యే కాంగ్రెస్ వాదులు 9 వ తేదీ సభలలో పాల్గొన్నారో తెలియజేయవలసిందని జిల్లా కాంగ్రెస్ కమిటీలకు రాష్ట్ర కార్యదర్శి ఉత్తర్వులు పంపించాడు. మహాకోసల్ కాంగ్రెస్ కమిటీసభ్యులు ముగ్గురిమీద యిట్టి నోటీసులే రా. కాం. కమిటీ జారీ చేసింది.

ఇక నెహ్రూ

అసమ్మతి సభలను గురించి నెహ్రూ ఒక పత్రికా విలేఖరితో చెప్పాడు "ఒక కాంగ్రెసు కమిటీయొక్క కార్యనిర్వాహక వర్గంలో సభ్యులుగా ఉన్నవారు పైకమిటీల అజ్ఞలను విధిగా ఆచరణలో పెట్టవలసి యుంటుంది. సాధారణ సభ్యుల బాధ్యత ఇంతకంటె తక్కువ కాబట్టి ఏ కాంగ్రెసు కార్యనిర్వాహక వర్గంలోనైనా సభ్యుడుగా ఉన్న కాంగ్రెసువాది తన అధికార స్థానానికి రాజీనామా యిచ్చి, అటుపిమ్మట పై కమిటీనిర్ణయాలను విమర్శిస్తూ ఆందోళన చేయవచ్చు....ఇట్టి విషమ పరిస్థితుల్లో, అఖిల భారత కాంగ్రెసు కమిటీ తీర్మానాన్ని ధిక్కరిస్తూ చేసిన ఆందోళనను కాంగ్రెసు నిర్లక్ష్యపరచజాలదు. కాని, జూలై 9 సభలలో పాల్గొన్నవారిమీద డిసిప్లినరీ చర్య తీసుకోవడానికి యిది ఇంకా సమయం కాదు.

"సభలలో పాల్గొన్న అలహాబాద్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు తమ తమ కార్యనిర్వాహక వర్గాలకు రాజీనామా యివ్వమని మేము కోరాము. వారిమీద ఎట్టి చర్య తీసుకోవాలో వారు యిచ్చే జవాబును బట్టి ఉంటుంది...."

కృపాలినీ ప్రకటన

అఖిలభారత కాంగ్రెసు కమిటీ ప్రధానకార్యదర్శి ఆచార్య కృపాలినీగారు యీక్రింది ప్రకటన గావించారు.

"ప్రజాతంత్ర పద్ధతి అంటే అర్థం. అధిక సంఖ్యాకుల నిర్ణయం సరిఅయినా, కాకపోయినా, అందరూ ఆనిర్ణయానికి లోబడవలసిందే. కాని, అల్పసంఖ్యాకులకు కూడా తమ అభిప్రాయాలను ప్రచారం చేసికొనేహక్కు నిస్సంశయముగా ఉంటుంది....కాంగ్రెసు అధ్యక్షుడిచ్చిన స్టేటుమెంటులోను సుభాష్‌బోసుకు అతడు యిచ్చిన టెలిగ్రాంలోను, బహిరంగ విమర్శలను నిషేధించే విషయం ఏమైనా ఉందేమోచూదాం. బహిరంగ విమర్శనలను, తీర్మానాల ఖండనలను అతడు నిషేధించలేదు. కాని కాంగ్రెసు కమిటీలు, కాంగ్రెసు కమిటీల అధికారవర్గములోనివారు, అట్టి విమర్శనలు — ఖండనలు చేయకూడదనిమాత్రం తెలియజేసాడు....కాంగ్రెస్‌లో ప్రజాతంత్రపద్ధతి గల పార్టీ లేవైనా ఉంటే, వాటి సభ్యులు మొదట అధికారపదవుల నుండి తొలగి, పిమ్మట అధిక సంఖ్యాకుల నిర్ణయాలను విమర్శించవలసిందని కోరవలసి యుంటుంది. ఒకవైపు తాము అధికార పదవులలో ఉంటూ, మరొకవైపు వ్యతిరేకించే స్వేచ్ఛను కలిగియుండుట అసంభవం."

దీనికి జవాబు

"....ప్రస్తుతమున్న క్లిష్టపరిస్థితిలో సత్యాగ్రహాన్ని నిషేధించుతూ తీర్మానాలు చేయడం సంకుచిత దృష్టిని తెలియజేయడమే గాకుండా జాతీయపోరాటానికి మహాపరాధం గావించడమవుతుంది. ఈ 'రకపు జాతీయత' అంటే గంభీరంగా ఆలోచించేవారు ఎవరూ గర్వపడరు; ఇట్టి తీర్మానాలను సవాలు చేయకుండా వదలజాలరు."

("నేషనల్ ఫ్రంటు" సంపాదకీయం)

ఈ సంచికలో

గమనించండి

అతివాద సమ్మేళనసంఘంవారి ఆదేశాను సారం, 9-7-39 వ తేదీని తెనాలి పట్టణ కాంగ్రెస్ సోషలిస్టుపార్టీవారి యాజమాన్యాన బహిరంగసభ జరిగెను. అధ్యక్షులైన కామ్రేడ్ ముత్తేవి మాధవాచార్య, కాకుమాను ... రావుగారలు బొంబాయి అఖిలభారత కాంగ్రెస్ కమిటీలో ప్యాసైన రెండుతీర్మానాలు ఏవిధంగా కాంగ్రెస్ సంస్థను బలహీనపరుస్తాయో వివరిస్తూ ఉపన్యసించారు. శ్రీ గుడిపల్లి వెంకటప్పయ్యశాస్త్రిగారు యీ ప్రచారం అంతా బోసు నాయకత్వంకొరకేననీ, యిట్టి నిరసనసభలు కాంగ్రెసును బలహీనపరుస్తాయనీ వ్యతిరేకిస్తూ మాట్లాడారు. తెనాలితాలూకా కాంగ్రెసు సంఘాధ్యక్షులైన చింతల సూర్యనారాయణగారు అనుకూలంగాను, గుండవరపు శ్రీరాములుగారు వ్యతిరేకంగాను ఉపన్యసించాక, తీర్మానాన్ని వోటుకుపెట్టగా, 53 గురు అనుకూలంగాను, 8 గురు వ్యతిరేకంగాను వోటుచేశారు.

కర్నూలులో కామ్రేడ్ కె వి. కృష్ణమూర్తి రావుగారి అధ్యక్షత క్రిందను; నంద్యాలలో కామ్రేడ్ డి. కె. నాగరాజరావు, ఎం. ఏ, బి. యల్., గారి అధ్యక్షతను; కుదుమద్దాలిలో గుళ్లపల్లి రామచంద్రయ్యగారి అధ్యక్షతను బార్లపూడిలో కోనేరు కోటయ్యగారిఅధ్యక్షతను; యండగండిలో పేరిచర్ల చిన సోమరాజుగారి అధ్యక్షతను; బస్వయ్యగారి పల్లెలో శ్రీ అప్పాజీ రావుగారి అధ్యక్షతను; నందిగామ తాలూకాలో వీరులపాడు, కొణతమాత్మకూరు, తొర్రగుడిపాడు, సోమవరం, రుద్రవరం, కమ్మవారిపాలెం, జయంతి, పెద్దాపురం, మాధవరం, అల్లూరు, చెన్నారావుపాలెం, దాచవరం, పెల్లంకి, చవటపల్లి-గ్రామాలలోను 9-వ తేదీని జరిగిన బహిరంగ సభలలో అతివాద సమ్మేళన సంఘంవారు ప్రకటించిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది. నందిగామ తాలూకా రైతు సంఘ సాధారణ సమావేశంలోకూడా పై తీర్మానం ఆమోదించబడెను.

* * *

కృష్ణాజిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ కార్యవర్గము

పైకార్యవర్గము 8-7-39 తేదీని గుడివాడలో సమావేశమై గావించిన తీర్మానములు

1. మునగాల జమీప్రజలు తమ న్యాయమైన హక్కులకొరకు సత్యాగ్రహపోరాటము జరిపినందులకు వారిని అభినందించుచున్నాము, మునగాల ప్రజల పోరాట సందర్భములో రెవెన్యూమంత్రిగారి వాగ్దానమును నెరవేర్చవలెనని ప్రభుత్వమును కోరుచున్నాము. మద్రాసు ప్రభుత్వమును పై వాగ్దానమును నెరవేర్చవలెనని కోరుచు గ్రామగ్రామాన సభలు జరిపి ప్రభుత్వానికి తెలియపరచవలెను. ఇందులకు పార్టీసభ్యులు శ్రద్ధవహించవలెనని హెచ్చరించుచున్నాము

2. పార్టీసభ్యులు శ్రద్ధవహించి జిల్లారైతు సంఘము తరపున వెంటనే వాలంటీర్లను చేర్చుటకు ప్రారంభించాలి. అగస్టు ఆఖరులోపుగా యీపనిని పూర్తిచేయాలి. వాలంటీర్లకు తరిఫీదు నిచ్చువారిని తయారుచేయుటకు అగస్టు 15 కు ట్రెయినర్సు క్యాంపు తయారు అగునట్లు పార్టీకార్యదర్శి చూడాలి.

3. జిల్లాబోర్డు ఎన్నికలలో జయము పొందుటకు మన జిల్లాకాంగ్రెసువాదుల మధ్య ఐకమత్యమును కలిగించాలి. అందుకు తూర్పు పశ్చిమ కృష్ణాజిల్లాలలో కాంగ్రెసువాదులమీద తీసుకోబడిన 'డిసిప్లినరీ' చర్యలు రద్దుచేయుట. పశ్చిమకృష్ణాలో 35 వేల కాంగ్రెసు సభ్యుల సభ్యత్వము పునరుద్ధరించబడుట అత్యావసరమని భావించుచూ అందుకు జిల్లా, రాష్ట్రకాంగ్రెసు కమిటీలు అన్నివిధముల ప్రయత్నించి కాంగ్రెసు ప్రతిష్ఠను కాపాడవలెనని కోరుచున్నాము.

* * *

తూ॥ గో॥ జిల్లా వాలంటీర్ యాత్ర.

అగష్టు 2 వ తేదీ బుధవారం ఉదయం రామేశ్వరంలో బయలుదేరి, రాజోలు, కొత్తపేట డివిజన్‌లలో సంచారంచేసి 9 వ తేదీ రాత్రికి రాజమండ్రి చేరును. పూర్తి వివరములతో కూడిన కార్యక్రమం కరపత్రములద్వారా తెలియచేయబడును. 10 వ తేదీని రాజమండ్రిలోయుండి 11 ఉదయం బయలుదేరి ముందుకు సాగిపోవును.

యాత్రలో పాల్గొనుటకు పలువురు స్త్రీలు, పురుషులు దరఖాస్తులు పంపుచున్నారు. ఈ నెల 18 వ తేదీలోగా చేరిన దరఖాస్తులుమాత్రమే పరిశీలించి తీసుకోబడును. తరువాత పంపినవారిని వాలంటీరు దళములో చేర్చుకోబడును గాని యాత్రలో పాల్గొనుటకు తప్పక అవకాశముండునని చెప్పుట కష్టము. దళంలో చేరువారికి భోజనం, బస మాత్రమే ఉచితముగ ఏర్పాటుచేయబడును. ఇతర ఖర్చులు ఎవరివారే భరించాలి. దళమువారు సప్లయిచేయు యూనిఫారములు బహు తక్కువగా నున్నవి కాన సాధ్యమైనంతవరకు యూనిఫారమ్ ఎవరివారు తెచ్చుకొనుటకు ప్రయత్నించాలి.

యాత్రలో బ్యాండు ఒకటి యుండును. ప్రస్తుత పరిస్థితులననుసరించి కొన్ని నాటకములు, కథలు తయారుచేసి, దళములోని వాలంటీర్లే ప్రదర్శించుటకు రిహార్సిల్సు వేయుచున్నారు. కార్మిక-కర్షక సమస్యలను గురించి, ప్రస్తుత రాజకీయ సమస్యలను గురించి కరపత్రములు విరివిగా పంచిపెట్టబడును.

యాత్రలో సాగించు కార్యక్రమం.

1. కారాచీ ప్రాథమిక హక్కులు, ఫైజుపూర్ వ్యవసాయిక ప్రణాళిక, ఎన్నికల ప్రణాళిక, త్రిపురీ జాతీయ వాంఛాతీర్మానము, కలకత్తా యుద్ధ ప్రతికూల తీర్మానము మొదలగు కాంగ్రెసు తీర్మానములు. ఈ మధ్య బొంబాయిలో సమావేశమయిన అ. భా. కాం. కమిటీ చేసిన నిబంధనావళి మార్పు, రాష్ట్ర కాంగ్రెసు కమిటీల అనుమతిలేనిదే సత్యాగ్రహము చేయకూడదు-కాంగ్రెసు కమిటీల నియమములలో నిమిత్తము లేకుండా మంత్రివర్గములు తమ యిష్టానుసారం ప్రవర్తింపవచ్చును మొదలగు విషయాలకు సంబంధించిన తీర్మానముల నిజస్వరూపము ప్రజాసామాన్యమునకు తెలియచెప్పుట.

2. ప్రజాసామాన్యములో చైతన్యము కలిగించి రానున్న స్వాతంత్ర్య సమరమునకు సంసిద్ధులుగ తయారుచేయుట.

3. కాంగ్రెసు సభ్యులను చేర్పించుట.

4. సామ్రాజ్య వ్యతిరేక శక్తులన్నింటిని సంఘటన పరచుట.

5. ఉత్సాహవంతులు, స్వాతంత్ర్య ప్రియులయిన యువక జనులను వాలంటీరు దళములో చేర్చుకొని, వారిలో రాజకీయ విజ్ఞానమును పెంపొందించుట.

6. జిల్లాలోని రాజకీయ ప్రచారకు లందరితోను సంబంధము ఏర్పరచుకొనుట.

7. కూలీల, రైతుల పరిస్థితుల గురించి తెలుసుకొని వారి హక్కులకొరకై ఆందోళన చేయుట.

8 కార్మిక-కర్షకులను సంఘటనపరచి, వర్గసంఘాలు ఏర్పరచుట.

9. జమీందారీ, యీనాం, రైతువారీ ల్యాండు ఆక్టులు, కార్మికచట్టము, యింకను కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికలో చేయబడిన వాగ్దానములు వెంటనే అమలు పరచుటకై ఆందోళన చేయుట.

ఈ యాత్ర జయప్రదముగా సాగుటకై కాంగ్రెసు, రైతు, కూలీ, విద్యార్థి, యువజన సంఘములు, స్థానిక కాంగ్రెస్ సోషలిస్టుపార్టీలు స్వాతంత్ర ప్రియు లెల్లరు సర్వవిధముల తోడ్పడవలయును.

క్యాంపు :
కొత్తపేట.
9.జూలై 39.

కా॥ పట్టాభిరామయ్య.
ఆర్గనైజరు,
తూ॥గో॥జి॥ వాలంటీరు దళం.

* * *

ఆంధ్రరాష్ట్ర విద్యార్థిమహాసభ

ది. 11-7-39 తారీఖున, కాకినాడ విద్యార్థిసంఘ సభ్యుల సామాన్యసభలో, ఈ క్రిందివారు, ఆంధ్రరాష్ట్రవిద్యార్థి మహాసభ అహ్వానము నిమిత్తము, ఆహ్వానసంఘముగ నియమింపబడిరి.

అధ్యక్షుడు : యస్. సూర్యేశ్వరశర్మ.
ఉపాధ్యక్షురాలు : శ్రీమతి లలితాదేవి.
ప్రధానకార్యదర్శి : పి. పట్టాభి రామారావు.
కోశాధికారి : సి హెచ్. వెంకటేశ్వరరావు

అహ్వానసంఘము, 12 తారీఖు ఉదయం కలుసుకొని, మహాసభను అగష్టు 2 వ వారం జరుపుటకు నిర్ణయించినది.

2. శ్రీసుభాసు చంద్రబోసుగారిని ప్రారంభోపన్యాసకులుగను, కామ్రేడ్ జొన్నలగడ్డ రామలింగయ్యగారిని అధ్యక్షులుగాను ఆహ్వానించుటకు తీర్మానించినది.

3. మహాసభ జయప్రదముగ జరుపుటకును వాలంటీరుదళము ఏర్పాటు చేయుటకు, కామ్రేడ్ పున్నయ్యగారు కెప్టెన్‌గా నియమింపబడిరి.

ఆహ్వానసంఘము యొక్కయు, కాకినాడ విద్యార్థిసంఘము యొక్కయు కార్యస్థానము, "బాదంబాడ్జి" దేవాలయం వీధియందు స్థాపించుటకు నిర్ణయించబడెను

ఆంధ్ర విద్యార్థుల ఉత్తర ప్రత్యుత్తరములన్నియు పై యడ్రసుకే జరుపవలయును.

పాలెపు సత్యనారాయణశర్మ,
ప్రధాన కార్యదర్శి.
తూర్పు గోదావరిజిల్లా విద్యార్థిసంఘము.

* * *

అనంతపురం మండల యువజన సంఘం

1. యువజనసంఘానికి ప్రాథమిక సభ్యులను యీనెలనుండి ప్రతితాలూకాలోనూ నూరుమంది దాదాపుగా చేర్చవలెను. అనూరుమందితోను ఆయాతాలూకాలలో కమిటీలను యేర్పరచవలెను. ఈపనిని జిల్లాను మూడుభాగాలుగా చేసి ఆయా కార్యదర్శులు కార్యవర్గసభ్యుల సాయముతో నెరవేర్చవలెను.

2. ప్రతితాలూకా కమిటీ ఒక్కొక స్టడీసర్కిల్ నడపవలెను. అందుకుకావలసిన పుస్తకాలను ఆయాకమిటీలవారే తెప్పించుకోవలెను. అందులో ఉంచవలసిన పుస్తకాలనూ పద్ధతిని మండలయువజనసంఘ కార్యవర్గమే నిర్ణయిస్తుంది తాలూకాకమిటీలు యేర్పడిన వెంటనే యీపనిని చేయవలెను.

3. యువజన సభ్యులను చేర్చేటప్పుడే కాంగ్రెసు సభ్యులను అక్కడక్కడ సభ్యులు వెంటనే విరివిగా చేర్చుటకు ఆరంభింపవలెను.

4. యీకమిటీకి ప్రస్తుత కార్యక్రమము యీవిధంగా నిర్ణయించినాము.

(1) ప్రతితాలూకాలోను ఒకకమిటీ ఏర్పరచడం. నూరుమంది సభ్యులను చేర్చడం. (2) తాలూకాకొక స్టడీసర్కిలు ఏర్పరచడము (3) ఆలిండియా కాంగ్రెసుకమిటీవారు సామ్రాజ్యవ్యతిరేక సంఘాలు నిర్ణయించే 'స్వతంత్ర దినం' వగైరా రోజులను చక్కగా జిల్లాయందంతటా కాంగ్రెసుకమిటీలతో కలసి జరిపేటట్టుచేసి ఆదినంయొక్క ప్రాధాన్యాన్ని జనసామాన్యానికి తెలిసేటట్టు చేయడం. (4) జనసామాన్యంలో రాజకీయ చైతన్యం కల్గించడం.

5 కాంగ్రెసు నేషనల్ డిమాండు తీర్మానాన్ని ప్రతివాళ్లకూ తెలిసేటట్టు చక్కగా ప్రచారం చేయడం, (6) యువకులలో సిద్ధాంత విజ్ఞానం, భావ వైశాల్యం కల్గించడం, (7) యీ విషయాలన్నింటికీ అనువయ్యే అప్పటి కప్పటికి కార్యవర్గం నిర్ణయించే యితర విధానాన్ని అమలు జరపడానికీ పూర్తిగా ప్రతిసభ్యుడూ పాటుపడవలెను.

అనంతపురం,
4—7—39

విశ్వం,
ప్రధానకార్యదర్శి.
మండల యువజనసంఘము.

* * *

ఆదిమాంధ్ర యువజనసంఘం

కామ్రేడ్ కమతం వెంకటేశ్వర్లుగారి ఆధిపత్యమున 5-7-39 తేదీన గుడివాడ తాలూకా మందపాడు గ్రామమున ఆదిమాంధ్ర యువజన సభ జరిగినది—

కామ్రేడ్ కమతం వెంకటేశ్వర్లుగారు యువజనుల కర్తవ్యమునుగూర్చి విపులముగా ఉపన్యసించిరి. యువజనసంఘములు జాతి, మత భేదములు లేకుండా జాతీయోద్యమమునకు సహాయము చేయవలెనని చెప్పిరి.

ఆ దినముననే తాలూకా సంఘము స్థాపింపబడినది.

అధ్యక్షుడు : యస్. సూర్యనారాయణగారు
ఉపాధ్యక్షుడు : కె చలమయ్యగారు
కార్యదర్శి : ఆర్ నాగభూషణంగారు
సహాయ కార్యదర్శి : కె. నారాయణరావుగారు
కోశాధికారి : సి.హెచ్. కోటేశ్వరరావుగారు

కార్యనిర్వాహకవర్గ సభ్యులు.

కె. సుందరరామయ్యగారు, ఆర్. జీవరత్నంగారు, కొరపాటి వెంకటేశ్వర్లుగారు, కె. శ్రీనివాసులుగారు.

సంపుటం 2 సంచిక 31

నవశక్తి

బుధవారం 19—7—39

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు), కంభంపాటి సత్యనారాయణ, పుచ్చలపల్లి సుందరయ్య, తుమ్మల వెంకట రామయ్య.

రాజకీయ ఖైదీలు

"ఈ పరిస్థితులలో మాకు రెండే గత్యంతరములు కాన్పించుతున్నాయి. బ్రిటీషు నిరంకుశత్వ, అహంకారాలకు లొంగి కృంగిపోవాలి, లేదా మా హక్కుల కొరకై మేము సర్వం తెగించి పోరాడాలి.

"సోదరులారా! లొంగిపోవడం అసంభవం: అంతకంటే ప్రాణాలు విడవడం మేలు. మా రాజకీయ ఖైదీలకు జరిగిన అక్రమమునకు మా ప్రాణాలు ఒడ్డవలసిన సమయం వచ్చింది. మా మొర అరణ్యరోదన మవుతుందా? మా ప్రాణావసాన సమయంలో సోదర దేశీయులందరూ మా విమోచనకై తమ శక్తినంతా ఏకీభవింపజేసి తోడ్పడ గోరుతున్నాము"

అని ఈ నెల 7వ తేదీ నుండి నిరాహార దీక్ష బూనిన బెంగాలు రాజకీయ ఖైదీలు భారత ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. మాతృదేశ విముక్తికై తమ సర్వస్వం అర్పించిన, యీ భారత వీరుల ఆక్రందనానికి ఏ కాంగ్రెసువాది హృదయము జలదరింపకుంటుంది? అయితే బయటనున్న మనము, కాంగ్రెసు మహాసభ, వీరి విడుదల విషయమై తగినంత కృషి చేసామా? మన కర్తవ్యాన్ని నెరవేర్చామా? అని ఆత్మ పరీక్ష చేసికోవలసి వుంటుంది.

1937 ఆఖరి భాగంలో అండమానుదీవుల్లో వున్న రాజకీయ ఖైదీలు నిరశన వ్రతము ప్రారంభించారు. భారత దేశపు జైళ్ళలోని ఖైదీలుకూడ వారితో కలశారు. అపుడు దేశమంతా అట్టుడికిపోయినట్లయింది. ప్రజాభిప్రాయానికి, కాంగ్రెసుమంత్రుల ఒత్తిడికి జంకి బ్రిటీషు ప్రభుత్వము అండమాను ఖైదీ లందరిని భారతదేశానికి రప్పించింది, కాంగ్రెసు మంత్రులు క్రమక్రమముగా తమ రాష్ట్రాలలోని రాజకీయ ఖైదీలను విడుదల చేసారు. ఈ విషయమై హరిపురా కాంగ్రెసు సమయములో బీహారు, యు. పి. మంత్రులు రాజీనామాలు సైతము యిచ్చి ప్రతిష్టంభన కలుగజేసారు కూడ. కాని అంతటితో ప్రజాందోళన ఆపివేయవలసిందని మహాత్ముడు కోరాడు. బెంగాలు వెళ్ళి మంత్రులతో రాయబారాలు జరిపాడు. బెంగాలు ప్రభుత్వం డెటిన్యూలను వదలింది, కొందరి ఖైదీలను మాత్రమే ప్రతికేసు పరీక్షించి వదలింది.

కాని గాంధీజీకి వాగ్దాన మిచ్చినటుల అందరిని విడుదల గావించలేదు. ఇంకా బెంగాలులో 120 మంది రాజకీయ ఖైదీ లున్నారు. పంజాబు ప్రభుత్వము క్రింద కొన్ని వందలమంది రాజకీయ ఖైదీ లున్నారు. గాంధి మహాత్ముని సలహాపై పట్టువడిన కామ్రేడ్ పృథ్వీసింగు కూడ జైల్లోనే వున్నాడు. పంజాబు శిక్షితు లయినవారు యు. పి. జైళ్ళలో కూడ కొంద రున్నారు. బయటి ప్రజాందోళనకు మహాత్ముడు అభ్యంతరము చెప్పుటచే అపుడు ఆపుజేయబడింది. కాని ఆ యా రాష్ట్రప్రభుత్వాలు విడుదల చేయక ఉపేక్ష వహించడంవల్ల అఖిల భారత కాంగ్రెసు కమిటీ కలకత్తా సమావేశము పంజాబు, బెంగాలు రాజకీయఖైదీల సమస్యను అఖిల భారతసమస్యగా చేయాలని తీర్మానించింది. తీర్మానాన్ని అనుసరించి అధ్యక్షునిచే నిర్ణయించబడిన ఏప్రియలు 13 వ తేదీ యావద్భారతదేశములో ఆవీరులను విడుదల చేయవలసిందని కోరుతూ సభలు జరుపబడ్డాయి. కాని ప్రజాభిప్రాయానికి పంజాబు బెంగాలు ప్రభుత్వాలు చెవి యొగ్గుట లేదు.

ప్రభుత్వాలతో గాంధీజీ రాయబారాలు విఫలమైనట్లు నిశ్చయమైన తరువాతనే కాంగ్రెసు కమిటీ అలా తీర్మానించింది. ఏప్రియలు 13 తేదీ సభల అనంతరము రాజకీయ ఖైదీల విడుదలకై ఏట్టి కార్యక్రమాన్ని యివ్వక కాంగ్రెసు కమిటీ విస్మరించినదనే చెప్పాలి. బయటనున్న మనము మన కర్తవ్యాన్ని నెరవేర్చకపోవుటచేతనే "ఆలీపూర్", "డండం" జైళ్ళలోని ఖైదీలు మరల నిరశన వ్రతము ప్రారంభించవలసి వచ్చింది. కాని విడుదలకొరకు నిరాహార దీక్ష పూనడము తప్పని గాంధీజీ చెబుతున్నాడు. ఇదివరకు బయటి ప్రజాందోళనను ఆపుజేయించింది గాంధీజీయే! ఇపుడు నిరాహార దీక్ష తప్పంటూన్న దీ గాంధీజీయే! కాని యిపుడు ప్రజాందోళన, ఒత్తిడి ద్వారా విడుదలకొరకు ప్రయత్నించాలని గాంధీజీ అంగీకరించుతున్నాడు. ఇదీ కొంత మేలే! కాని వేరు గత్యంతరము లేక పూనిన నిరాహార దీక్షను గాంధీజీ తప్పనడము మాత్రము విషాదకరము. కాంగ్రెసు నాయకత్వము వహించి ప్రజాందోళనను సాగించక పోవుటచేతనే వారు నిరశనవ్రతం చేయాలసి వచ్చిందనే సంగతి మరువరాదు. ఇప్పటికయినా మించినది లేదు. కాంగ్రెసు నాయకులు తప్పొప్పుల వివాదముతో కాలముబుచ్చక వెంటనే ఆందోళనకు పూనుకొనాలి. ఆసేతుహిమాచలపర్యంతము ప్రజానీకము రాజకీయఖైదీల విడుదలకొరకై ఆందోళన గావించుటకు స్పష్టమైన కార్యక్రమ మివ్వాలి, అలా కోరుతూ బెంగాలు రాష్ట్రమంతా 16 వ తేదీ సభలు జరుపబడ్డాయి. పీడిత బెంగాలు యొక్క ఈ కోరిక వర్కింగు కమిటీ గమనించాలి.

ఈ కార్యక్రమం జయప్రదం కావడానికి, కాంగ్రెసు రాష్ట్రాలలో కిసాన్, కార్మిక సత్యాగ్రహాలలో అరెస్టు చేయబడిన ఖైదీలను వెంటనే విడుదల గావించుట అత్యంత అవసరము. అలాచేయుట కాంగ్రెసు ఆందోళనకు నైతిక బలమిస్తుంది, కాంగ్రెసేతర మంత్రివర్గాలకు ఒత్తిడి కలిగిస్తుంది. ప్రజలకు ఉత్సాహమిచ్చి కార్యరంగానికి తెస్తుంది.

"మా ప్రాణావసాన సమయాన మాసోదర దేశీయులందరూ మా విమోచనకై తమశక్తినంతను ఏకీభవింపజేసి తోడ్పడ గోరుతున్నాము." అనే హృదయవిదారకమైన అవీరుల ఆక్రందనాన్ని పాఠక లోకానికి మరల జ్ఞాపకంచేస్తూ దేశమంతా వారి విడుదలకై ఆందోళన గావించాలని విన్నవించు తున్నాము. సోషలిష్టులు, కమ్యూనిష్టులు కాంగ్రెసువాదులు, కార్మిక కర్షక సంఘాలవారు, ఇట్టి సర్వాంగీకారమైన కార్యక్రమంలో భుజం భుజం కలిపి పనిచేయుటలోనే జాతీయ ఐక్యత కాపాడ బడుతుందని హెచ్చరిక చేస్తున్నాము.

సోషలిస్టు పత్రికలు.

'కాంగ్రెసు సోషలిష్టు' పత్రిక ఆగిపోయి యిప్పటికి నెలదినాలకు పైగా అయిపోయింది. జులై 16 వ తేదీ సంచికతో 'నేషనల్ ఫ్రంటు' పత్రిక కూడ తాత్కాలికంగా రెండువారాలు నిలిపివేస్తామని ప్రకటించబడింది. అంటే మార్క్సిష్టు దృక్పథంతో భారత రాజకీయాలను చర్చించి సోషలిష్టు భావాలున్న వారందరికీ నాయకత్వము వహించి నడుపవలసిన అఖిలభారత సోషలిష్టు, కమ్యూనిష్టు పత్రికలు నేడు ఆగిపోయా యన్నమాట. సోషలిష్టులలో అఖిలభారత పత్రికయొక్క అవసరాన్ని గుర్తించని వారుండరు. సోషలిష్టులలో ఐక్యత ఏర్పడి సంయుక్త సోషలిష్టు పార్టీ నిర్మించడానికి మార్క్సిష్టు పత్రిక అవశ్యకతను గురించి వేరే చెప్ప నక్కరలేదు. తీవ్రవాదు లందరుకూడ భారత రాజకీయాలను వివేచనా దృష్టితో పరిశీలించి, స్పష్టమైన కార్యక్రమాన్ని, పంథాను సూచించుతున్న 'నేషనల్ ఫ్రంటు' వంటి పత్రిక జాతీయోద్యమానికి అత్యంత అవుసరమని అంగీకరించు తారనే ఆశించుతాము.

ఈ అవసరాన్ని గుర్తించిన వారంతా 'నేషనల్ ఫ్రంటు' పత్రికను పునరుద్ధరించడానికి పూనుకోవాలి. సోషలిష్టు లందరూ చందాదారులను చేర్పించాలి. సానుభూతి పరులనుండి విరాళాలు వసూలుచేసి పంపాలి.

'నేషనల్ ఫ్రంటు' సంపాదకులు కామ్రేడ్ జోషీ కోరినటుల సోషలిష్టులు తమ పత్రికలను పోషించుటలో బోల్షివిక్ కాంపిటీషనుతో పనిచేయాలి. ఆంధ్రదేశములో బాకీవున్న ఏజంట్లనుండి బాకీలనువసూలుచేసి వెంటనే పంపించాలి. అఖిలభారత సోషలిష్టు పత్రికలను పోషించుటకు ఆంధ్ర సోషలిష్టులు తమ కర్తవ్యాన్ని నెరవేర్చటానికి పూనుకోవాలి. ఈ నెలాఖరులోగా 3 వేలు వసూలు అయితేనే "నేషనల్ ఫ్రంటు" అగష్టు 6 వ తేదీ వెలువడుతుందనే కామ్రేడ్ జోషీ హెచ్చరిక గమనించి కామ్రేడ్సు సర్వశక్తులు వినియోగించి పాటుపడాలి అని కోరుతున్నాము.

మన రాజకీయాలు

"మనపై పెద్ద ఉపద్రవం"

సిమ్లాలో యీ నెల 10–13 తేదీలమధ్య జరిగిన సంస్థానాధీశుల సమావేశం ఫెడరేషన్ విషయంలో ఇదమిద్ధమని యెట్టి నిర్ణయానికి రాకపోయినా, దాన్ని తిరస్కరించడానికి యెవరూ అంగీకరించడం లేదు. బొంబాయిలో జరిగిన మొదటి సమావేశంయొక్క నిర్ణయం వ్యక్తిగత సంస్థానాల మీద బైండింగు కాదని ఇండియా ప్రభుత్వం తెలియ జేసింది. "వైస్రాయి యొక్క సదభిప్రాయాన్ని మనం వినియోగించుకొనక పోతే, మనపై పెద్ద ఉపద్రవం ఒకటి రాబోతుంది. లిన్‌లిత్‌గో (వైస్రాయి) కాలంలో ఫెడరేషన్ రాకపోతే, ఎన్నో వాయిదాలు వేయవలసి వస్తుంది." అంటూ ఒక ప్రధాన సంస్థానాధీశుడు పలికాడు. ఢెంకనాల్, తాల్చేరు వగైరా తూర్పు ఇండియా ఏజన్సీ సంస్థానాధీశులు కలకత్తాలో సమావేశమై ఫెడరేషన్‌ని అంగీకరిస్తూ తీర్మానించారు. సంస్థానాధీశులందరూ తమ నిశ్చితాభిప్రాయాన్ని తెలియజేయడానికి మరొక నెల గడువు యివ్వబడుతుందనీ, యీ లోగా సంస్థానాధీశులతో వైస్రాయి రౌండు టేబిల్ సమావేశం జరుపుతాడనీ, రూఢి వార్తలు వస్తున్నాయి. అయితే ఆ సమావేశంలో ప్రధానాంశములు చర్చించబడవట. ఒక్కొక్కసంస్థానం ఫెడరేషన్‌లో చేరితే పరిష్కరించుకోవలసిన సమస్యలపై మాత్రమే చర్చలు సాగిస్తారట.

ఇవన్నీ చూస్తే. సంస్థానాధీశులమీద నమ్మకం పెట్టుకొని ఫెడరేషన్‌లో కొన్నిమార్పులు సంపాదించవచ్చునని ఆశించే కొందరు కాంగ్రెసు నాయకులు నిరాశచెందక మానరు.

ధామీసంస్థానములో తుపాకీ కాల్పులు

ఇక, సంస్థానాలలో నిర్బంధవిధానం యధారీతిగానే సాగుతోంది. హైదరాబాద్ జైళ్లలో యింతవరకు మొత్తం 14 గురు ఆర్యన్ సత్యాగ్రహులు మరణించారు. 1100 మంది సత్యాగ్రహులలో 500 మందిని నైజాం ప్రభుత్వం మెడికల్ కారణాల వల్లవిడుదల చేసింది. జైళ్ల పరిస్థితులు దారుణంగా ఉన్నట్లు విడుదల అయినవారు చెబుతున్నారు. ఇక తిరువాన్కూరు విషయం. శాసనోల్లంఘనాన్ని ఆపివేసి, తిరువాన్కూరు దివాన్‌తో సంప్రదించ వలసిందని గాంధీజీ స్టేట్‌కాంగ్రెస్ నాయకులకు సలహా యివ్వగా, నాయకులు ఆదే పద్ధతిని అవలంబించి నప్పటికీ, దివాన్ తన పట్టు విడవడంలేదు. తానుపిళ్లై వగైరా కాంగ్రెసు నాయకులు దివాన్ వద్దకు సంప్రదింపులకై వెళ్లినప్పుడు బయటినాయకులు, సంస్థలు తిరువాన్కూరు వ్యవహారాలలో కల్పించుకొనకూడదని, శాసనోల్లంఘనం ఇక ముందెప్పుడూ చేయకూడదని స్పష్టంగా తెలియజేశాడు. అట్టిహామీ యిచ్చిన తరువాతనే యితరసమస్యలపై చర్చించడానికి అంగీకరిస్తానన్నాడు. వల్లభభాయి, నెహ్రూ, లు యిచ్చిన సలహాపై మైసూరు స్టేట్ కాంగ్రెస్ నాయకులుకూడా మైసూరు దివాన్‌ని సందర్శించడానికి వెళ్లితే దివాన్ చూడడానికే నిరాకరించాడు. రెండోసారి నాయకులు జాబువ్రాశారు మళ్లీ అదే సమాధానం. సిమ్లావద్ద ధామీ అనే సంస్థానంలో ప్రజామండలివారు బహిరంగసభను యేర్పాటుచేస్తే, పోలీసులు తుపాకులు కాల్చారు. నలుగురు చనిపోయారు. 11 గురు గాయపడ్డారు.

గాంధీజీ 'హరిజన్' పత్రికలో యిల్లావ్రాసాడు; "కాంగ్రెసు నేడు దేశంలో ఒక బలమైన సంస్థ అనే విషయాన్ని సంస్థానాధీశులు గుర్తించవలసిందని వారిని నేను ప్రార్థిస్తున్నాను, ...తమ శ్రేయస్సును, దేశంయొక్క శ్రేయస్సును, మనస్సులో ఉంచుకొని, వారు హింసారాహిత్య పద్ధతిని అవలంబించవలసినదిగా కోరుచున్నాను." కాని, యీ సలహాను "అదర్శప్రాయమైన" మైసూరు, తిరువాన్కూరు సంస్థాన ప్రభుత్వాలే తిరస్కరిస్తున్నాయి. ప్రజాబలాన్ని చూపిస్తేనేగాని ఏ నిరంకుశ ప్రభుత్వమూ లొంగిరాదు. అయితే, బి. జి. ఖేర్ (బొంబాయి-ప్రధాని) వంటి కాంగ్రెస్ నాయకులే మైసూరు ప్రభుత్వం యొక్క "చాతుర్యా"న్ని స్తోత్రం చేస్తూ బహిరంగ ప్రకటనలు చేస్తూంటే ప్రజాబలం యెక్కడినుంచి వస్తుంది?

పంజాబులో నిర్బంధ విధానం

జాతీయ ప్రతికూల మంత్రివర్గం అధికారంలో ఉన్న పంజాబులో కూడా యిట్టి నిర్బంధవిధానమే చూస్తున్నాం. అ. భా రైతుసంఘ కార్యదర్శి శ్రీ సహజానంద సరస్వతి పంజాబులో అడుగు పెట్టకూడదని నిషేధాజ్ఞ యిచ్చారు. లాహోరు రైతు సత్యాగ్రహులమీద శిక్షలు అంతకంతకు ఎక్కువ చేస్తున్నారు. జలంధర్ జిల్లా రైతుసంఘ కార్యదర్శికి 2 సంవత్సరాల కఠినశిక్ష విధించబడింది. 10 ఏండ్ల బాలునికి 6 నెలల కఠిన ఖైదు; పంజాబులోని మలేర్‌కోట్లా అనే సంస్థాన ప్రజల సమావేశం జరుగుతూంటే, సర్దార్ మంగళ్‌సింగు, ఎం. యల్. ఏ., మొదలైన 14 గురు కాంగ్రెస్‌వాదులు అక్కడికి వెళ్లినందుకు ఎరస్టు చేయబడ్డారు. పోలీసులను ఆటంక పరిచారనే ఆరోపణమీద ఠయాగ్ కోటవద్ద 6 గురు కాంగ్రెసు వాదుల్ని ఎరస్టు చేశారు.

బెంగాల్ జైళ్లలో దాదాపు 100 మంది రాజకీయ ఖైదీలు నిరశనవ్రతం సాగిస్తున్నారు.

కాంగ్రెసు వాదు లేమి జవాబు చెప్పాలి?

అయితే, కొన్నికాంగ్రెస్ రాష్ట్రాలలో అనుసరించబడే పద్ధతులు కాంగ్రెసేతరప్రభుత్వాలకు ప్రోత్సాహం యిస్తున్నాయి. బీహార్ రాష్ట్రపు జైళ్లలో వందలకొద్దీ రైతు సత్యాగ్రహులు అనేక బాధలకు గురి అవుతూన్నా, వారు సాధారణ క్రిమినల్ ఖైదీలుగానే పరిగణించ బడుతున్నారు. వారినివెంటనే విడుదల చేయాల్సిందని, యీలోగా రాజకీయ ఖైదీల తరగతిలో వారిని చేర్చవలసిందని, మొన్న 9 వ తేదీని ఆసేతుహిమాచల పర్యంతం బహిరంగ సభలు, తీర్మానాలు, జరిగినప్పటికీ కాంగ్రెస్ మంత్రివర్గాలు వినిపించుకోవడంలేదు. ఇందుకొరకై బీహార్ రైతునాయకుడు రాహుల్ సంకృతాయన్ నిరశనవ్రతం చేయవలసి వచ్చింది. ఆయనను ప్రభుత్వం విడిచిపెట్టినప్పటికీ, ఛాప్రా జైలులో జూలై 7 వ తేదీనుంచి జగన్నాధప్రసాద్, రామబృక్ష, గారలు నిరశనవ్రతం సాగిస్తున్నారు. ముక్కుగుండా వీరికి ఆహారం యిస్తున్నారని ప్రభుత్వమే ప్రకటించింది. జగన్నాధప్రసాద్ ముక్కుగుండా రక్తం ప్రవహిస్తున్నదనికూడా ఆప్రకటనలో ఉంది. అటు జాతీయప్రతికూల మంత్రులు పరిపాలించే బెంగాల్‌లోనూ నిరశనవ్రతం చేస్తున్నారు; యిటుకాంగ్రెసు మంత్రులున్న బీహార్‌లోనూ నిరశరవ్రతం చేస్తున్నారు! బెంగాల్ ప్రభుత్వం యిటు బీహార్ ఉదాహరణను చూపిస్తే, కాంగ్రెసువాదులేమి జవాబు చెప్పాలి?

శెభాష్, సరిహద్దు ప్రధాని!

కాని, సరిహద్దులో మాత్రం కాంగ్రెసు మంత్రివర్గం యిట్టి విషమావస్థ రాకుండా జాగ్రత్తపడింది. సరిహద్దు రైతుసత్యాగ్రహంలో పాల్గొని శిక్షలు విధించబడిన సుమారు 200 మందిని విడుదల చేయవలసినదిగా అర్డర్లు జారీ చేయబడ్డాయి. వారిలో సరిహద్దు ప్రధాని కుమారుడైన ఒబీదుల్లాకూడా ఉన్నాడు. ఇతరరాష్ట్రాల్లోకూడా యిట్టి విధానం అవలంబిస్తే, కాంగ్రెసు సంస్థయొక్క గౌరవాన్ని కాపాడగలుగుతారు. మునగాల రైతు సత్యాగ్రహుల విడుదల విషయములో మద్రాసు రివెన్యూ మంత్రి స్పష్టమైన వాగ్దానం చేసియున్నను, ఇంకా వారిని విడిచిపెట్టకపోవడం ప్రజలు హర్షించజాలకున్నారు. కాకినాడ పీచుకూలీల సమ్మె విషయంలో శిక్షించబడిన కార్మిక నాయకులు మద్రాసు ప్రభుత్వం యొక్క వాగ్దానం నెరవేర్చుకొనేటట్లు చేయడానికి నిరశనవ్రతం చేయవలసివచ్చింది. మునగాల ఖైదీల విషయంలో అట్టి విషమపరిస్థితులకు తావు ఈయకుండా వారిని వెంటనే విడుదలచేసి సరిహద్దు ప్రధానిని అనుసరించవలసిందని మద్రాసు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.

మరొక మార్గం లేదు.

మధ్యపరగణాలలోకూడ కాంగ్రెస్‌మంత్రులే అధికారం చేస్తున్నారు. అయినా, రంజీ, చంద్లీ, మహగవాన్, కరౌండీ, బెండా, గ్రామాలభూములు మిలిటరీ శాఖవారు స్వాధీనం చేసుకొని,ఆయుధ యంత్రాగారం ఒకటి స్థాపించబోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యిందుకు ఆమోదాన్ని తెలియజేస్తూ ప్రకటన ఒకటి చేసింది.

ఈ ప్రకటనను గవర్నరు స్వతంత్రించి ఇచ్చి యుండాలి. యుద్ధవ్యతిరేక తీర్మానాన్ని ప్యాసుచేసిన కాంగ్రెసు సంస్థతరపున అధికారం స్వీకరించిన మంత్రులు తమ ఆమోదాన్ని యిచ్చి ఉండరు. అయినప్పటికీ వారికర్తవ్యం అంతటితో సరి కాదు. రాబోయే యుద్ధజ్వాలలలో భారతీయుల్ని అహుతిగావించడానికి, భారతదేశంలోనే ఆయుధయంత్రాగారాలు నిర్మించుకోవడానికి. పూనుకొన్న కేంద్రప్రభుత్వపువిధానాన్ని యెదుర్కొనవలసియుంటుంది. డం డం మొదలైన ప్రదేశాలలో ఇటీవల కొత్త ఆయుధ యంత్రాగారాలు స్థాపించబడ్డాయి కాని, బెంగాల్ ప్రభుత్వం కాంగ్రెసు మంత్రులచేతుల్లో లేదు కాబట్టి ఆప్రయత్నాలు సఫలమయాయి. కాని మధ్యపరగణాల కాంగ్రెసు మంత్రివర్గం కూడా ఆమార్గాన్నే అనుసరిస్తే, కాంగ్రెసుకు, దేశానికీ, ద్రోహం చేస్తున్నవారవుతారన్నమాట. ఈ ప్రయత్నాన్ని కేంద్రప్రభుత్వం మానుకొనేటట్లు మ. రా. మంత్రివర్గం చేయనైనా చేయాలి. లేకపోతే రాజీనామా యిచ్చి ఈవలికి రానైనా రావాలి; మరొక మార్గం ఏదీ లేదు.

బోసు తన ప్రకటనను ఉపసంహరించుకోవాలి

బొంబాయినగరంలో మద్య నిషేధాన్ని అమలు వరచటం చాలాకష్టసాధ్యం అనీ, బొంబాయి మంత్రివర్గం దీన్ని చేబట్టడంవల్ల పార్సీజాతివారి వ్యాపారానికి నష్టం వస్తుందనీ, ఆదనంగా విధించ బోయే అస్థి పన్ను చిన్న వర్తకులైన ముస్లిం ప్రజలకు హాని చేస్తుందనీ, సుభాష్ చంద్రబోసు ఒక ప్రకటన చేశాడు.

బొంబాయిలోని పార్సీ వ్యాపారస్థులకు యిందువల్ల నష్టం వచ్చినప్పటికీ, అశేషమైన కార్మికప్రజలకు మద్యపాన నిషేధంవల్ల ఉపయోగం కలిగి తీరుతుంది. అందువల్లనే, బొంబాయి కార్మికులు ఊరేగింపులు, సభలు జరిపి, మంత్రివర్గాన్ని బలపరిచారు. ఒక కనీస మొత్తం కంటె ఎక్కువ ఆదాయం వచ్చేవారిమీదనే అస్థిపన్ను పడుతుంది. కాబట్టి బీద ముస్లిం దుకాణదారులకు ఏవిధంగాను అపకారంచేయదు. ఇక శాసనం జయప్రదమవుతుందా. కాదా. అనేది చర్చనీయాంశం. జయప్రదం కావటానికి ప్రతి కాంగ్రెసువాది కృషి చేయాలి. బోసుగారు కష్టసాధ్యం అనడం సబబుకాదు. ఈప్రకటనవల్ల బోసు కాంగ్రెసు మంత్రులమీద తిరుగుబాటు చేయడమే ఉద్దేశంగా పెట్టుకున్నట్లు ప్రజలు అభిప్రాయ పడడానికి అవకాశం ఏర్పడింది. ఇప్పుడైనా బోసు దానిని ఉపసంహరించుకోవడం మంచిది. లేకపోతే అతివాద ఉద్యమం బలహీన పడుతుంది.

తప్పటడుగులు — వెక్కిరింతలు



"కార్మికుడు కార్మికుణ్ణి బలపరచడం—

....

బరంపురం వాడు బరంపురంవాడిని సమర్థించడం—

ఇదొక క్రొత్తతత్వం; సోదర తత్వం"

అంటూ ఆంధ్రప్రభ

"ఆ సిద్ధాంతమే నైటయితే, మరి ఆ పత్రిక తన సోదర పత్రికయైన ఆంధ్రప్రభపట్ల సోదరత్వం ప్రకటించ లేదేం. మరి; వ్యక్తులకు సోదరత్వం, పత్రికలలో 'స్వోదరత్వం' అన్నమాట" అని అంది.

★ ★ ★

నిజమే. ఏం చస్తాం? ఎక్కడ చూచినా ఈ"స్వోదరత్వమే" మరి. చూడండి.

'రాయలసీమ' మనవికి మేము "సోదరత్వం" అని హెడ్డింగు పెట్టితే కంపోజిటర్లు "స్వోదరత్వం" అని మార్చారు.

ఒకసారి—రెండుసార్లు—దిద్దాం

అయినా మార్పలేదు, ఏమయ్యా అంటే—

"ఇది మా కార్మికుల విషయం. ఇలాగే హెడ్డింగు ఉండాలి. లేకపోతే సమ్మె చేస్తాం" అని బెదరించారు.

ఇంకేం చేస్తాం!

మా 'సోదరపత్రిక' యెడల మాకు 'సోదరత్వం' ఉంది కూడా—

కార్మికులు—కార్మికులపట్ల చూపుతున్న 'స్వోదరత్వానికే' లొంగిపోయాం.

ఇందుకు 'విశాలవిశ్వజనీన కార్మిక కర్షకాభ్యుదయ హృదయం' గల ఆంధ్రప్రభకు—మేమూ "విశాలవిశ్వజనీన కార్మిక కర్షకాభ్యుదయ హృదయ"పూర్వకంగా సానుభూతి చూపుతూ క్షమించ గోరుతున్నాం.

★ ★ ★

అయినా ఇది "బూర్జువా" ప్రపంచం.

పత్రికలన్నీ వాళ్ళవే.

కాబట్టి ప్రతి జర్నలిస్టు బ్రదుకూ వారి మీద ఆధారపడుతుంది.

లేకపోతే 'స్వఉదరం'(స్వోదరం) నిండటం ఎలా?

కోటి విద్యలూ కూటికే గదా!

అందుకని మొదట 'స్వఉదరం'—

"స్వ ఉదర సమస్య" లేకపోతే కార్మికుడు సమ్మె చేయడు.

రైతు జమీందార్లు లాగిన పొలంలో తిష్ఠ వేయడు;

నిరుద్యోగి కాఫీహోటల్ బిల్లు చెల్లించకుండా పారిపోడు.

స్వఉదరం నిండినా—నిండకపోయినా,

లాఠీలు—తుపాకులతో చావ బాదుతున్నా,

'స్వఉదరం' కోసమే పోట్లాడే కార్మిక కర్షకుల కోసం తన జీవితం అర్పించాలని చూస్తాడు సోషలిస్టు; వట్టి ఫూల్!

★ ★ ★

నిజంగా సోషలిస్టులకు తలకాయ ఉంటే

"మహాజనో ....పంథా" అన్నట్లు—

మన స్వోదర జర్నలిస్టుల అడుగుజాడల్లోనడవాలి;

స్వోదరత్వం (స్వోదరిజం) అర్థం చేసుకోవాలి;

అందుకు—

జస్టిస్ పత్రికలో—జస్టిస్ పార్టీకి జై అంటూ

జనవాణిలో—పీపుల్సుపార్టీకి జై అంటూ

ప్రజామిత్రలో—చల్లపల్లికి జై, ద్రౌపదీ వస్త్రాపహరణానికి జై అంటూ

వాహినిలో—కార్మిక కర్షకులకూ జై అంటూ

ప్రభాతంలో—మంత్రులకు "సుప్రభాతం!" అంటూ ఉండాలి.

స్వోదరధర్మం!

చందాదారులకు మనవి

మద్రాసు ఆంధ్రప్రభ ఆఫీసులోని కంపోజిటర్లు సమ్మె సాగించుచున్నారు. ఆంధ్రప్రభ ఆఫీసు తరపున కొందరు 2–7–39 వ తేదీన తిరుపతికి వచ్చియుండి రాయలసీమ పత్రిక ఆఫీసులోని కంపోజిటర్లనే గాక తదితరులను కూడా కొంతమందిని మద్రాసు ప్రయాణమునకు తయారుచేసినారు. రాయలసీమ ఆఫీసుయొక్క అదృష్టమున ఈ ఆఫీసులో పనిచేయు హెడ్ కంపోజిటరు ఒక్కడు మాత్రము ప్రయాణమయినను ఏవో కొన్నిఅసందర్భములచేత నిలిచినాడు. అందుచే పత్రిక నిరాటంకముగా జరుగుచున్నది గాని పరిస్థితులు చక్కజేయబడువరకు 6 పేజీలలో పత్రిక వెలువడునని తెలియపరచుకొంటిని.

యం. యస్. కృష్ణయ్య

For మేనేజర్ "రాయలసీమ"

9—7—39

★ ★ ★

ఇంత చెప్పినా వ్యర్థమే.

సోషలిస్టులు నా సలహా వినరు.

'ఫార్వర్డుబ్లాకు పత్రిక'లవంటివాటికిప్రజల'పర్సు'పైనే ఆధారపడతారు;

అదే మన "స్వోదర జర్నలిస్టు" లయితే—

గుట్టు చప్పుడు గాకుండా

ఏమంత్రిగారి నాశ్రయించో,

లేక, ఏ పల్లెటూరి కుర్రాణ్ణో పట్టుకొని—

ఒక మాసపత్రికను పెట్టమని సలహా యిచ్చి—

పత్రిక ప్రారంభం గాకపోయినా, తను సలహా ఇచ్చిననాటినుండి జీతం అంటూ డబ్బు దిగమ్రింగి—

ఇదేమిటయ్యా అని అని అడిగితే, అతన్ని ఒక చెంపకాయ వేసి రెండు చెంపకాయలు తిని—

అయినా

స్వోదర తత్వాన్ని వెల్లడిస్తారు.

★ ★ ★

రైటిస్టులేమిటి

లెఫ్టిస్టులేమిటి

ఫార్వర్డుబ్లాకిస్టులేమిటి

సోషలిస్టులేమిటి

వీరందరిలోనూ "పీఠాధిపతుల వైఖరి ప్రబలుతోంది." ముఖ్యంగా 'బెజవాడ జియ్యంగార్ల' 'స్వాములవారి పీఠం' సోషలిస్టుపార్టీలో కూడ ఏర్పడింది.

దీనిని విధ్వంసం చేయాలనే ఆంధ్రప్రభ సవినయముగా ప్రార్థించుతోంది.

ఇది ఒక్క 'ఆంధ్రప్రభ' విధియేగాదు.

ఇది "స్వోదర జర్నలిస్టుల" విధి కూడాను.

ఎందుకంటే,

జర్నలిస్టుల హృదయం చాలా విశాలమయింది.

ఈ అక్రమాలను వారుగాక ఇంకెవరు తొలగిస్తారు?

ఎందుకంటే—

తక్కిన బ్లాకుల్లూ, పార్టీలూ ఎంత తన్నుకొన్నా ఈ 'స్వోదర' సమస్య పరిష్కరించలేదు.

వీరు తక్కినవాళ్ళకి దారి జూపి మార్గదర్శకులలయారు.

ఇలా అన్ని బ్లాకులకూ, పార్టీలకూ దోవజూపే వీరే అక్రమాల తొలగించాలి.

అందుకు మా స్వోదర జర్నలిస్టులకు ఒక విజ్ఞప్తి చేస్తాను.

★ ★ ★

ఎంత చెడ్డా నేనూ జర్నలిస్టును కదా!

కాబట్టి సోదర స్వోదర జర్నలిస్టులకు విజ్ఞప్తిచేస్తే ఫలిస్తుందని ఆశ.

వెంటనే స్వోదర జర్నలిస్టులంతా ఒక సంఘము ఏర్పరచాలి.

కార్మిక కర్షకులంటే హీనంగా ఉన్న జర్నలిస్టులకు సంఘావసరం వేరే చెప్పాలా?

ఏదైనా పేరు పొడుగ్గా ఉంటే బావుండదు.

ఆదీగాక దానికి ఇంగ్లీషు పేరు వస్తేగాని ఆలిండియా వ్యాప్తి జెందదు.

అందుకని దీనికి—

'స్వోదరిస్టు' సంఘం అనీ,

దీని సిద్ధాంతం

"స్వోదరిజం" అనీ,

ప్రకటించాలి.

దీనికి డబ్బు అంటారా?

ప్రజల 'పర్సు'మీద ఆధారపడనక్కర్లేదు.

పత్రికలన్నీ మన చేతిలోనే ఉండె! ఆదీగాక, ప్రతిచోటా సభ్యుల్ని చేర్పించి చందాలు వసూలు చేయవచ్చు.

సభ్యుల్నా—స్థానికంగా ఉండే ఏజంట్లను చేర్పించమంటే—ఏజన్సీ పోతుందేమోనని భయంచేత—చేర్పించి తీరతారు.

ప్రచారానికి పత్రికలేగాదు. పుస్తకాలుకూడా కావాలి.

అందుకు—

కామ్రేడ్ భాయీజాన్ చేత,

"స్వోదరిజం అంటే ఏమిటి?"

"స్వోదరిస్టు ప్రణాళిక"

"స్వోదరిజంలో నా అనుభవాలు—ఉపయోగాలు"

అనే గ్రంధాలను వ్రాయించి,

ముఖ్యంగా మూడో గ్రంధాన్ని హిట్లర్ 'మైస్ట్రగుల్' లాగా బహుళ వ్యాప్తి జెంది,

ప్రతి జర్నలిస్టు వద్దా ఉండేటట్లు 'స్వోదరిస్టు' సంఘం చూడాలి.

★ ★ ★

స్వోదరిస్టు ప్రణాళికకు మేం ఒకసూచనచేస్తాం.

తక్కినవన్నీ 'భాయిజాన్' గారే పూర్తిచేయగలరని నమ్ముతాం.

మా సూచన

(ఎ) ఇదివరకు "సర్వాంగే నయనం ప్రధానం" అన్నారు.

అది మార్చి యిపుడు "ఉదరం ప్రధానం" అనాలి.

(బి) దొంగతనం మొదలుకొని యుద్ధం వరకూ (ఈ రెంటికీ భేదంలేదు.) 'ఉదరం' కోసం జరుగుతున్నాయి కాబట్టి దీని ప్రాధాన్యత గుర్తించాలని సోదర జర్నలిస్టులను ఈ సంఘం ప్రార్థించాలి.

★ ★ ★

ఈసంఘమే స్థాపించబడితే—

సోషలిస్టు జియ్యంగార్ల బాధా,

కులతత్వ బాధా,

వదల్చుకొని, మద్రాసులోవచ్చి వాల్తాను.

శుభస్య శీఘ్రం....

"ప్రపంచ స్వోదరులారా ఏకము కండి!"

కార్మికవర్గ పార్టీ ఎలా వుండాలి?

[ప్రస్తుత మున్న కాపిటలిస్టు సమాజంలో అందరికంటే ఎక్కువ దోచుకోబడుతూ బాధ ననుభవించుతున్న కార్మికవర్గమే విప్లవం ద్వారా యీ సమాజ విధానాన్ని మార్చి, సోషలిజాన్ని స్థాపించుతుందని సోషలిస్టులు నమ్ముతారు. అట్టి విప్లవం జయప్రదంగా నడుపగలిగిన కార్మికవర్గపార్టీ (మార్క్సిస్టు పార్టీ) ఎలా వుండాలి? దానికి కార్మిక ప్రజాసామాన్యానికి వున్న సంబంధ మేమిటి? అనే విషయాలు యీ వ్యాసంలో గర్చించబడతాయి. ఇవి కామ్రేడ్ స్టాలిన్ అధ్యక్షుడుగా వున్న కమీషన్‌చే ప్రకటించబడిన "సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ చరిత్ర"నుండి గ్రహించబడిన నేషనల్‌ఫ్రంటు వ్యాసానికి అనువాదం.]

అగ్రగామి అయిన సైనికదళమే పార్టీ.

మార్క్సిస్టు పార్టీ కార్మిక వర్గంలోని ఒక భాగం: ఒక సైనికదళం వంటిది. అయితే కార్మికవర్గంలో అనేక భాగాలు వున్నాయి: అనేక దళాలు వున్నాయి: ప్రతిభాగం, ప్రతి దళం కార్మికవర్గ పార్టీ కాదు. పార్టీకి తక్కిన దళాలకు వున్న భేదమేమిటి? పార్టీ సామాన్య దళంకాదు: వర్గ చైతన్యం కలిగి అగ్రగామి అయిన మార్క్సిస్టు దళమే కార్మికవర్గపార్టీ. అది సమాజ చరిత్ర, పరిణామము, వర్గపోరాట సూత్రాలను తెలసికొన్న కార్మికవర్గ దళం. కార్మిక వర్గాని కంతటికీ నాయకత్వం వహించి నడపగలిగిన దళమే మార్క్సిస్టు పార్టీ. కాబట్టి కార్మికవర్గ మంతా పార్టీ కాదు: పార్టీ వర్గంలో పూర్తిగా చైతన్యంపొంది నాయకత్వం వహించి నడుపగలిగిన భాగమనే సంగతి మరచి పోరాదు. అందుచే ప్రతి సమ్మెదారు పార్టీలో సభ్యుడుగా చేర్చుకోబడజాలడు. పార్టీ, వర్గము ఒకటే అని తలచేవారు, పార్టీ సభ్యునికి ఉండాలిసిన చైతన్యం సమ్మెదారునికి వుండాలసిన చైతన్యం ఒకటే అని తలచేవారు. పార్టీ యొక్క ప్రాముఖ్యతను గుర్తించుటలేదన్న మాట. పార్టీ సభ్యునియొక్క 'లెవెల్' చైతన్య స్థాయి సామాన్య సమ్మెదారునికి స్థితికి తగ్గించ కూడదు; ప్రతి సమ్మెదారుని, ప్రతి కార్మికుని పార్టీ 'లెవెల్'కు తీసుకురావడానికి ప్రయత్నించాలి.

పార్టీ వర్గాన్ని ఉన్నతికి తెస్తుంది.

బోల్షివిక్ పార్టీని గురించి లెనిన్ యిలా చెప్పాడు: "మనది కార్మికవర్గ పార్టీ. అందుచే కార్మికవర్గము (యుద్ధసమయాల్లో, విప్లవ సమయంలో కార్మిక వర్గమంతా) మనపార్టీ నాయకత్వాన నడవాలి: మన పార్టీకి సన్నిహితంగా హత్తుకొని వుండాలి. కాని కేపిటలిజం వున్నంతకాలం కార్మిక వర్గమంతా సంపూర్ణముగాకాని, దాదాపుగాగాని పార్టీకి వుండవలసిన చైతన్యాన్ని పొందుతుందనీ, బోల్షివిక్కుపార్టీ "లెవెలు"కు వస్తుందనీ అనుకోడం వెర్రి. కాపిటలిజం వుండగా ఎంతో తక్కువ కట్టుబాట్లు, తక్కువ చైతన్యముతో చేరగలిగిన ట్రేడ్‌యూనియన్ల (కార్మిక సంఘాల) లోనే కార్మిక వర్గమంతా చేరుట సంభవంకాదనే విషయంలో పార్టీసభ్యులకెవరికి సందేహంలేదు. సైన్యంలో ముందంజ వేయవలసిన ప్రథమ శ్రేణికి ప్రజాసామాన్యానికి వున్న భేదం తెలసికొనకపోవుట, ప్రజాసామాన్యానికి అగ్రగామిగా, అదర్శప్రాయంగా పార్టీ వుండాలనే సంగతి మరచిపోవుటయే: మన కర్తవ్యం యొక్క అధిక్యతను తెలిసికోలేక అల్పంగా భావించుటయే."

సుశిక్షితమైన సైనికదళం

పార్టీ కార్మిక వర్గంయొక్క అగ్రగామి, చైతన్యం పొందిన దళము అగుటయేగాక చక్కని నిర్మాణం కలిగిన సుశిక్షతమైన సైనిక దళంవంటిది. పార్టీ డిసిప్లినుకు సభ్యులందరు బద్ధులైవుండాలి. పార్టీ సభ్యులందరు పైనుండి క్రిందివరకు ఏదోవొక పార్టీ నిర్మాణములో సభ్యులై వుండితీరాలి. పార్టీ సభ్యులు వివిధ స్థానిక పార్టీ నిర్మాణాలలో (అర్గనైజేషనులలో) సభ్యులుగా వుండక, కొంతమంది వ్యక్తుల కూడికగానే పార్టీవుంటే డిసిప్లిన్ (కట్టుబాట్లు) వుండజాలదు. పార్టీ నిర్ణయాలు అమలులో పెట్టించడం సాధ్యంకాదు. ఐక్యతాభావం యేర్పడదు. సమిష్టిగా పనిచేయలేదు. కార్మిక వర్గానికి నాయకత్వం వహించి నడుపలేదు. పార్టీ సభ్యులందరు (అర్గనైజుడు) నిర్మాణయుక్తంగా వుండి ఒక సైనికదళంవలె ఐక్యభావంతో పని చేస్తేనే కార్మిక వర్గాన్ని తన ఏకైక ఆశయం సాధించుటకొరకు పోరాటంలో నడుపగల్గుతుంది.

మెన్షివిక్కుల అభ్యంతరాలు.

అలాగయితే ప్రొఫెసర్లు, విద్యార్థులు, విజ్ఞానవంతులు పార్టీలో చేరడానికి అవకాశముండదనే అభ్యంతరాన్ని మెన్షివిక్కులు తెచ్చారు. అంటే వారు పార్టీ స్థానిక సంఘాలలో చేరడానికి, డిసిప్లిన్‌కు లొంగి పనిచేయడానికి అంగీకరించరన్నమాట. రెండవ కాంగ్రెసులో ప్లెఖొనావ్ అన్న మాటల్లో చెప్పితే, "అది వారి హోదాకు తక్కువ అని యెంచుతారు" అన్నమాట. కాని స్థానిక పార్టీ సంఘాలలో చేరి పనిచేయడానికి, డిసిప్లిను పాటించడానికి తయారుకానివారు సభ్యులుగా చేరడానికి అర్హులు కారు. అట్టివారు పార్టీలో జేరనక్కరలేదు. కార్మికులు పార్టీలో జేరడానికి సిద్ధపడితే డిసిప్లినుకు కట్టుబడడానికి జంకరు. అలా భయపడేవారు వ్యక్తిగతంగా ఆలోచించే విజ్ఞానులు మాత్రమే. అట్టివారు పార్టీ బయటనే వుంటారు. అది పార్టీకి మంచిదేకూడా. ఏమంటే పార్టీకి స్థిరత్వం లేని సభ్యుల బాధ తప్పుతుంది. (ముఖ్యంగా బూర్జువా ప్రజాస్వామిక విప్లవంలో యిట్టివారు చాలామంది ముందుకు వస్తారు)

"వివిధ అర్గనైజేషన్ల మొత్తం. కూడిక పార్టీ అని చెప్పినపుడు నేను కార్మిక వర్గానికి అగ్రగామి అయిన పార్టీ నిర్మాణయుక్తంగా వుండాలనీ, నిర్మాణానికి, డిసిప్లినుకు కట్టుబడి యుండేవారినే పార్టీలో చేర్చుకోవాలనీ నా అభిలాష" అని లెనిన్ చెప్పాడు.

"మార్టావ్ వాదనలు యావత్ కార్మిక వర్గ శ్రేయస్సు నాలోచించే చేయబడుతున్నాయని చెప్పుతున్నా అవి నిజంగా డిసిప్లినంటే భయపడే బూర్జువా విజ్ఞానులకే రక్షణ నిస్తాయి. ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజంలో యీ విజ్ఞానులకున్న ప్రత్యేకతలు వ్యక్తిత్వము హెచ్చుగా కల్గివుండుట డిసిప్లినుకు నిర్మాణానికి కట్టుబడి వుండకపోవుట మాత్రమే."

"కార్మిక వర్గం నిర్మాణానికి, డిసిప్లినుకు భయపడదు. నిర్మాణానికి, డిసిప్లినుకు భయపడే ప్రొఫెసర్లు, విద్యార్థులు, కార్మిక వర్గానికి అక్కరలేదు. మనపార్టీలో డిసిప్లిన్, నిర్మాణానికి లొంగివుండటం నేర్చుకోవాలిసింది, కార్మిక వర్గానికి చెందినవారు గాదు, విజ్ఞానులే. (Intellectuals)."

కార్మిక వర్గానికి నాయకురాలు పార్టీ

పార్టీ నిర్మాణయుక్తమైన కార్మిక సైనిక దళం మాత్రమేకాదు. అది కార్మికవర్గ "అన్ని నిర్మాణాలలోకి అత్యున్నమైన నిర్మాణము" అన్ని యితర నిర్మాణాలను నడుపుట పార్టీ కర్తవ్యము. అన్నిటికంటే ఉన్నతమైన నిర్మాణమగుటచే దానిలో కార్మిక వర్గంలో నాణ్యమైన వారందరూ, వర్గపోరాట సూత్రాలు, విప్లవ పోరాటాల అనుభవం తెలిసినవారంతా పార్టీలో వుంటారు. అందుచే పార్టీ కార్మికుల అన్ని నిర్మాణాలను నడపగలిగిన శక్తిగల్గి వుంటుంది. పార్టీయొక్క ప్రాముఖ్యతను తగ్గించే మెన్షివిక్కుల ప్రయత్నాలు పార్టీచే నడుపబడే అన్ని కార్మిక నిర్మాణాలను బలహీన పరుస్తాయి, తద్వారా పోరాడుశక్తిని తగ్గించి కార్మిక వర్గాన్నే బలహీన పరుస్తాయి. ఎందుచేతనంటే అధికారం స్వీకరించడానికి చేసే పోరాటంలో కార్మిక వర్గానికి నిర్మాణాన్ని (అర్గనైజేషను) మించిన ఆయుధం మరేమీలేదు.

పార్టీ ప్రజా సామాన్యంలో వేరూగావుండాలి

పార్టీ నిర్మాణము శ్రామిక ప్రజా సామాన్యానికి ప్రథమ శ్రేణిలోవున్న సైనిక దళానికి సంబంధం కూర్చేదిగా వుండాలి. ఎంతచక్కని నిర్మాణము, కట్టుబాట్లు కలిగివున్న సైనిక దళంవలే పార్టీవున్నా అశేష ప్రజా సామాన్యంతో సంబంధం కలిగివుండి, రోజురోజూ ఆ సంబంధాలను వృద్ధిచేసుకొంటూ వుండకపోతే పార్టీ అభివృద్ధి పొందలేదు. పార్టీ తనలో తానే 'గుడిగుడి కుంచంఆడి' ప్రజా సామాన్యంతో సంబంధం వీడిపోతేనూ, లేకపోతే వున్న సంబంధం కృశించితేనూ ప్రజా సామాన్యంలో వలుకుబడిని పోగొట్టుకొంటుంది. బలాన్ని కోల్పోతుంది: క్రమంగా కృశించి నశించి పోతుంది. పార్టీ జీవించాలంటే, అభివృద్ధి చెందాలంటే ప్రజా సామాన్యంతో సంబంధాలు హెచ్చుచేసికోవాలి: కోట్ల కొలదిగల శ్రామికవర్గ ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలి.

"బోల్షివిక్ పార్టీగా వుండాలంటే కార్మిక వర్గబలాన్ని సంపాదించాలి" అన్నాడు లెనిన్.

సెంట్రలిజం
(Principle of Centralism)

సరిగా పనిచేసి ప్రజాసామాన్యాన్ని నడువవలెనంటే పార్టీ కేంద్రీకృత సూత్రాలపై నిర్మింపబడాలి. ఒకేరూల్సు, డిసిప్లిన్ నిబంధనలు వుండాలి. పార్టీనంతటిని నడిపేదిగా పార్టీ కాంగ్రెసు వుండాలి: అది కలవడానికి వీలులేని మధ్యకాలంలో సెంట్రల్ కమిటీ నడపాలి. అధిక సంఖ్యాకుల నిర్ణయానికి అందరూ కట్టుబడి వుండాలి. వివిధపార్టీ సంస్థలు, కేంద్ర పార్టీసంస్థకు క్రింది సంస్థలు పైసంస్థకు బద్ధులై వుండాలి. ఈ షరతులను నెరవేర్చని కార్మిక వర్గ పార్టీ నిజమైనదికాదు: శ్రామికవర్గాన్ని జయప్రదంగా నడపవలసిన కర్తవ్యాన్ని నెరవేర్చలేదు.

జారు చక్రవర్తి నిరంకుశ ప్రభుత్వం క్రింద పార్టీ అక్రమ సంఘంగా వుండేది: అందుచే ఆరోజులలో పార్టీ నిర్మాణం క్రిందినుండి ఎన్నికలద్వారా జరుగుటకు వీలులేక పోవుటచే పార్టీ రహస్యంగా (కుట్రదారులవలే) పని చేయవలసివచ్చేది. కాని లెనిన్, జారుప్రభుత్వాన్ని తొలగించుటతోనే యీ అవస్థపోయి పార్టీ బహిరంగంగా క్రమమైన సంస్థగా పని చేస్తుందని చెప్పాడు. అపుడు ప్రజాస్వామిక సూత్రాల ననుసరించి ఎన్నికలద్వారా పార్టీ నిర్మాణం జరుగుతుందనీ, కేంద్రీభూత ప్రజాస్వామిక సూత్రం (డిమాక్రేటిక్ సెంట్రలిజం) అమలు జరుగుతుందనీ చెప్పాడు.

లెనిన్ యిలా వ్రాసాడు:- "ఇదివరకు మన పార్టీ వివిధ గ్రూపుల కలయిక గాని నిర్మాణయుతమైన పార్టీకాదు: అందుచే ఇదివరకు ఆదర్శాలు, ఆశయాలకు సంబంధించిన ఐక్యతే గాని యీ గ్రూపులమధ్య మరెట్టి సంబంధం వుండేదికాదు. ఇపుడు మనం నిర్మాణయుతంగా పార్టీగా ఏర్పడ్డాము అంటే అధికారయుతంగా పనిచేయడం, భావశక్తిని అధికార శక్తిగా మార్చి, క్రింది సంస్థలు పై సంస్థకు లోబడి పనిచేయడం ఏర్పాటు చెయ్యాలి."

మెన్షివిక్కులు నిర్మాణంయొక్క ఆవశ్యకతను అంగీకరించకపోవుట, పార్టీ డిసిప్లిన్ అధికారం అంగీకరించని అరాచకవాదమని ఆక్షేపించుతూ లెనిన్ యిలా వ్రాసాడు:-

"అరాచకవాదం రష్యను 'శూన్యవాదుల' (Nihilist) యొక్క చిహ్నం. అతడు పార్టీని భీతి గొల్పే ఫ్యాక్టరీగా భావిస్తాడు: పార్టీ సభ్యులు పార్టీకి లోబడటం మైనారిటీ మెజారిటీకి లోబడటం బానిసత్వం (Serfdom) గా భావిస్తాడు. పార్టీ కేంద్రంచేసే శ్రమ విభాగ ఏర్పాటులను అతడు పార్టీ సభ్యులను యంత్రభాగాలుగా చేస్తూందని ఆక్షేపించుతాడు (సంపాదకులను విలేఖరులుగా మార్చడం ప్రత్యేకమైన క్రూరత్వంగా తలుస్తాడు.) పార్టీ నిబంధనలను పాటించాలనే నియమం అతనిలో తిరస్కార భావం, విసుగుదల కలిగిస్తాయి; ఇదంతా చాందసమని (Formalism) ఈ నిబంధనలే రద్దుచేస్తే శ్రేష్ఠమనీ అంటాడు"

సమానమైన డిసిప్లిన్ (కట్టుబాటు)

దిన దిన కార్యక్రమంలో పార్టీ సభ్యులలో ఐక్యత వుండాలంటే, నాయకులకు సామాన్య సభ్యులకు ఒకేరకపు శ్రామిక డిసిప్లిన్ వుండాలి అందుచే పార్టీలో డిసిప్లినుకు బద్ధులవని "కొలది మంది ఘనులు" డిసిప్లిను ప్రకారం నడచుకోవలసిన "చాలమంది" అనే వివక్షత రాకూడదు. దీన్నో జాగ్రత్తగా వుండకపోతే పార్టీ సీతి సన్నగిలుతుంది. సభ్యులలో ఐక్యతకు భంగం వస్తుంది.

లెనిన్ యిలా వ్రాశాడు. "పార్టీ కాంగ్రెసు ఎడిటోరియల్‌బోర్డు నియమించాలనే విషయానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ సరియైన వాదనలు సూపించలేక మార్టోవ్ అంటాడు. 'మేము బానిసలము (Serfs)' (మిగతా 15వ పేజీలో)

కంగుంది జమీందారీలో రైతుల అవస్థలు

కామ్రేడ్ యన్. పద్మనాభరావుగారిట్లు వ్రాయుచున్నారు.

ప్రస్తుతం కంగుంది జమీందారీ (చిత్తూరు జిల్లా)లో అడవీప్రాంత్య రైతుల కష్టాలు చాల అధికమయినాయి. యీ ప్రాంత్యాలలో గడచిన సంవత్సరం వర్షాలు బొత్తిగాలేవు. శిస్తులు చెల్లించుటకు రైతులు తహతహలాడుచున్నారు. అందులోను సమ్మరీసూట్లు లెక్కకు మిక్కుటమయినాయి. ఋణపరిష్కార చట్టప్రకారం 1346, 1347 ఫసలీల శిస్తులు చెల్లిస్తే 1344, 1345 వగైరా ఫసలీల సిస్తు, రద్దుఅవుతుందని కాంగ్రెసు ప్రభుత్వం చట్టమొనర్చినది. అయితే మా జమీందారీ రైతులకు అభాగ్యం దొరకలేదు. ఏలన, మా జమీందారీలో జాయింటు పట్టాలు మిక్కుటముగా వున్నాయి. అట్టివారిలో యేవొక్కడో శిస్తు చెల్లించనప్పటికిన్ని ఆపట్టా పూరాపై చర్య జరుపుదురు. ఆపద్ధతిపై రైతుల పాతబాకీలు పూరాపై కోర్టు డిక్రీలు జరుగుచున్నాయి. యిందుకుతోడుగా ఇచ్చట ఫలశూన్యతయేకాక, భూములు నిస్సారములు. జలాశయములు బహుకొద్ది. మరమ్మతులు లేనేలేవు. మరమ్మతుచేయని చెరువులు పట్టాలకు సాగుకు యిస్తున్నారు. రైతులకు పంటలు పండనప్పటికిన్ని మేకలు మేపుకొని అందులో వుత్పత్తిగాగల పిల్లలను విక్రయించి శిస్తులు చెల్లించుచుండిరి. సుమారు 4 సంవత్సరములకు పూర్వం జమీందార్లు ఫారెస్టుయాక్టు క్రింద అడవులను గవర్నమెంటువద్ద వుచ్చుకొని, గ్రామ సరిహద్దులతోనే రిజర్వులైనులు కొట్టించి, ఇబ్బందులు కలిగించి నప్పటికిన్ని రైతులు మాత్రము మామూలుగా అడవిలో మేకలు మేపుకొంటూవచ్చిరి. కాని రెండు మూడు నెలలుగా జమీందారీ ఫారెస్టు సిబ్బందీలు పశువులను, మేకలను, బందిలదొడ్లకు కొట్టి నానాహింసలు పెట్టుచున్నారు. కాంగ్రెసు గవర్నమెంటువారు కూడా రాబోయే శాసనం విషయములో చాలా అనాదరణ చూపుచున్నారు. జమీందారీ బిల్లుకు పిదప వచ్చిన బిల్లులు ఎన్నో ప్యాసయి అమలు జరుగుచుండ యీ శాసనం యింకను ఎందుకు నిద్రపోవుచున్నదో తెలియదు.

చట్టము అమలుకు వచ్చునంతలో జమీందార్లు రైతులపై యుండు పగనంతయు తీర్చు కొనకంకణము కట్టుకొన్నారు. ఈ విషయమై స్థానిక కాంగ్రెసు, రైతు, సంఘములు ఎన్ని తీర్మానము లొనర్చినను గవర్నమెంటువారు బుట్టదాఖలు చేయుచున్నారు. కాన రాష్ట్రసంఘములైనను తగు శ్రద్ధ తీసుకొని అమాయక రైతుల కష్టములను తొలగించనిచో జమీందార్లకు రైతులు ఆహుతి అగుదురని గమనించ కోరుతున్నాను.

★ ★ ★ ★

కోవూరుతాలూకా రైతుసంఘ జమా—ఖర్చులు.

17-12-37 వ తేదీ నుండి 5-7-39 వరకు వివరములు.

జమ

సభ్యత్వపు చందాలవల్ల వసూలైనది	128	12	6
రాష్ట్రరైతుసంఘమువల్ల	15	12	0
సభ్యత్వపు పుస్తకాలు అమ్మినందువల్ల	1	4	0
	145	12	6

ఖర్చు

గ్రామసంఘాలకు యిచ్చినది	20	6	9
వర్కింగు మీటింగులు వగైరాలకు	3	7	6
ఆఫీసు ఖర్చులు	33	7	3
ప్రచారక ఖర్చులు	28	12	0
రాష్ట్రరైతుసంఘానికి కోటా పంపినది	49	0	0
కోవూరుతాలూకా ప్రథమ రైతు మహాసభాధ్యక్షునికి అయిన ఖర్చు	7	0	0
	142	1	8

జమలు మొ॥	145	12	6
ఖర్చులు మొ॥	142	1	6
నిల్వ	3	11	0

బి. శేషయ్య,
అధ్యక్షుడు.

★ ★ ★

ఇందుపూరు గ్రామ రైతుసంఘం

3-7-39 తేదీ రాత్రి 9 గంటలకు దేవాలయం ఎదుట ఇందుపూరు గ్రామ రైతుసంఘము నూకలపాటి వెంకారెడ్డిగారి అధ్యక్షతను సమావేశమై యీ క్రింది తీర్మానాలు గావించింది.

రైతులోకం

1. కోవూరు తాలూకా రైతుసంఘమునకు యీ క్రిందివారిని డెలిగేట్లుగా ఎన్నుకోవడమైనది.

యేలూరు బాబురెడ్డి, ఆదిశేషారెడ్డి, యన్. శంకరయ్యగారలు.

2. పురిణి మజరాలో అనేక సంవత్సరములనుండి శివాయి పొలమును చేసికొనుచున్న పురిణి మజరా వడ్డివాండ్లు, యిందుపూరు గ్రామ బల్జి మొదలగు కులములకు సంబంధించిన పేదవారికి యీ సంవత్సరము మామూలు శిస్తుగాక యకరా 1కి సుమారు రు 3-0-0 వరకు అపరాధమును విధించిన కోవూరు తాలూకా జమాబంది ఆఫీసరు చర్యకు అసమ్మతి తెలియజేయుచూ అట్లు విధింపబడిన అపరాధములను తిరిగి యిప్పించవలసినదిగా నెల్లూరు జిల్లా కలెక్టరుగారిని కోరుచున్నాము.

3. ఇందుపూరునకు సుమారు $1\frac{1}{2}$ మైలు దూరములో పురిణి మజరాలో నివసించు వడ్డివాండ్లకు చుట్టుప్రక్కల $1\frac{1}{2}$ మైలు దూరములో మంచి నీళ్లు లేనందున చాలా యిబ్బందిపడుచున్నారు. గాన వెంటనే బోరింగువేసి మంచి నీళ్ల సౌకర్యమును కలుగజేయవలసినదిగా లేబర్ డిపార్టుమెంటువారిని, జిల్లాబోర్డువారిని కోరుచున్నాము.

★ ★ ★

రైతుల విన్నపములు పెడచెవినిపెట్టుట ఉచితముకాదు.

ఏలూరు తాలూకా రైతుసంఘ సహాయ కార్యదర్శి అన్నే వెంకటేశ్వరరావుగారు ఏలూరు తాలూకా డిప్యూటీ కలెక్టరుగారికి యీ క్రిందివిధముగా వ్రాసియున్నారు :-

అయ్యా!

ఈ తాలూకాలోని సత్రం పాడుగ్రామ రైతుసంఘము 1938 అక్టోబరు మాసమున మీకు ఒక అర్జీ నిచ్చిరి. అందు 1937 వ సం॥ వర్షాలు లేక పంటలు పోయినందున ఎస్టేటువారు రిమీషన్ యిచ్చు సందర్భమున కర్ణంగారికి లంచం యివ్వనందున ఆయన అన్యాయం చేసినట్లు వ్రాయబడినది. కింది లెవెలు నందున్న పల్లపు తూము క్రింద రిమీషనివ్వడము, మెరక తూము క్రింద శిస్తు కట్టడము, ముగ్గురు కారణములతో ఆ లంచగొండితనాన్ని రుజువు పరచుటకు సదరు రైతుసంఘము యిప్పటికిని సిద్ధముగ నున్నది. కాని ది 23-12-38 న రెవిన్యూ యినస్పెక్టరుగారు నావద్దను, సత్రంపాడు రైతుసంఘ కార్యదర్శి మండవ కుటుంబరావుగారి వద్దను స్టేటుమెంట్లు గైకొనుటతప్ప యింతవరకు ఎట్టి విచారణయు జరిపించి యుండలేదు. ఒకవేళ దీనిని ఎస్టేటు సంబంధముగ భావించిన దీనికి బాధ్యులైన వట్లూరు కర్ణం ప్రభుత్వోగి మీ అధీనోద్యోగియై యున్నాడు. గాన దీనిని విచారించి తగు చర్య గైకొనుట మీ ధర్మము. ది 17-2-39 న సదరు రైతుసంఘ సమావేశమున తీర్మానించబడిన విధముగ మీకు ఒక నివేదకను సమర్పించబడినది. అందు గత వేసవిలో పని చేయించవలసిన తూముల మరమ్మతులు, కర్ణంగారి లంచ గొండితనము, ఇంకా యితర యిబ్బందులు తెలియపర్చినారు. దానికికూడా మీరేమీ శ్రద్ధ వహించలేదు. బాధ్యత గల మీవంటి ప్రభుత్వోద్యోగులు యీ విధంగా రైతు విన్నపములను పెడచెవిని పెట్టడం వుచితముగాదు. లంచగొండితనాన్ని నిర్మూలించుటకు ప్రత్యేక చట్టమును గావించవలసినదిగా రైతుసంఘాలు ఆందోళన గావిస్తున్న యీ సమయంలోకూడా లంచగొండితనాన్నిగురించి రైతు లిచ్చుకునే అర్జీలను నెలల తరబడి విచారించకుండా ఉపేక్షించడం ప్రభుత్వానికి చాల కళంకదాయకము. ది 17-2-39 న యిచ్చిన నివేదికనే యింతకాలముగ నిరీక్షించి మరల ది 3-7-39 న సదరు రైతుసంఘమువారు మీకు పోష్టు చేసినారు. యిపుడైనను మీరు తగు శ్రద్ధవహించి అందలి యిబ్బందులను గుర్తించి వారి కోర్కెల నెరవేర్చ గోర్తాను. లంచగొండితనాన్నిగురించి త్వరలో విచారించి తగు చర్య గైకొనుట తమ కనీస ధర్మమని విన్నవించుచున్నాను.

★ ★ ★

నెల్లూరుజిల్లా జమీన్ రైతుసంఘం

తే॥ 6-7-39 నాయుడుపేటలో నెల్లూరుజిల్లా జమీన్‌రైతు సాధారణ సంఘ సమావేశములో ఈక్రింది ఎన్నికలు జరిగెను.

అధ్యక్షుడు: గుత్తెలపూడి వెంకటసుబ్బానాయుడుగారు. ప్రధానకార్యదర్శి: చిల్ల గురునాధంగారు. సంయుక్త కార్యదర్శులు: నాగినేని వెంకయ్యగారు, వేనాటి మునుస్వామిరెడ్డిగారు.

సభ్యులు: బద్దెపూడి వెంకటనారాయణరెడ్డిగారు, నెల్లూరు వెంకట్రామానాయుడుగారు, పెళ్లూరు గోవిందురెడ్డిగారు, మల్ల వెంకటసుబ్బారెడ్డిగారు, వెలంపాటి కాళప్పరెడ్డిగారు, జూపల్లి రంగయ్యనాయుడుగారు, దొడ్ల వెంకట చలమయ్యగారు, బత్తిన పెరుమాళ్లనాయుడుగారు, రావిపాటి మహానంద చౌదరిగారు, పింగళి వెంకట సుబ్బయ్యగారు దువ్వూరు బలరామిరెడ్డిగారు.

తీర్మానములు.

ప్రకాశంకమిటీ సూచనను వెంకటగిరి మున్నగు ఫ్యూడల్ జమీందారులకు ఎంతవరకు అనువర్తింపనో నిర్ణయించుటకు ఈ క్రింది వారిని ఒక ఉప సంఘముగా నియమించడమైనది:—

బి. పెరుమాళ్ళనాయుడుగారు, బి. వెంకట నారాయణరెడ్డిగారు, ఓరుగంటి వెంకట సుబ్బయ్యగారు, కే. షణ్ముఖంగారు, రేబూరు సుబ్బరామిరెడ్డిగారు.

పై ఉపసంఘమునకు శ్రీ బత్తిని పెరుమాళ్ళనాయుడుగారిని కన్వీనరుగా నియమించడమైనది.

మరు కార్యనిర్వాహకవర్గ సమావేశము 25-7-39 తేదీ మధ్యాహ్నము 2 గంటలకు సూళ్లూరుపేటలో జరుగునట్లుతీర్మానించడమైనది.

★ ★ ★

మందపాడు రైతుకూలీ సంఘం.

మందపాడు ఆదిమాంధ్రులు 7-7-39 వ తేదీ రాత్రి 8 గంటలకు కామ్రేడ్ కమతం వెంకటేశ్వర్లుగారి అధ్యక్షతను సమావేశమయారు. వెంకటేశ్వర్లుగారు బీదరైతులు, వ్యవసాయ కూలీలను, భూస్వాములు ఏ విధంగా అన్యాయంచేసి యిబ్బందుల పెట్టుచున్నారో తెలియజేసి, కూలీలు తమ హక్కులు సంపాదించుకొనుటకు స్వశక్తిపైనే ఆధారపడి సంఘ బలాన్ని వృద్ధి చేసుకోవలసినదిగా హెచ్చరించారు.

★ ★ ★

నందిగామతాలూకా రైతుసంఘ ఎన్నికలు

ది 11-7-39 మధ్యాహ్నం నందిగామ తాలూకా రైతుసంఘ నూతనసభ్యుల సమావేశము శ్రీయుత చింతమనేని శివలింగయ్య, బి. ఏ., గారి అధ్యక్షతక్రింద భాస్కరానంద ఆశ్రమములో జరిగెను.

ఈ క్రిందివారు ఏకగ్రీవముగా కార్యనిర్వాహక వర్గమునకు ఎన్నుకొనబడిరి:

కాపా లక్ష్మీనారాయణగారు, (అధ్యక్షుడు) యేజెల్ల వెంకటసుబ్బయ్యగారు, (ప్రధాన కార్యదర్శి) బండి తిరుపతయ్యగారు, కర్నాటి సాంబయ్యగారు (సహాయ కార్యదర్శులు) సభ్యులు: చింతమనేని శివలింగయ్యగారు, దేవాబుచ్చి రామశేషయ్య శ్రేష్టిగారు, జవ్వాజి వెంకటప్పయ్యగారు, పొందూరు అనంతరామయ్యగారు, గుజ్జా రామిరెడ్డిగారు, వారెడ్డి రాధాకృష్ణగారు, మహమ్మద్ మీరా సాహెబుగారు, వీరమాచనేని వెంకటేశ్వరరావుగారు, చావ రామలింగయ్యగారు, తొంగపు నారాయణగారు, తాతినేని రామకోటయ్యగారు.

చైనా స్వాతంత్ర్య జన్మదాత సన్ యట్ సేన్

కామ్రేడ్ జి. సి. కొండయ్య

క్వాంగుటంగు రాష్ట్రానికి సంబంధించిన హాయీచాంగు అనే గ్రామంలో యిప్పటికి 73 యేండ్లనాడు (1866-11-12 వ తేదీనాడు) ఒక క్రైస్తవ కుటుంబంలో సన్‌యట్‌సేను జన్మించాడు. తల్లిదండ్రులు యేదో కొద్దిభూమితో సేద్యం చేసుకొనే రైతులు. సన్‌యట్‌సేన్ అంటే చైనాభాషలో శాంతిమాత అనిపేరు. తల్లిదండ్రులు అప్పుడు చైనాపై సల్పుచున్న విదేశ దాడులనుగురించి చైనాప్రజల అవస్థల గురించీ చెప్పుకుంటుంటే, యీ బాలుడు వింటుండేవాడు. 10 వ యేట సన్‌యట్‌సేన్‌ను బడికి పంపేరు. చదువేగాక వడ్రంగి పనికూడా నేర్చుకొంటూ ఉండేవాడు. హువాయీ ద్వీపములో వ్యాపారం చేస్తున్న అన్న సన్‌యట్‌సేన్‌కు యింగ్లీషు చెప్పించాలని ఆ ద్వీపం తీసుకెళ్లాడు. 5 సంవత్సరాలు అన్నగారి సహాయముతో యింగ్లీషు చదువుకొన్నాడు. ఇచ్చట యింగ్లీషు చదివేటప్పుడే క్రైస్తవమత గ్రంథాలు, ప్రపంచ చరిత్రా తిరగేస్తూ వుండేవాడు.

జీవితాన్ని మార్చివేసిన సంఘటన

చదువుపూర్తయి స్వగృహానికి రావాలని ప్రయాణమై వస్తూవుండగా, సన్‌యట్‌సేన్ జీవితాన్నే మార్పుచేయ గలిగిన ఒక అవమానం జరిగింది దారిలో. తన తోటి మిత్రులూ తనూ కాన్‌టన్ రేవులో దిగగనే-సుంకపుద్యోగులు (ఇంగ్లీషువారు) వీరిని భరించరాని అవమానం చేసారు. గుడ్డలువలచి శరీరమంతా సోదా చేశారు. ప్రక్కనున్న ఇంగ్లీషువారిని యేవిధమయిన అన్వేషణ లేకుండా వదిలేశారు. ఈప్రవర్తన స్వాభిమానముగల యే మానవుని కలవరపరచదు? చైనాదేశములో చైనా ప్రజలు యితర దేశస్థులచే అవమానపడుట యెవరు సహిస్తారు? ఇక చైనా స్వాతంత్ర్యము కొరకు యెంత త్యాగాన్నైనా చేయబూనిన 18 సంవత్సరాల యువకుడగు సన్‌యట్‌సేన్ సహిస్తాడా? సన్‌యట్‌సేన్ తనదేశాన్నిగురించీ తన ప్రజలకు జరుగు అవమానాన్ని గురించీ చింతిస్తూ, దీనికి ప్రతీకారమేమా అని ఆలోచిస్తూండేవాడు. ఆ సంవత్సరమే ఫ్రెంచివారు చైనాపై దాడిసల్పి, ఆనాం అను ప్రదేశాన్ని అతి నిర్దాక్షిణ్యంగా వశపరచుకొన్నారు. తన దేశమున జరుగు యీ దుర్భర పరిస్థితులకు సన్‌యట్‌సేన్, కంగారవుతూ ఉద్రేకుడౌచుండేవాడు.

విద్యార్థులలో కృషి

యీ హృదయ పరితాపముతోనే జపాను కేగి డాక్టరుకోర్సు మరి 5 సంవత్సరాలు చదివి ప్యాసయ్యేను. జపాన్‌లో చదివేటప్పుడు ఇంక 3 గ్గురు విద్యార్థులతో రాజకీయాలనుగురించీ, చైనా బానిసత్వాన్ని గురించీ చర్చిస్తుండేవాడు. ఎట్లయినా చైనాప్రజల బానిసత్వాన్ని బాపుటకు తీవ్ర ప్రచారం సాగించి ప్రజల చైతన్యుల నొనర్చి తిరుగుబాటు తేవలెనని విద్యార్థులతో చెప్పేవాడు. విద్య పూర్తిచేసి, కాన్‌టన్‌లో ఉద్యోగంలో చేరేడు. కాని అప్పటి చైనా రాజకీయ వాతావరణమూ చుట్టూ జరుగు నిరంకుశత్వమూ, నిరంకుశత్వాన్ని ధీకొనే విప్లవ పోరాట వాయువులూ, సన్‌యట్‌సేన్‌వంటి యువకుని ఉద్యోగం చేయనిస్తాయా? సన్‌యట్‌సేన్ వెంటనే దేశములో రహస్యముగా పనిచేయుచుండిన విప్లవకారుల సంఘాలలో పనిచేయ సాగేడు. ఈ రహస్య సంఘములు సోదర సమితి అనుపేర వ్యవహరింపబడుచుండెను. సన్‌యట్‌సేన్ యీ సంఘముల స్థాపించుట కొరకు సల్పిన కృషి వర్ణనాతీతము. ఈ సమయముననే విదేశస్థులు చైనాను ముక్కలు ముక్కలుగా విభజించి పంచుకొని పాలించుచుండిరి. తమ స్వలాభమునే ఆదర్శముగా గొని మంచూ చక్రవర్తులు దేశమును విదేశీయుల కమ్ముచుండిరి. ఇప్పుడే సన్‌యట్‌సేన్ జపాన్ వెళ్లుట తటస్థించెను. అయినా జపాన్‌లో చదువుచున్న చైనా విద్యార్థులమధ్య స్వాతంత్ర భావము రేకెత్తించి, హిన్‌చంగు హుయి (చైనా పునరుద్ధరణ) అను సంఘముల స్థాపించి విద్యార్థులను స్వాతంత్ర విప్లవము వైపుకు మరలించెను.

ఆయుధ సేకరణ

ఆ రోజుల్లో చైనాలో విదేశస్థుల పై ద్వేషము సముద్ర కెరటములవలె పై కెగరుచుండెను. చైనా ప్రజలు విప్లవ నినాదములు



సన్ యట్ సేన్

ఆకాశము బ్రద్దలగునట్లు అరచుచుండిరి. చైనా ప్రజల అసంతృప్తి, విదేశస్థుల నిరంకుశ విధానమూ అవగాహన చేసుకొనుచున్న సన్‌యట్‌సేన్ వెంటనే చైనా ప్రవేశించి కాంటన్ నగరమున ఒక ధనికుని సహాయముతో సన్ అంచు కంపెనీ, (అను వ్యాపారసంస్థ) నొకదానిని స్థాపించి, విప్లవకారులకది కేంద్రంగాపెట్టుకొని పని సాగించెను. సన్ అంచు కంపెనీవారు విదేశస్థులపై సాగించు యుద్ధమునకు పీపాల కొలది ఆయుధములు యితర దేశముల నుంచి తెప్పించేవారు. యీ పీపాలు విదేశాన్నుంచి దిగుమతి అయ్యేటప్పుడు ఒకసారి అధికారుల కంటపడ్డాయి. అధికార్లు సోదాచేయగా ఖాళీగా వున్న ఆ పీపాలలో 600 పిస్తోళ్లు దొరికినవి. విప్లవకారుల యీ ప్రయత్నాన్ని సామ్రాజ్యవాద ప్రభుత్వాలు కొనసాగనిస్తాయా? వెంటనే కాంటన్‌లో ఆఫీసులూ, యిండ్లూ సోదాచేసారు. విప్లవ ప్రయత్నము కొనసాగించ పూనుకొన్న స్వాతంత్రవాదుల లిస్టులకొరకు యెన్నో భయంకర పద్ధతు లవలంభించారు. ఎట్టకేలకు 70 మంది వీర యువకుల తలలు ఛేదించింది ప్రభుత్వము. పందలమందిని జైళ్లలో పడేసింది. కాని విప్లవ నాయకుడైన సన్‌యట్‌సేన్‌మాత్రం కనుపించ లేదు.

తప్పించుకు పారిపోయాడు

సన్‌యట్‌సేన్ విప్లవ చాతుర్యముతో కొంతమంది మిత్రుల సహాయంతో ఒక కూలివాని బుట్టలో దాక్కున్నాడు. కూలీ-రైతుల స్వాతంత్రముకొరకేగదా సన్‌యట్‌సేన్ యీ అవస్థ అని గ్రహించిన ఆ శ్రమజీవులు కాన్‌టన్ నగర గోడపై నుండి ఆ బుట్టను యీవల విసరివైచిరి. విప్లవవాది బయటపడ్డాడు. ఐనా ప్రభుత్వము యింతటితో వదలక తన చేతగానితనాన్ని ప్రకటించింది. 15 లక్షల రూపాయలిస్తాము; సన్‌యట్‌సేన్‌ను పట్టివ్వమని ప్రకటించింది. కాని యిట్లాంటి ప్రయత్నాలతో విప్లవం అణుగుతుందా? సన్‌యట్‌సేన్ జుట్టు కత్తిరించి వేషము మార్చి అచ్చం కట్టెలుకొట్టె జపానుకూలీలాగ తయారయాడు. చన్ శాసో అనేపేరుతో జపాన్‌లో దిగాడు. యీ కూలీపేరు యిప్పటికిని చైనాలో ముఖ్యమగు కొన్ని వీధులకు సార్ధక నామధేయమయింది. స్వాతంత్రవాదికి యెక్కడ పని వుండదు యీ నిరంకుశ ప్రపంచములో? జపాన్ విద్యార్థులలో విప్లవ బీజాలు నాటమొదలెట్టాడు సన్‌యట్‌సేన్ జపాన్ ప్రభుత్వం ప్రపంచ నిరంకుశులకు క్రిందిచెయ్యి అవుతుందా? వెంటనే సన్‌యట్‌సేన్ ప్రచార ప్రమాదాన్ని గుర్తించి జపాన్ వదలిపొమ్మని తాఖీదులు పంపింది. సన్‌యట్‌సేన్ అమెరికాకు ప్రయాణమయ్యాడు. దారిలో అతనికి వైద్య విద్య గరపిన డాక్టరు జేమ్సుకాంట్లీనికలుసుకున్నాడు. ఆయన అమెరికా ప్రోగ్రామయిన వెంటనే యింగ్లండు రమ్మని ఆహ్వానించాడు. సన్‌యట్‌సేన్ అమెరికాపోయి విద్యార్థులలో తీవ్రప్రచారమొనర్చి అక్కడగూడా చైనా పునరుద్ధరణ సంఘములు స్థాపించి, ఇంగ్లండు బయలుదేరాడు. వెనుక వెన్నంటి వచ్చుచున్న చైనా సి. ఐ. డి లు యింగ్లండుకు కూడా ప్రయాణమైరి. యింగ్లండులో డాక్టరు జేమ్సును కలుసుకొని మరల వచ్చెదనని చెప్పి యెచ్చటికో వెడలిపోయాడు.

నిర్బంధము:—విడుదల

ఎచ్చటికి పోయెనో అక్టోబరు 17 వ తేదీ అర్ధరాత్రివరకూ, జేమ్సుకుతెలియదు. 1896 అక్టోబరు 17 వ తేదీ రాత్రి 12 గంటలప్పుడు ఒకయువతి డాక్టరు జేమ్సు యింట ప్రవేసించి అతి ఆతురతతో జేమ్సును నిద్రావస్థనుండి మేల్కొలిపెను. ఆదరిపడిలేచిన జేమ్సుకు ఆయువతి నోటినుండి యీమాటలు వినవచ్చెను.

"నే నవసరకార్యమున అతి రహస్యముగా వచ్చితిని. లండను నగరమున నున్న చైనా రాయబారి యింటిలోని ఒక నౌకరు భార్యను నేను. నే నిచ్చటికి వచ్చినవార్త యెవ్వరికీ యెరిగించకు" ఒక కార్డు అతనిపై పారవేసి వెళ్లిపోయెను. ఆశ్చర్యమున కంగారు చెందియున్న డాక్టరు జేమ్సు ఆతురతతో కార్డును చదివెను. అందిట్లున్నది. "నన్ను అకస్మాత్తుగా పట్టుకొని చైనా రాయబారియింట దాచివైచిరి. నన్నిచ్చటనుండి చైనాకు హత్యగావించుటకొరకు గొనిపోవుచున్నారు. నన్ను ఒకస్టీమరుపై చైనాకు గొనిపోవ ప్రయత్నించుచున్నారు. కార్డుతెచ్చిన మనిషిని బయటపెట్టకుము." సన్‌యట్‌సేన్. ఈ కార్డు జేమ్సును కలవరపరచి కార్యాచరణకు గడంగునట్లు చేసెను. ఆ రాత్రియే అన్వేషణాశాఖయగు స్కాట్లండుయార్డువారిని నిద్రలేపి విషయ మెరిగించెను. కాని జేమ్సును మందలించిరి కాని అన్వేషణకు దిగవైరి. మరునాడు రెండవరోజూ, బ్రిటిషు మంత్రులతో మొరపెట్టుకొనెను. కాని ఆ డౌనింగు స్ట్రీటుల్లోనున్న బ్రిటీషు మంత్రులకు యీ వార్త యేమీ చెవినిపడలేదు. సామ్రాజ్యవాదుల అన్వేషణా న్యాయమూ ప్రజల రక్తమాంసములను హరించుటకే కాని న్యాయాన్వేషణకు కాదనుసంగతి పరదేశ సామ్రాజ్యవాదం క్రింద దాస్యభారముచే నలుగు మనకూ తెలుసుగా! ఇక ఆఖరి ప్రయత్నంగా పత్రికా ప్రపంచానికి యీ వార్త అందించాడు. వెంటనే పెద్దపెద్ద హెడ్డింగులతో సన్‌యట్‌సేన్ నిర్బంధవార్త ప్రపంచమందలి మారుమూలలకు కూడా ప్రాకింది. ఒక విదేశ స్వాతంత్ర్య వాదిని మా కండ్ల యెదుట యీ విధంగా నిర్బంధించడము చైనా రాయబారికి లండనులో అధికారము లేదు! యే దేశస్థుడైనను ఇంగ్లండులో ఇంగ్లండు ప్రభుత్వమే శిక్షించాలి గాని యితర ప్రభుత్వాలకు అధికారం లేదని పత్రికలు దండెత్తసాగాయి. ఈ నిర్బంధ వార్త విని యే స్వాతంత్రవాదీ సహించడు. వార్త తెలిసిన కొన్ని గంటలకే స్వాతంత్ర సంఘమువారు చైనా రాయబారిని ముట్టడించి సన్‌యట్‌సేన్‌ను విడువవలెనని ఆందోళన చేసిరి. ప్రపంచములో స్వాతంత్రముకోరు ప్రతి సంఘమూ ఆందోళనా, సానుభూతి ప్రకటించెను. ఈ వత్తిడికి బ్రిటిషు మంత్రులు బెదరసాగిరి. ఇంగ్లండు ప్రధానమంత్రి అయిన మిస్టర్ శాలిస్బరీ చైనా రాయబారికి విడుదల చేయమని వుత్తరువు పంపెను. వెంటనే ఇది

గమనించిన చైనారాయబారి సందుదారిన సన్‌యట్‌సేన్‌ను బయటకు త్రోసెను. ఈ కొద్ది రోజుల నిర్బంధమే కొన్ని సంవత్సరములు లాగుందని ఒకసారి సన్‌యట్‌సేన్ అన్నాడు.

సైనికులలో ప్రచారం

విడుదల అయినవెంటనే సన్‌యట్‌సేన్ యూరపు అంతా సంచారము చేశాడు. కారెల్‌మార్క్సు, ఎంగిల్సు లెనిన్ గ్రంథాలు చదువనారంభించాడు. కేవలం జాతీయతే మానవ స్వేచ్ఛనివ్వజాలదని గ్రహించి ఆర్థిక రాజకీయ మానసికక స్వాతంత్రమే ప్రజలకు మోక్షదాయకమనిగుర్తించ గలిగేడు. యూరప్‌నుండి బయలుదేరి, టర్కీ, పాలస్టయిన్, హిందూదేశముల దర్శించి, సయాం మలయామార్గమున జపాన్ చేరెను. చైనా చరిత్రలో యెక్కువ బహుమానమును బొందవలెనన్న సన్‌యట్‌సేన్ శిరము తెచ్చియిచ్చిన చాలునని చైనా చక్రవర్తి ప్రకటించి యుండెను. రెండుసార్లు దుర్మరణమును తప్పించుకొన్న సన్‌యట్‌సేన్ 1898 లో జపాను చేరెను. అచ్చట విద్యార్థులు యీ విప్లవవాదిని ఘనంగా ఆహ్వానించిరి. ఇప్పటికి చైనా ప్రభుత్వము కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టుచున్నదని విన్న సన్‌యట్‌సేన్ విద్యార్థులలో వుపన్యసిస్తూ యీ విధంగా పలికేడు. "సంస్కరణలవలన ప్రజాసామాన్యము బాగుపడజాలదు కావలసినది సంపూర్ణ ప్రజా స్వామ్యమే" సన్‌యట్‌సేన్ మూలికలమ్ము కోయవానివలె తయారై కాన్‌టన్‌కు వుత్తరమున హ్వాయిజోలోనున్న చైనా సైనికులలో పని చేయసాగాడు. సైనికులేయనను అతిరహస్యంగా దాచి స్వతంత్రోద్దేశముల పెంపొందించు కొనుచుండిరి. అప్పుడొక పత్రిక కూడా యీ ఉద్యమము నడిపించు చుండెను. ఒకనాడు సన్‌యట్‌సేన్ హాంకాంగు ఆయుధములు కొరకై పోయి ఆయుధములు తెచ్చుచుండ సుంకపుఅధికార్లు గుర్తించి కాన్‌టన్ రేవులో దిగనివ్వక అష్టపడిరి. వెంటనే పడవవారది గమనించి వర్మోజా దీవులకు తీసుకొనిపోయి, వదలిరి. సన్‌యట్‌సేన్ నినాదము యువకుల బాగా ఆకర్షించింది. స్వాతంత్రం కొరకు ఆహుతి అయ్యేటట్లు చేసింది. యిప్పుడు జపాను దుండగీడులకు దెబ్బకు దెబ్బ చెల్లించుచుండేవీ యువకులే. చైనాలో ప్రభుత్వమును తారుమారు చేసిన కమ్యూనిష్టు వుద్యమముకూడా యువకులచే. అప్పట్లో యువకులు "మరణమునకు సాహసించినవారు" (Dare-to-die) అను సంఘములు స్థాపించారు. ఆ సంఘములలో యువకులు విరివిగా చేరారు స్వాతంత్ర పోరాటములను ప్రాణములో తుచ్ఛంగా యెంచి, ఆహుతి యైరి. సన్‌యట్‌సేన్ మరల యూరప్ పోయి 1904 లో అఖిల చైనా స్వతంత్ర మహాసభ జరిగినప్పుడు హాజరై ఆ సభకు అధ్యక్షుడై ఆ సభపేరు కుమింగ్‌టాంగ్ అని మార్చినాడు.

చైనాలో తిరుగుబాట్లు

1904—9వరకు దేశములో తిరుగుబాట్లు పొడచూపెను. ఇందు ముఖ్యమైన తిరుగుబాటు హ్యాయిజోలో సన్‌యట్‌సేన్ సైనికులకునేర్పిన తిరుగుబాటుతత్వము ఫలించకపోలేదు. హ్వాయిజో సైనికులు తిరుగబడిరి. కాని ప్రభుత్వము యీ తిరుగుబాటునుకూడా అతి క్రూరంగా అణచివేసింది. చాలమంది సైనికులు వురితీయబడిరి. చాలమంది జైళ్ల కంపబడిరి. క్రమక్రమంగా విప్లనాలను తాత్కాలికంగా అణచివేశారు. చైనా ప్రభుత్వంగాని, చైనాలో వున్న విదేశప్రభుత్వములుగానీ, సన్‌యట్ చైనాలో వుండుట కిష్టపడవైరి. చైనా వదలవలెనని ఆర్డరిచ్చారు. సన్‌యట్‌సేన్ జపాను చేరాడు. కాని, జపాను ప్రభుత్వంలో సన్‌యట్‌సేన్ వంటి వీరునికి చోటుంటుందా? వదలమన్నారు జపానును. ఇండో - చైనా చేరేడు. చేరినవెంటనే సరిహద్దు దాటమని ఆర్డర్లు. ఫిలిప్పయిన్ దీవులు చేరాడు కదులుతావా లేదా అని మళ్ళీ ఆర్డర్లు. ఇక మానవునికి ప్రపంచములో తావు లేదా? ఈ ప్రపంచం మానవులు నివసించ వీలులేనిదా? సామ్రాజ్యవాదులు ప్రపంచంలో వున్నంతవరకూ, స్వేచ్ఛగోరు మానవులకు యిట్లాంటి కష్టాలు యెప్పుడూ దాపరమవుతాయి. సన్‌యట్‌సేన్ అప్పుడు అమెరికా పోయాడు. ఈ లోగా చైనాలో విప్లవకారులు ప్రజలలో తీవ్రప్రబోధము గావించిరి, చైనా విప్లవజ్వాలలతో దహించుకపొయ్యేటట్లుంది. అనేకవేలమంది వీర యువకులు స్వాతంత్రంకొరకు ఆహూతి అయిపోతున్నారు. చాలమందికి యావజ్జీవ శిక్షలు.

విప్లవ విజయం

ప్రజా వెల్లువలో యీనిర్బంధాలు అగుతాయా? వేలకొలది సంవత్సరాల నుంచి పాతుకొన్నరాచరికం (మానార్కి) చైనాలో అంతరించింది. స్వాతంత్ర్యవాదులు జయించారు. వెంటనే కొమింగుటాంగువారు సమావేశమై చైనా ప్రభుత్వమునకెవ్వరధ్యక్షుడని వాదప్రతివాదములు జరిపి తుదకు చైనా స్వాతంత్ర్య జ్యోతి అనుకొనే సన్‌యట్‌సేన్‌ను రమ్మన్నారు. అమెరికానుంచి 1911 డిశంబరు 4వ తేదీన బయలుదేరి, షాంఘే చేరాడు. ప్రజల వుత్సాహానికి మేరలేదు. చైనా స్వాతంత్ర పతాకాన్ని లేవనెత్తారు. స్వాతంత్రముకొరకు జరిగిన పోరాటములో దోషులని నిర్బంధించబడిన స్వాతంత్ర్య యోధులు జైళ్లనుంచి బయటబడిరి.

అంతర్యుద్ధం

కాని ఉత్తర ప్రాంతమున యీ యుఆషికాయివారి అనుచరులు సన్‌యట్‌సేన్‌ను వ్యతిరేకించిరి. దేశములో స్వార్థపరులు విదేశస్థుల ప్రోత్సాహంతో సన్‌యట్‌సేన్ వంటి అతివాది, అధ్యక్షుడుగారావటం యిష్టంలేక వ్యతిరేక ప్రచారం సాగించారు. ఇంగ్లీషు ప్రభుత్వము దేశములోని యితరప్రభుత్వాలు ద్రోహులు ఒకనై "యీయినుషికాయిని అధ్యక్షుడుగా తీసుకొంటేమేమూ ప్రజా ప్రభుత్వమును వొప్పుకొంటా"మని ప్రకటించారు. ఈ కల్లోలములో సన్‌యట్‌సేన్ అధికారవాంఛతో పెనుగులాడక, దేశౌన్నత్యము కొరకై అధ్యక్ష పదవిని త్యజించెను. కాని యిది చైనా ప్రజల సౌఖ్యమునే ద్వంసంచేసెను వెంటనే యీయిఆషికాయి కుమింగుటాంగుకు వ్యతిరేకంగా సైనిక పరిపాలన సాగించసాగేడు. అంతేగాదు. యీదేశద్రోహి కుమింగుటాంగు శెక్రటరీ అయిన చంగ్ చౌజన్‌ను హత్యచేయించెను. విదేశస్థులతో కుట్రలుసల్పి రాజ్యభారమువారి కొసగి దేశమును నానాభ్రష్టుత్వము చేసి వ్యతిరేకించిన వారిని అనేక దౌర్జన్యాలకు గురిచేసి రాజరికమే కావలెనని రాజుగా ప్రయత్నించెను. సన్‌యట్‌సేన్ జపానులో నుండెను. అప్పుడే అమెరికాలో చదువు పూర్తిచేసి వచ్చుచున్న ఒక చైనా ధనికుని కుమార్తె సన్‌యట్‌సేన్‌ను ప్రేమించి వివాహమాడెను. చైనా ప్రజలు రాచరికమును వ్యతిరేకిస్తూ బ్రహ్మాండమయిన విప్లవము తెచ్చుటకు ప్రయత్నించుచుండుట గ్రహించెను. స్వాతంత్రము భగ్నము చేయు యీయిఆషికాయిని వ్యతిరేకించు స్వాతంత్ర యుద్ధములో పాల్గొనుట తన విధియని యెంచి వెంటనే చైనా ప్రవేశించి, "స్వాతంత్ర యుద్ధం సాగించండి" అను కరపత్రాల ద్వారా చైనా ప్రజలకు తన సందేశం వినిపించాడు. "చక్రవర్తి పాలననశించాలి! ప్రజా పరిపాలన వర్ధిల్లాలి" అను నినాదాలు చైనాలో మారుమ్రోగెను. యీప్రజా పోరాటానికి భీకావహుడైన యీయిఆషికాయి చక్రవర్తి రాజ్యమును త్యజించి పిచ్చియెత్తి 1916 జూన్ 6 తేదీని మరణించెను. ఉత్తర దిశలో అధికారము కొరకు సైనిక నాయకులు వారిలోవారు పోరాడుచుండిరి. దక్షిణ దిశను కాన్‌టన్ నగరమున విప్లవకారులు విజృంభించి, ప్రజా స్వామ్య ప్రభుత్వము స్థాపించిరి సన్‌యట్‌సేన్ అధ్యక్షుడాయెను. వెంటనే "విదేశ ప్రభుత్వము లిచ్చిన రుణములు చెల్లవు. దేశద్రోహానికి వడిగట్టుకొన్న పికింగు ప్రభుత్వాన్ని కూలద్రోయండి."అనే తీర్మానాలు చేయబడ్డాయి.

చన్‌హూక్కా అను కొండజాతివానినికాన్‌టన్ సర్వసేనాధిపతి అయ్యేటట్లు చేసేరు. కాని పూపెవుసేనాని, కాన్‌టన్ ప్రభుత్వాన్ని కూలద్రోయ కుట్రలు సల్పుచుండుట సన్‌యట్‌సేన్ గ్రహించి, అతినికి వ్యతిరేకముగా సేనల నడుపుమని వుత్తరువులు పంపగా చన్‌హూక్కా ఆవుత్తరువుల వ్యతిరేకించి, వూపివుతో కుట్రలు సలిపి సన్‌యట్‌సేన్‌ను చంపి సముద్రములో పారవేయుడని ఆజ్ఞాపించెను. చన్‌హూక్కాను తొలగించితినని సన్‌యట్‌సేన్ ప్రకటించెను. సైనికులు ఎట్లయినను తనను చంపివేయనున్నారని గ్రహించి సన్‌యట్‌సేన్ ఒక వోడలో దాగుండెను. చన్‌హూక్కా ఓడవారికి లంచమిచ్చెను. ఓడవారు సన్‌యట్‌సేన్‌ను ఒక గదిలో నిర్బంధించిరి. సన్‌యట్‌సేనా వోడవారికి తన వుద్యమము నెరింగించి యెంతో బ్రతిమిలాడెను. వినవైరి. ఆఖరి సందేశంగా 3 గంటలసేపు తన దేశబానిసత్వాన్ని గురించి, కొత్తప్రభుత్వాన్నియెదిరించవలసిన అవసరాన్ని గురించి గంభీరోపన్యాసము చేసాడు ఓడ కూలీలకు యీఉపన్యాసం బాగాఅర్థమయింది. కండ్లనీళ్లు రాల్చారు. వెంటనే రేవులో వున్న బ్రిటిషు స్టీమరులోనికి అతనిని మార్చారు. సన్‌యట్‌సేన్‌కు నిర్బంధముతొలగింది. ఆసమయముననే యీ నాటి జంగ్-కే-షేక్ దారిలో సన్‌యట్‌సేన్‌ను కలుసుకొనగా ఆయనద్వారా తన దేశానికి ఒక సందేశాన్ని పంపాడు. "దేశద్రోహియైన చన్‌హూక్కాను హతమార్చి ప్రజాసామాన్యమును కాపాడుడు" అని సందేశం.

రష్యా సహాయం

షాంఘేలో సన్‌యట్‌సేన్ ఉండగా సోవియట్ రష్యా ప్రతినిధియైన అబ్రహాం అడాల్ఫు జోషి సన్‌యట్‌సేన్‌ను దర్శించి యితరదేశ స్వాతంత్ర్యపోరాటములకు సహాయపడ్డట్టే నీ వుద్యమమునకుకూడా సహాయపడతామని తెలియజేసాడు. రష్యా సహాయమును సన్‌యట్‌సేన్ అంగీకరించెను. రష్యావిధానాన్ని ప్రేమించాడు. రష్యా విధానమే మానవ కళ్యాణమన్నాడు. కాన్‌టన్‌లో సైనికోద్యోగులకు వ్యతిరిక్త పోరాటమారంభమయింది. సన్‌యట్‌సేన్ పంపిన సందేశము పోరాటానికి మరీ తోడ్పైంది. ప్రజలు పోరాటమును దిగ్విజయంగా సాగించి సైనికోద్యోగుల నోడించి సన్‌యట్‌సేన్‌ను అధ్యక్షుడుగారమ్మని కబురంపారు. రష్యానుండి సైనికోద్యోగులు కాన్‌టన్ వచ్చిరి. యీ వచ్చిన 70 మంది రష్యా నిరంకుశ ప్రభుత్వమును మార్చి సోవియట్ రాజ్యాంగాన్ని స్థాపించిన విప్లవ వీరులలోనివారు. వీరు కాన్‌టన్‌లో మిలిటరీ స్కూళ్లు స్థాపించి ప్రజలకు సైనిక శిక్షణ నొసగి, విప్లవపు ఎత్తులు ప్రజల కెరిగించిరి. ధనికులు, యితర స్వలాభపరులతో కూడుకొని యున్న కొమింగుటాంగులో సామాన్య ప్రజలకు ప్రాతినిధ్య మిచ్చి ప్రజాసంస్థగా పునర్నిర్మాణముచేయ తలపెట్టి 1924 లో మహాసభ యేర్పాటుచేసిరి.

అఖిల చైనా క్యూమింటాంగ్ మహాసభ

సభకు విదేశాలనుండి 199 మంది ప్రతినిధులు యేతెంచిరి. సభకు సన్‌యట్‌సేన్ అధ్యక్షుడాయెను. ఈ సభలో "విదేశ సామ్రాజ్యవాదుల, దేశీయ స్వలాభపరుల, నెదిరించి సామ్రాజ్యవాదము నంతమొందించి చైనా ప్రజాస్వామ్యమును స్థాపించవలెను. కార్మిక కర్షకులు విరివిగా కుమింగుటాంగులో చేరవలెను. రైతు కూలీ, విద్యార్థి, స్త్రీ సంఘాలు స్థాపించాలి. కమ్యూనిస్టులను కుమింగుటాంగులో చేర్చుకొనవలెను." అని తీర్మానించారు. రష్యాను అభినందించారు. ఇంకా చాల ముఖ్యమైన తీర్మానములుకూడా చేసారు. రైతు కూలీ సంఘములు స్థాపించుటకొరకు సన్‌యట్‌సేన్ చేసిన సేవ అపారము. చైనా స్వాతంత్రాన్ని గురించి అనేక గ్రంథాలు వ్రాసి ప్రకటించాడు. సన్‌యట్‌సేన్ చైనాయందంతటను తిరిగి లక్షలకొలది ప్రజలకు స్వాతంత్ర్య సందేశమిచ్చాడు. 1924 లో ఈ వీరుడు జపాను పోయినప్పుడు యీతనికి జపాను ప్రభుత్వం బద్ధవిరోధి అయినా ప్రజలుమాత్రం స్వాగత మిచ్చుటకు లక్షలకొలది వచ్చారు. ఇంతలో సన్‌యట్‌సేన్ ఆరోగ్యం చెడింది. ఫెల్లరు ఫౌండేషన్ అను ఆసుపత్రిలో వుండగానే రోజురోజుకు వ్యాధి జాస్తి అయింది. దేశీయులు విచార సాగరంలో మునిగారు.

తుది సందేశం

తుది సందేశమివ్వమని సన్‌యట్‌సేన్‌ను వేడిరి సన్‌యట్‌సేన్ తుది సందేశము ప్రకటించెను. "నా దేశీయులకు స్వాతంత్ర్యపోరాటము పూర్తి కాలేదు. చైనాప్రజలకు స్వతంత్రమును సమానత్వమును సంపాదించుడు! యీ వుద్దేశ్యములు మనం నెరవేర్చదలచుచో సామాన్య ప్రజలను విప్లవోద్రేకులనుచెయ్యాలి. ప్రపంచంలోని శ్రమజీవులేకమై పోరాడవలెను. అతిస్వల్పకాలములోనే మీరు జయము పొందుటకు కృషి చేయవలెను."

రష్యా సోదరులకు ఈ సందేశ మిచ్చాడు:-

"సోదరులారా! కొలదికాలములో బలవత్తరమైనట్టియు స్వతంత్ర మైనట్టియు, స్నేహితుడుగను చెలికాడుగను, చైనాజాతికి రష్యా సోవియటు ప్రజా స్వామ్యము స్వాగత మిచ్చు సుదినము రానున్నదనియూ అపుడు రెండు జాతు లొకటై ప్రపంచమునందలి పీడిత శ్రమజీవుల స్వాతంత్రము కొరకు జరుగు పోరాటములో సహాయముచేసి జయముపొందుదురనియూ నాకుగల ఆశను వెల్లడిచేయుచున్నాను."

1925-3-12 తేదీనాడు రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ హాస్పిటల్‌లో "పోరాడుడు! శాంతిని స్థాపించుడు. శ్రమజీవుల కాపాడుడు" అను తుది మాటలతో యీ మహాశయుడు ప్రాణము వీడెను. కాని యీనాటికిని చైనాలో జపానీయులకు వ్యతిరిక్తముగా జరుగు పోరాటంలో యువకులు యీ విప్లవమూర్తినే ఆదర్శంగా గైకొని సంస్మరిస్తారు.

చీనా దో … దనం

రచయిత:

త్రెషియో కోవ్

అనువాదం:

శ్రీకృత్తివా స తీర్ధులు

(నవ్యసాహిత్య పరిషత్తు)

★ పరిచయం ★

ఈ నాటిక బెర్లిన్‌లోనూ, న్యూయార్కులోనూ, మాంచెస్టరు లోనూ, జపానుదేశములోనూ ప్రదర్శింపబడినది.

దీని రచయిత ట్రెషియోకోవ్ మాస్కో నగరంలోని అతివాద గ్రింధకర్తలలోనివాడు. ప్రస్తుతము దక్షిణ రష్యా సమిష్టి వ్యవసాయ క్షేత్రం తరపున పత్రికా సంపాదకుడిగా ఉన్నాడు. రష్యా విప్లవానంతరం అఖండ పరివర్తనతో బయలుదేరిన నవ్య సాహిత్య యుగంలో ట్రెషియో కోవ్ విశిష్ట గ్రంధకర్త. ఇతని నాటకములో పాత్ర పోషణ, స్వభావోన్మీలము కనపడవు. దృశ్య కావ్య దృష్టితో చరిత్రను పరిశీలిస్తాడు. ఇదే ఇతని ప్రత్యేకత.

రష్యావారి కళ అత్యంత వాస్తవికమైనది. మానవ జీవితమును చక్కగా, సూక్ష్మంగా పరిశీలించి విషయాన్ని వ్యక్తీకరిస్తారు. కళ ప్రచార యోగ్యంగా, ప్రబోధం నిమిత్తం ఉపయోగించుకొని సాహిత్య సృష్టి చేస్తున్నారు. ఎప్పటికయినా మానవ సంఘంలో అఖండ పరివర్తనం కలగవలెనంటే గ్రంధకర్తలే వాలవరకు కారణభూతులని చెప్పక తప్పదు.

ఈ నాటికలో ఇతివృత్తం యథార్థ సంఘటనమే. చైనా దేశంలో యాంగ్‌ట్సీ నది మీద వెయ్యి మైళ్ళ దూరంలో ఒక గ్రామంలో జరిగిన సంగతి ఈ నాటికకు కధావస్తువు. వన దేశంలో నదులు ఎక్కువ లోతైనవి కాకపోవడంవల్ల, పెద్ద స్టీమర్లు దేశంలోనికి రావడానికి వీలు లేదు. చైనావారి దురదృష్టవశాత్తు, ఆ దేశంలో నదులు చాల లోతైనవి కావడంవల్ల విదేశీయ నౌకలు దేశంలోకి రాడానికి వీలుగా వున్నది. మహాసముద్రిము మీద ప్రయాణం చేసే స్టీమర్లు అతి సులువుగా హాంకో పట్టణందాకా 500 మైళ్ళు రాగలుగుతవి. విదేశీయుల తుపాకీ బోట్లు—వలన పోయిన తమ తెల్లజాతుల రక్షణ నిమిత్తం, వలన వ్యాపారంకోసం, మతప్రచారం కోసం—నిత్యం యాంగ్‌ట్సీ నదిలో పస్తూ పోతూ ఉంటవి.

యాంగ్‌ట్సీ నదికి సమీపంలో వున్న ఒక గ్రామంలో పెద్ద పెద్ద 'ఆయిలు డిపో'లు అమెరికావాళ్ళు కట్టుకొన్నారు. ఆగ్రామ పరిసరప్రాంతాలకు పత్తి, ఆవాలు, తోళ్ళు, అలిమ్ కొని సరఫరా చేసే వ్యాపారుల ఆఫీసులు కూడా ఉన్నవి. ఆ వూళ్ళో వున్న షాహుకార్లలో అమెరికా దొర 'అష్‌లే' చాలా ప్రసిద్ధుడు. అతని కింద వేలమంది కూలీలు కూలీ నాలీ చేసి పొట్టపోసుకొంటూ వుంటారు.

తిండి లేక మల మల మాడుతు బక్క పేగులతో, శుష్క జీవాలతో, శూన్యదృక్కులతో, రక్తంఉడి ప్రతి దమ్మిడీకోసం ప్రతి గింజకూ ఆశిస్తూ పొట్టకై కష్టపడే కూలివాడికీ—స్వార్ధపరుడు, లోభి, మోసమే ప్రాణముగా గల షాహుకారుకీ ఎటువంటి మైత్రి వుంటుందో వేరే చెప్పనక్కర్లేదు.......సామ్రాజ్యవాదులు వలసదేశాల్లో చేసే పైశాచికకృత్యాలు, అత్యాచారాలు, మతం ధర్మం అనే పేరుతో చేసే దౌర్జన్యం, గొంతు కోత, ఈ నాటికలో తొమ్మిది రంగాలలో ప్రస్ఫుటమయినవి.

★ అనువాదకుడు ★

పాత్రలు

★ తెల్లవాళ్లు

కెప్టెన్—'చీనన్' తుపాకీ పడవ
లెఫ్టినంట్ కాపర్
ట్రూచ్‌లే, అతని భార్య, కుమార్తె కార్టీలియా—ఫ్రెంచి వ్యాపారులు
అష్‌లే—అమెరికా కంపెనీ ఏజంటు
మిషనరీ, బోటువాడు, నావికులు
అమెరికన్ పత్రికా విలేఖరి
ప్రయాణీకుడు, అతని భార్య

★ చీనావాళ్లు

డాయిన్—జమీందార్
తాయ్‌లీ—ధనిక వ్యాపారి
ఛీ—బోటువాడు, భార్య, కుమార్తె
ఫీ—కళాసుల యూనియన్ చైర్‌మన్, వాడి భార్య
విద్యార్థి—డాయిన్ తరపున దొరలతో ఇంగ్లీషు మాట్లాడుతాడు
ముగ్గురు కళాసులు, ఒక ముసలి కళాసు
రెండో కళాసు భార్య, కొడుకు
అమా—తెల్లవాళ్ళకు తార్పుడుకత్తె
హోషాంగ్—చైనా జాతీయ సన్యాసి
రేడియో స్టేషన్ కొలిమి కూలీ
తెల్లవారి పడవమీద పనిచేసే కుర్రవాడు
పోలీసు, ఊరివాళ్లు

మొదటి రంగము

[సమయం: ఉదయం ఆరు గంటలు: స్థలం: యాంగ్‌ట్సీ నది రేవు. నదీమధ్యంలో సామ్రాజ్యవాదుల 'చీనన్' తుపాకీ పడవ. రేవు ప్లాట్‌ఫారం మీద పెద్ద బరువు లెత్తే యంత్రాలు, లావాటి మోకులు, తలకిందులైన పడవలు, కొయ్య డింగీలు, సామాను బస్తాలు, ఉంటవి. రేవు దగ్గర తెరచాప లెత్తిన పడవ యుంటవి అప్పుడప్పుడు పెద్ద తోళ్ళ బస్తా లెత్తి, రేవు ప్లాట్‌ఫారం మీద విసిరేస్తున్నప్పుడు, కళాసుల తలలూ బుజాలూ కనపడతవి. ప్లాట్‌ఫారం మీద బస్తాలు పట్టించుకు పోవడానికి కూలీలు నియమింపబడినారు.

కూలీలు అసహ్యంగా ఉన్నారు—చాలామంది మాసిపోయిన లాగులు తొడుక్కున్నారు తలలకు చేతి రుమాళ్ళు చుట్టుకుని, చిరిగిపోయిన పాత జోళ్ళు వేసుకొన్నారు. కొంతమందికి వంటి మీద చొక్కా కూడా లేదు. కొందరు చేతులు లేని జాకెట్లు వేసుకొన్నారు. పనీ పాటా చేస్తున్నప్పుడు రొమ్ముల మీద టోపీలు వేలాడుతుంటవి. కొంతమంది బొగ్గు పనివాళ్ళ లాగ, తలలమీద చినిగిపోయిన గోనెలు కప్పుకున్నారు. వయస్సు ముదిరిన పెద్దవాళ్లు పనిచేస్తున్నప్పుడు జడలు ముడుచుకొని చుట్టలు చుట్టు కొంటారు. యువకులైన కూలీలకు జడలు లేవు. పనిలో వున్నప్పుడు లయ తప్పకుండా అడుగులు వేస్తూ 'హైహో, హైహో' అంటూ పాడతారు. అప్పుడప్పుడు 'దళారి' ఆ పాట అందుకుంటూ వాళ్ళకు హుషార్ ఇస్తూంటాడు. లేకపోతే హుచుని మేస్త్రీ దర్జాతో విసనకర్రతో విసురు కొంటూ 'టీ' పుచ్చుకొంటాడు. అతడు నీలిరంగు గౌను వేసుకొని, బొచ్చు టోపీ పెట్టుకొంటాడు. క్రాపు, మధ్య పాపిడి, ముఖాన పొమేడ్. ప్లాటుఫారంమీద ఒకడు టీ అమ్ముతూంటాడు. అతడు స్టవ్, కెటిల్, పింగాణీ కప్పులు — ఒక కొయ్యవానిలో పెట్టుకుని, బుజాన మోసుకొంటూ నడుస్తున్నాడు.

ప్రారంభంలో పని నెమ్మదిగా సాగుతూ ఉంటుంది. కూలీల పాట నీరసంగా వినవస్తుంది పని కావడంతోనే ఒక్కొక్క కూలీ కొంచెం నీడ ఎక్కడ దొరికితే అక్కడ కూర్చుంటున్నాడు. టోపీలు నెత్తిన పెట్టుకొని పొగాకుపాటి చుట్టలు కాలుస్తుంటారు—ఎండ వేడిమి వల్ల ప్రసంగం చేసుకొనే శక్తి కూడా లేదు వాళ్ళకు.

'తాయ్‌లీ' ధనిక వ్యాపారి రేవు ప్లాటుఫారంమీద మెల్లగా నడుస్తూ వస్తూంటాడు. బంగారపు ఫ్రేము కళ్ళజోడు పెటుకొంటాడు. మీసాలు దట్టంగా ఉంటవి. సమస్తం తెలిసిన సర్వజ్ఞుడిలాగ శాంతంగాను, గంభీరంగాను, కనపడతాడు. సిల్కుటోపీ పెట్టుకొన్నాడు. టోపీ చివర వజ్రం మెరుస్తూ ఉంటుంది.]

కూలివాళ్ళ మేస్త్రీ అయిన 'దళారి' గంతేసి, నుదుటి మీద చేతులుంచుకొని వంగి సలాము చేస్తాడు. తాయ్‌లీ తల వంచుకొంటాడు.

దళారి—(పెద్దమనిషి ఏమనుకొంటాడో అనే జంకుగా) తాయ్‌లీ బాబయ్యగారూ! తమరు భోజనం చేసి వచ్చారండి?

తాయ్‌లీ

ఆః భోజనం చేశాను.

దళారి

బాబూ! ఈ బీదవాడు ఇచ్చుకునే టీ తమరు తాగితే నాకు నిండా సంతోషం. (టీ అమ్మేవైపు నడుస్తాడు. తాయ్‌లీ అతన్ని ఆపుతాడు.)

తాయ్‌లీ

మీ అమెరికన్ దొరగారు త్వరగా వస్తారూ?

దళారి

ఆయన కోసమే ఎదురు చూస్తున్నాను.

తాయ్‌లీ

కంట్రాక్టు కాగితం మీద ఈ ఉదయం సంతకంచేస్తే తాయ్‌లీ తోళ్ళ బాపతు రొక్కం ఇవ్వదల్చుకున్నాడని దొరగారితో చెప్పు.

దళారి

మహా దాతలైన తాయ్‌లీగారు బీదవాడైన ఈ దళారికి నూటికి నాలుగోవంతు కమీషన్ ఇవ్వడం మఱచిపోరను కొంటాను!

తాయ్‌లీ

దొరగారు నీకిచ్చే కమీషన్‌లో నాలుగోవంతు కోసం నేను ఎదురు చూస్తున్నాను!

దళారి

ఆహా! చావు సమాచారం చల్లగా చెప్పారు.

తాయ్‌లీ

నీకు చావు కబురుగానే వుంటుంది!

దళారి (వింటూ)

దొరగారి కాళ్ళ చప్పుడు వినపడుతున్నది!

తాయ్‌లీ

నేనిక్కడ దొరగారిని కలుసుకోదల్చుకోలేదు. సాయంత్రందాకా నా బంగళాలో వుండి, దొరగారి కోసం ఎదురు చూస్తుంటాను.

(దళారి వొంగి వొంగి సలాములు చేస్తాడు. తాయ్‌లీ నిష్క్రమణ) అష్‌లే దొర శిరస్త్రాణం వేసుకుని, టెన్నిస్‌డ్రెస్సులో వస్తాడు. పొడగరి. ఆమెరికావాడు. మంచి చురుకుగా అంగవేస్తూ స్ప్రింగ్‌మీద నడిచినట్టు నడుస్తాడు. కూలీలు విశ్రాంతి తీసుకోవడం చూసి. వొంగి సలాం చేసే దళారివైపు తిరిగి

అష్‌లే

ఆ మూకంతా సిద్ధం కాలేదేం ఇంకా? (కూలీలను కాళ్ళతో తన్నుతాడు దళారీ: బస్తాలు తీసెయ్యమని కూలీలకు హెచ్చరిక చేస్తాడు. కూలీలు అలిసిపోయి పని మొదలు పెడతారు. కూలీ జనాన్ని హుషారు చేస్తూ, దళారి 'హైహో హైహో' అని పాడతాడు.)

పావుగంటలో బస్తాలు మోయించడం అయిపోవాలి. రేడియో స్టేషనుకు బాయిలర్ ఏదీ?

దళారి

వస్తున్నదండి.

అష్‌లే

(వేళాకోళంగా) ఓహో—ఊ!

దళారి

అయితే అది చాలా బరువు, దొరా!

అష్‌లే

అవును. అందుకోసం గుర్రాలను ఎక్కడ్డించి తెస్తాము? ఈవూళ్లో తిండి లేక పనికోసం ఎదురుచూస్తున్న పాటకజనం చాలామంది ఉన్నారు.

దళారి

అయితే దొరా—

అష్‌లే

చాలు. ఆ 'బాయిలర్' కోసం నలభై యాభైమంది కూలీలను ముందు ఏర్పాటు చెయ్యి—వెళ్ళి చూడు.

(కూలీలు 'రోలర్ల' మీద 'బాయిలర్' లాక్కుపోతారు నెమ్మదిగా. తాళ్ళు బుజాలకు కట్టుకుని ఈడుస్తూ, బరువుకు నేల మీద బాగా వంగిపోతూ వుంటారు. కొందరు రోలరు వెనకనుంచి తీసి మళ్ళీ బాయిలరును ముందుంచుతారు. రేడియో స్టేషన్ కొలిమివాడు తాడు కొస పట్టుకుని వెనకాల నడుస్తాడు. నీలిరంగు జాకెట్టు, నీలిరంగు లాగూ 'యూనిఫారం'గా వేసుకొన్నాడు. తల క్షౌరం చేయించుకోలేదు. దళారి గబగబా వచ్చి బాయిలర్ తాడు లాగడం నటించి జనాన్ని హుషార్ చేస్తాడు. కూలీలు నెమ్మదిగా నీరసంగా పాడతారు. పాట ముక్కుపాట.)

అష్‌లే

ఏసు ప్రభువా! ఈ పసుపురంగు పాటకపు చెత్త పదిమంది అయినా ఒక్క అమెరికావాడికి సరిపోరు. (ప్రవేశం: పత్రికా విలేఖరి. ఏదయినా అత్యవసరం ఫోటో తీయడానికి మెడనుండి రొమ్ముమీద వేలాడుతున్న బెల్ట్‌కు కెమిరా వున్నది. అతను పైకి నిర్లక్ష్యంగా కనపడుతున్నప్పటికీ, ఇద్దరూ బాగా పరిచయం గల వాళ్ళని స్పష్టమవుతున్నది.)

విలేఖరి

గుడ్ మార్నింగ్, మిస్టర్ అష్‌లే!

అష్‌లే

మార్నింగ్!

విలేఖరి

తోళ్లా ఏమిటి? (సామాను బస్తాలవైపు తలపంకిస్తూ)

అష్‌లే

అవును. (తన నోట్ బుక్‌లో రాసుకుంటూ చూడడు)

విలేఖరి

తోళ్ళు చైనా కాదూ మరి—ఆ?

అష్‌లే

ఏమిటి నీ అభిప్రాయం!

విలేఖరి

ఓహో! చైనా వాళ్ళ నాయకుడు చెప్పే ధర్మ పన్నం. డాయిన్ తరపు మాట్లాడే అతను ఆ మాట పట్టుకున్నాడనుకుంటా.

అష్‌లే

ఆ విద్యార్థి కాదూ?

విలేఖరి

అవును! షాంగాయ్‌వాడు (కూలీలు బాయిలర్ తమవైపు లాక్కొస్తారు.) ఇకనడు! బాయిలర్ మీద పడితే పొడి అవుతారు.

అష్‌లే (పైకి చూడకుండా)

బాయిలర్ దూరంగా తీసుకుపోతారు. (బాయిలరుకు కట్టిన తాటి కొస పట్టుకొని నిలబడ్డ కొలిమి కూలీకేసి చూస్తూ) ఎవరా సోమరిపోతు?

దళారి

వాడు రేడియో స్టేషన్‌లో కొలిమికూలీ—దొరా!

అష్‌లే (కొలిమి కూలీవైపు చూసి)

కావచ్చు. తాడు పట్టుకులాగు. బడుద్ధాయిలాగ నిలబడతావేం? సోమరి వెధవా!

కొలిమికూలీ

(బాయిలర్ లాగుతున్న కూలీలవైపు కన్నుగీటి, అష్‌లేతో మాట్లాడతాడు) ఇదిగో తాడు, పట్టుకులాగడానికి. ఎవరు ఇప్పుడు నిలబడ్డారు సోమరిలాగ? (కూలీలు పని ఆపి, క్షణం నవ్వుతారు.)

అష్‌లే

(కూలీలు నవ్వేసరికి ధుమ ధుమ లాడుతూ, దళారివైపు నెమ్మదిగా తిరిగి) పని ఆపినందుకు కూలిలో పదిసెంట్లు విరగ్గొయ్యాలి!

విలేఖరి

పది సెంట్లే!

అష్‌లే

అవును.

విలేఖరి

తమ కిస్తారా ఆ కూలి?

అష్‌లే (చిరునవ్వుతో)

ఉహూ!

విలేఖరి

ఎగుమతి చేసే చైనా వస్తువులు కూడా కూలిలో 10 సెంట్లు విరగ్గొట్టారు. మీ రెరగరూ?

అష్‌లే

వహవ్వా—నేనిచ్చే కూలీ రేటులో సగం!

విలేఖరి

అవును—సగం రేటు.

అష్‌లే (దళారివైపు చూసి తనలో)

పది కాపర్లే!

విలేఖరి

నేను శలవు తీసుకుంటాను. అన్నట్టు మరచిపోయాను. వాళ్ళంతా చీనన్ పడవమీద మీ కోసం కనిపెట్టుకుంటారు.

అష్‌లే

ఎందు కోసం?

విలేఖరి

మీ తోళ్ళ వ్యాపారం పని వుందట. మిమ్మల్ని త్వరగా రమ్మని చెప్పమన్నారు. కూలీ రేటు తరవాత కోద్దురుగాని, ముందు వెళ్ళండి.

అష్‌లే (తనలో)

పది కాపర్లే!

విలేఖరి

ఈ స్థలం సంతలాగ డాలర్లతో కుళ్ళిపోతున్నది. తెలిసిందా? (ప్రవేశం ముసలిది. 'అమా' ప్రాచీన చీనా ఆచారంప్రకారం చిన్నపాదాలు ముద్దగా కట్టుకొన్నది. బాగా నడవలేకపోతున్నది. మడమదాకా ఇరుకుగా వుండే లాగూ వేసుకున్నది. పిరుదులుదాకా జాకెట్టు వేసుకొన్నది. బట్ట తల కనపడకుండా గుడ్డ చుట్టుకొన్నది.)

విలేఖరి

ఓహో! ముసలితొత్తా, రా తొందరగా! ఊ! చురుకుగా నడు ముసలిపీనుగా, దొంగముండా! (అమా మోకాళ్ళ మీద చేతులు ఆనించుకుని వంగి సలాం చేస్తూ నెమ్మదిగా దగ్గరికి వస్తుంది) ఊ! సరే గాని, ఎలాటి పిల్లను పంపించావు నాకు?

అమా

దొరా! జబ్బు లేని పిల్లండి!

విలేఖరి

పగలల్లా కూచుని కునికిపాట్లు పడుతూ మొరిగేదాన్ని పంపించావు. తగలెయ్యనా?

అమా

దొరా! అది అందమైన పిల్లేనండి.

విలేఖరి

అవునే ముండా. ఆవులాగ మందకొడిలాగ వుంటుంది పిల్ల!

అష్‌లే

మీరు ఆడాళ్ళని పగటిపూట తెప్పించుకొంటా రేమిటి?

విలేఖరి

ఉహుఁ నిజంగా. నెలకి ఇరవై డాలర్లు ఇస్తాను. ఆ దయ్యానికి తెలుసు నేనెంత ఇచ్చేదీ. పిల్లలు పుట్టడంలేదని దాన్ని మొగుడు అమ్మేశాడని తోస్తుంది. అది ఎందుకూ పనికిరాదు. ఊరికే నక్కలాగ మొరుగుతుంది. (అమా వైపు తిరిగి) సరే—దాన్నిప్పుడు తీసుకో. ఇంకెందుకూ?

అమా

చిత్తం, దొరా!

విలేఖరి

ఇంకో దాన్ని తీసుకురా. ఇలాంటిదే సుమా! జబ్బులు లేని, తెలిసిందా?

బీహారులో 'బక్సత్' సత్యాగ్రహం

దర్భాంగలో స్త్రీల మానభంగం-గయలో 50 చోట్ల సత్యాగ్రహం

కిసాన్ ఖైదీలను రాజకీయ ఖైదీలుగా పరిగణించాలని బీహారులో అనేక గ్రామాలలో సభలు ప్రదర్శనాలు జరిగాయి.

దర్భాంగ

బక్సత్ భూములకై సత్యాగ్రహం చేస్తున్న రైతులలో దర్భాంగ రైతులు ముందంజ వైచారు. రఘుపూర్, దేఖులీధామ్ పాండేల్, సక్రీ బహేరా అనే ప్రదేశాలలో ఈ సత్యాగ్రహం ప్రారంభమయింది.

రఘోపూర్

రఘునందనపాండే, (గవర్నమెంటు స్పెషల్ ఆఫీసర్) మధ్యవర్తిత్వపు తీర్పు ప్రకారం 1000 బీఘాల భూమి రైతులకు చెందింది, ఉభయ పక్షాలవారు తీర్పును అంగీకరించారు.

దేకులీ

దేకులీ గ్రామములో 30 ఏండ్ల క్రిందట రైతులు చాలా మోతుబరులు. 20 ఏండ్ల నుండి జమీందారు దౌర్జన్యం పెచ్చుపెరిగింది. 1000 బీఘాలకు పైగా రైతులకు పట్టాలుండేవి. కాని జమీందారు లాగివేశాడు. దొంగ దస్తావేజులు ఫోర్జరీలకు అంతులేదు. బొటనవ్రేలు లేకుండా పుట్టిన ఒకని వ్రేలిముద్రను రాజాగారి మనుష్యులు సృష్టించారు. పైగా అతని కుటుంబం అంతా ఫోర్జరీనేరానికి శిక్షింపబడ్డారు. క్రిమినల్ సివిల్ అధికారాలన్నీ జమీందారువి. కిసాను సభకు హాజరయినవారిని చితక తన్నించాడు. అనవసరంగా రైతునాయకులపై 107 సెక్షన్లు అప్పటినుండి 6 నెలలు పోలీసు రాజ్యం జమీందారీ మనుష్యులు పోలీసుల సహాయంతో పంటలు లూటీచేసారు. స్త్రీల బట్టలూడదీసి మానభంగం చేసారు వారిని శిక్షించకపోవడం అలా ఉంచి 90 మంది కిసానులపై కేసులుపెట్టారు. జిల్లా మేజస్ట్రీటు రాజీ కుదర్చాలని ప్రయత్నించినా జమీందారువినలేదు. కాబట్టి సత్యాగ్రహం ప్రారంభమయింది. కాని రఘునందన పాండే గారి వాగ్దానంవలన ఇచట సాగింపబడుతున్న సత్యాగ్రహం తాత్కాలికంగా ఆపివేయబడింది. జూలై 15 వ తేదీ వరకు ఆపివేశారు. పన్నుల నిరాకరణాందోళనకూడా సాగుతూంది.

ఇచట సత్యాగ్రహ శిబిరం తీవ్రంగా పని చేస్తున్నది. సక్రీ సత్యాగ్రహానికి చాలమంది వలంటీర్లను పంపుతున్నారు.

సక్రీ

పాండేల్ సర్కిల్‌లోని సక్రీ గ్రామ సత్యాగ్రహము తీవ్రముగా సాగుతూంది. జూన్ నెలలో దర్భాంగా రాజా రైతుల బక్సత్ భూములను బలవంతముగా ఆక్రమింప ప్రయత్నించాడు. అయినా 33 మంది కిసాన్ నాయకులపైననే క్రిమినలు ట్రెస్‌పాస్ క్రింద చార్జిపెట్టారు. జూన్ 23 వ తేదీన వీరి నందరినీ అరెస్టు చేశారు. సక్రీ ఆశ్రమ వాసులను తీవ్రముగా కొట్టారు. గాయపరచారు. ఇదివరకిచ్చట 80 మందివరకు అరెస్టయ్యారు. ఘనరాజశేఖర మొదలగు ప్రసిద్ధ కాంగ్రెసు వాదులిందులో ఉన్నారు. జూలై 10 వ తేదీన యమునాకార్య యం. ఎల్. ఏ అరెస్టు చేయబడ్డాడు.

సగపూర్

జూన్ 24 వ తేదీన దర్భాంగ రాజాగారి 500 మంది సిపాయీలు, 200 నౌకర్లు కలిసి, రైతులు దున్నుకొన్న భూమిని తిరిగి దున్నడానికి 50 నాగళ్ళతో బయలుదేరారు. 20 మంది కిసానులు, కిసాన్ నాయకులు నిరోధించసాగారు. వారిని తీవ్రముగా కొట్టి హింసించారు. కొందరిని హాస్పిటలులో జేర్చుకొన్నా సరిగా చూడలేదు. ఇంతకు పూర్వం 7 గురిపైన సెక్యూరిటీ కేసులు పెట్టబడినాయి.

నరపతనగర్

నరపతనగర్ బక్సత్ సత్యాగ్రహసందర్భాన 30 మందికి 3 నెలల మొదలు 6 నెలలు వరకు శిక్ష విధించారు. నాయకులగు సూర్యనారాయణ సింహ, ఉమానాధమిశ్ర, సోనేకల్వార్ గార్లకు 6 నెలలశిక్ష, సింహ, మిశ్రగార్లకు 100 రూపాయలు చొప్పున జరిమానా విధించారు.

ఈసందర్భంలోనే మధువనీ జైలులోనున్న ఖైదీలు తమను రాజకీయ ఖైదీలుగా పరిగణించమని ప్రధానమంత్రికి విజ్ఞప్తి గావించారు. గత 12 వ తేదీకి జవాబు రాకపోతే నిరశన వ్రతము సాగించుతామని తెలియజేశారు.

పరరీ ఇలాకా

పరరీ ఇలాకా గ్రామాలలో, బక్సత్ సత్యాగ్రహము ప్రారంభించబోతున్నారు. ఇక్కడ 50 గ్రామాలలో రైతుల 10 000 బీఘాల భూమిని దర్భాంగ మహారాజ స్వంతము జేసుకొన్నాడు. ఇక్కడే ఒకసారి కిసాను మహాసభలో స్వామీ సహజానంద, జయప్రకాశనారాయణగార్లు ఉద్బోధించుతున్న సమయములో, ఏనుగులచేత రైతులను తొక్కించాడు.

* * *

పాట్నా

రూఖయీగఢ్

ఇచ్చట బక్సత్ సత్యాగ్రహం జరుగుతోంది. 30 అరెస్టులు జరిగాయి. 10 మందికి మూడేసి నెలలు శిక్ష విధించబడింది. పోలీసుల చర్యలు 1930-32 ఉద్యమాన్ని మరిపించుతున్నాయి.

సాబక్‌చక్ చిరస్తాబాద్

నౌబత్‌పూర్ థానాలోని గ్రామం ఇది. భూమిని దున్నకుండా పోలీసులు ఆపుతున్నారు. 107 సెక్షన్ అమలు పరుస్తారని వదంతి.

మసౌఢే

మసౌఢే థానాకుచెందిన, సగునీ జమీందారీలో హసన్‌పురా, తర్పురా, పకరీ మొదలగు గ్రామాలలో సత్యాగ్రహానికి సంసిద్ధులగుచున్నారు. తర్పురాలో కిసాన్ క్యాంపు నిర్మించారు. పోలీసులు మరో క్యాంపు నిర్మించారు. 144 వ సెక్షన్ జారీచేయబడింది.

* * *

గయ

గయజిల్లా, బక్సత్ సత్యాగ్రహానికి జన్మభూమి. సుమారు 50 చోట్ల సత్యాగ్రహము జరుగుచున్నది. వేలకొలది జైళ్ళకు వెళ్లారు. లాఠీచార్జి మామూలు విషయము. కొన్ని ప్రముఖ స్థలాలలోని చరిత్ర ఇక్కడ ఉదహరిస్తాము.

టికారీ రాజ్యంలో

అగ్‌నయా, కటీభలువాలలో 400 బీఘాల భూమిపై తగాదా ఉంది. కలక్టరు చేసిన రాజీ ప్రయత్నాలు వ్యర్థము కావడమువల్ల రైతులు సత్యాగ్రహానికి పూనుకొన్నారు. 30 మంది రైతులు అరెస్టు చేయబడ్డారు.

ముజకియాంలో కూడ, యస్ డి. వో. రాజీ ప్రయత్నాలు వృధాకావడంచేత రైతులు సత్యాగ్రహము ప్రారంభించారు. జమీందారుచే నియమింపబడ్డ గూండాల దౌర్జన్యాలు విపరీతముగా ఉన్నాయి.

చితౌఖర్

ఇక్కడి తగాదా పూర్వందే. మళ్ళీ ఈసంవత్సరము సత్యాగ్రహము సాగింది. 5 గురు రైతులరెస్టయ్యారు.

విపరాలో కూడ చాలమంది అరెస్టయారు. జమీందారీ గూండాలు, తలుపులు బ్రద్దలుకొట్టి ఇండ్లలో జొరబడి, స్త్రీలను సైతం చావచితకగొట్టారు.

బారసలీగంజ్

శాహపూర్ బక్సత్ సత్యాగ్రంలో 15 మంది గాయపడ్డారు. కరోమా, మంజూర్, హైనత్‌పూర్, మకన్‌పూర్‌లలో కూడ సత్యాగ్రహము సాగుతోంది.

ఓదపురా

ఓదపురాలో ఒక రైతును-మొసాఫిర్‌సింహ్-అను నాతని చంపివేశారు. ఇంకొకడు చావ సిద్ధంగా ఉన్నాడు. లోదీపూర్, చహల్ అను గ్రామాలలో కూడ సత్యాగ్రహం సాగుతోంది. కర్మా, కోసలలో రైతులు తమ భూములలో తిష్ఠ వేసుక కూర్చున్నారు.

జహనాబాద్

కొర్మా రైతులపై 144 వ శెక్షను జారీచేయబడింది. రైతులు 10 రోజుల నోటీసు ఇచ్చారు. తర్వాత సత్యాగ్రహము జోరుగా సాగుతుంది.

రామభజనసింహ

రామభజనసింహ ఒక జమీందారు. ఈయన క్రింద చాలా గ్రామాలున్నాయి. ఆ గ్రామాలవారు సత్యాగ్రహము చేసి భూములను దున్నుకొని, పంటలు పండించుకొని అనుభవించారు. జమీందారు గూండాలచే తన్నించుతున్నాడు. కొందరు గయాజిల్లాలోని స్వార్థపరులైన కాంగ్రెసువాదులు,ఈ జమీందారుకు మద్దతునిస్తున్నారు

బేలా

బేలా థానాకు చెందిన, భలువా, అగండాలలో జూలై మొదటి తారీఖునుండి సత్యాగ్రహం సాగుతున్నది. 38 గురు రైతులకు ఒక్కొక్క శిక్షవిధించ బడింది.

అమ్‌వారీ

ఇక్కడ 6 నెలలనుంచి సత్యాగ్రహం సాగుతోంది. రాహుల్‌బాబు మొదట ఇక్కడే సత్యాగ్రహం ప్రారంభించాడు జూలై 1 వ తేదీన డిస్ట్రిక్టు సూపరెండెంటు ముందరనే జమీందారు మేనల్లుడు, రామచిత్ర మెహతాను కొట్టి క్రిందపడవేశాడు. రఘువీరసాధును స్మృతి తప్పునట్లు కొట్టించాడు. స్త్రీలనుకూడా నిర్దయతో బాదారు.

ఛీతాలి

ఇక్కడే రాహుల్ సాంకృత్యాయన్ అనుచరులు గాయపడ్డారు. రాహుల్‌బాబాకు ఈసత్యాగ్రహంవలన రెండేళ్ళ శిక్ష విధించబడింది. చివరకు జమీందారుమ మధ్యవర్తిత్వ కమిటీకి ఒప్పుకొన్నాడు. కిసానుసభ తరపున ప్రొఫసర్ బాంకీవిహార్, జమీందారు తరపున ఒకడూ, యస్. డి. వో. ఈముగ్గురు ఈకమిటీలో ఉంటారు.

నిరసా, హక్‌మా, మీదేపూర్ రైతులపై బక్సత్ భూములదున్నినారనే కేసులు పెట్టబడినాయి.

శాహాబాద్

నిక్రియా జమీందార్ కిసాన్ సేవకులగు యోగీంద్ర కుమార, పండిత యదునందనమిశ్ర, హరిహర ప్రసాద్ మొదలగు వారిపై లాఠీవర్షం గురిపించారు. గాయపడ్డవారు హాస్పిటలులో చేరారు.

దానికి సమీప గ్రామంలో రైతులు భూములదున్నుకొంటుండే అచటి జమీందారు, ఏనుగపైన కాళీమాత జెండాతో ఏతెంచాడు. ఏనుగులతో ఎద్దులను బెదరించి చెదర గొట్టాడు. 144 సెక్షను జారీచేసారు. శివపూజన్, మరి 57 గురి పైన 107 వ సెక్షన్ జారీచేశారు.

బేతరీలోని జమీందార్లు బుద్ధిమంతులై రైతులతో రాజీ చేసికొన్నారు.

భాగల్పూర్

బఢ్‌గాంవ్‌లో సత్యాగ్రహం ప్రారంభమయింది. జిల్లా కిసాన్‌సభ తరపున నాగేశ్వరసేన నాయకత్వం వహించారు.

ముఖఫర్‌పూర్

బేల్‌ఖండ్ థానాలోని సుప్రసిద్ధ కిసాన్ సేవకులగు శ్రీ ప్రదీప నారాయణ, ముసఫర్‌సింహగార్లకు 107 వ సెక్షన్ క్రింద మళ్లా ఒక సంవత్సరం కఠిన శిక్ష విధించారు. వీరిమధ్యనే ఒక సంవత్సరం శిక్ష ననుభవించి వచ్చారు.

చాంపరాన్

మధువనథానా, బహుమరా గ్రామ రైతులపై 144 వ సెక్షన్ జారీ చేసారు.

ముంగేర్

లగార్ సత్యాగ్రహం నిర్విఘ్నంగా సాగుతున్నది. శేఖపురా ఇలాకాలో కూడా సత్యాగ్రహానికి సంసిద్ధులౌతున్నారు ప్రజలు. జమీందారుకు పోలీసులు, మేజిస్ట్రీటు సహాయం చేస్తున్నారు.

నిరక్షరాస్యత నిర్మూలించితేగాని, దేశానికి ముక్తిలేదు

కామ్రేడ్ టి. వెంకటేశ్వరరావు

ఇప్పటికి సుమారు 182 సంవత్సరములనుండి బ్రిటిషు పార్లమెంటువారి ఆధిపత్యం క్రింద హిందూదేశము పరిపాలింప బడుచున్నది. ఇప్పటికి అనేక స్వాతంత్ర్య సమరములు, రైతు సత్యాగ్రహాలు జరిగినవి. అన్నింటను హిందూదేశీయులే అన్యాయమునకు గురియైనారు. సుమారు 52 సం॥ల నుండి జాతీయోద్యమము నిబంధనా క్రమముగా జరుగుచున్నప్పటికి, మనము ఏమాత్రము అధికారమును సంపాదించలేకపోయినాము. ఎందుకు?

మనమెందుకు ఇంత అనాధులముగా నున్నామంటే, మొదటి సంగతి దేశంలో విద్యావిహీనత యే. 1939 సం॥లో గూడ, సుమారు 200 సం॥లు బ్రిటిషు పరిపాలన తర్వాత, మన దేశంలో చదువుకున్నవారు నూటికి 8 అంటే పరిపాలించేవారికి పరిపాలింపబడేవారికి అమానుషమైన అవమానకరమైన విషయము కాదా? తూర్పు ఇండియా వర్తకసంఘము వారి ఆధిపత్యం క్రింద ఉన్నంతవరకు దేశములో నొక విద్యా విధానం లేదు. విద్యాశాఖకు ప్రత్యేక "నిధి" (fund) లేదు. 1849 లో అనేకరాష్ట్రములలో మామూలు శిస్తుగాక (cess) ఉపపన్ను విధింపబడినది. ఆఉపపన్నువలన 1866 లో వసూలైన 76 లక్షలు మాత్రం విద్య కొరకు ఖర్చుపెట్టబడినవి. 1882 సం॥లో సెంట్రలు ప్రభుత్వమునకు, రాష్ట్రీయ ప్రభుత్వమునకు శాఖా విభజన జరిగినప్పటినుండి విద్యావ్యాప్తి కొంచె మభివృద్ధి చెందెను.

పూర్వము మాదిరిగానే ఉపపన్నులను విధించి ధనము వసూలు చేయబడెను. లోకలుబోర్డులకు విద్యా శాఖమీద కొంత అధికారము లీయబడినవి. ఎంత అభివృద్ధి చెందినను, అనేకకోట్ల ప్రజలున్న హిందూదేశానికి, చాల తక్కువ. ప్రాథమిక విద్య విషయం ఎక్కువగా లోకలుబోర్డులకు వదిలివేయబడినది. రాష్ట్రీయ ప్రభుత్వాలు కొంతగ్రాంటును బోర్డులకు ఇచ్చుచున్నవి. విశ్వవిద్యాలయాలు, సెకండరీ స్కూళ్ళు రాష్ట్రీయ ప్రభుత్వాల అధికారం క్రిందనే ఉన్నవి. ఇవి గాక కొన్ని పాఠశాలలు నడుపబడుచున్నవి. కాని లోకలుబోర్డులు తమకు వచ్చు ఆదాయము కొద్ది యగుటచే విద్యా శాఖ మీద ఎక్కువ ఖర్చుపెట్టలేకపోవుచున్నవి

1911 లో గోక్లే గారి లెక్కల ప్రకారం ప్రాధమిక విద్య ఖర్చులు తక్కిన దేశాల్తో పోలిస్తే ఒక్కొక్కని సగటున ఖర్చుపెట్టబడిన మొత్తం :

అమెరికా	16 షి.
ఇంగ్లండు	10 షి.
స్కాట్లండు	9 షి.
ఆస్ట్రేలియా	1ı షి. 3 పె.
జర్మనీ	6 షి. 10 పె.
ఇండియా	1 పెన్నీ.

1934—35 సం॥లో ఇండియా ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చుపెట్టిన మొత్తాలతో విద్యాశాఖమీద వ్యయపరచిన మొత్తం 1202 లక్షలు. మొత్తము వ్యయములో 5.7%. లోకలుబోర్డులు వ్యయపరచిన మొత్తముతో గూడ లెక్కచూచే, సగటున మనుష్యనికి విద్యావ్యాప్తి కొరకు ఖర్చుపెట్టినది 0—9—0 లు మాత్రమే. ఇదే సమయంలో తక్కిన దేశాల్తో పోల్చి మాస్తే—

ఇంగ్లండు	19—0—0	ఫ్రాన్సు	10—0—0
అమెరికా	55—0—0.	అబ్బ ఎంత తేడా ?	

ఇంత తక్కువ ఖర్చుపెట్టినందుకు విద్యా వ్యాప్తి గూడ అంత తక్కువగానే కానుపించుచున్నది.

ప్రాధమిక విద్యాలయాల్లో ప్రవేసించిన వారి సంఖ్య నూటికి :

అమెరికా	20	ఇంగ్లండు	17
జపాను	13	ఇండియా	4

తక్కిన దేశాల్లో విద్య నభ్యసించుట ప్రతి మానవునకు సాధారణమైన విషయం. 100 కి 60 నుండి పైగానే కాని తక్కువ గాదు విద్యావంతుల సంఖ్య.

బ్రిటిషు ఇండియాలో ఉన్న పాఠశాలల వివరం.

కళాశాలలు	259
హైస్కూళ్ళు	3467
మిడిల్‌స్కూళ్లు (ఇంగ్లీషులో)	4388
... . (దేశీయ భాషలో)	6229
ప్రాధమిక పాఠశాలలు	200373

మొత్తం పాఠశాలలు 214716.

10469836 మనుష్యులకు 4223 చ॥ మైళ్ళ ప్రదేశమునకు	1 కళాశాల.
78365 మనుష్యులకు 315 చ॥ మైళ్ళకు	1 హైస్కూలు.
25590 మనుష్యులకు 103 చ॥ మైళ్ళకు	1 మిడిల్ స్కూలు.
1355 మనుష్యులకు 5 చ॥ మైళ్ళకు	1 ప్రాధమిక పాఠశాల.

స్త్రీలలో విద్య నభ్యసించినవారు నూటికి ఇద్దరు మాత్రమే. వారికై ప్రత్యేకంగా నిర్మించిన పాఠశాలలు పై మొత్తం సంఖ్యలో 6 వ వంతు మాత్రమే. ఇక సంస్థానాల్లో సంగతి చెప్పకయే తెలుసుకొనవచ్చును. జమిందార్ల భోగవిలాసాలకై పోయిన తర్వాత, మిగిలిన ధనంతో ఏ నలభై గ్రామాలకో ఒక పాఠశాలను నిర్మించారు. అచ్చట అవిద్యాధికుల సంఖ్య మరీఎక్కువ.

1936—37 లో రాష్ట్రీయవారీగా విద్యాశాఖకై ఖర్చుపెట్టినది. మొత్తం ఖర్చులో ఎన్నోవంతో

సంయుక్త రాష్ట్రాలు	205 లక్షలు	16.4%
మధ్యరాష్ట్రాలు	53 ..	10.8%
మద్రాసు	243 ..	15.3%
బెంగాలు	133 ..	11.5%
అస్సాము	35 ..	14.8%
బీహారు (ఒరిస్సాతో)	70 ..	12.6%
పంజాబు	160½ ..	13 6%
బొంబాయి (సింధుతో)	180 ..	14.6%

ఇంత తక్కువ పర్సంటు విద్యాశాఖ మీద వ్యయపరుపబడటానికి కారణాలు చూస్తే విచిత్రముగాను, ఘాతుకంగాను ఉంటాయి. ముఖ్యమైన వ్యయపట్టిక—

1. మిలిటరీ శాఖ 24

ఇదే సమయం ఇతర దేశాలతో పోలిస్తే—

ఇంగ్లండు	15%	ఫ్రాన్సు	16%
జర్మనీ	15%	ఇటలీ	21%

2. వడ్డీలు— తనకున్న 1208 కోట్ల రూపాయల మీద చెల్లించవలసిన వడ్డీ— మొత్తం ఖర్చులో 28%

3. పరిపాలనాశాఖ— హిందూదేశపు ఒక్కొక్కని సగటాయము తక్కినదేశాల్తో పోలిస్తే—(ఇండియాలో 1 అనుకొని)

ఇండియా	1 రూ॥	ఇంగ్లండు	14 రు॥
జపాను	2 ..	అమెరికా	22 ..
		కెనడా	17 ..

కాని జీతాల పట్టీలు చూస్తే—

ఇండియాలో వైస్రాయికి నెల 1కి		21333 రు॥
వైస్రాయి కార్యవర్గ సభ్యునికి నెల 1కి		6667 ..
జిల్లా అధికారులకు		1200 నుండి 3500 వరకు
జపానులో		
ప్రధాన మంత్రికి	నెల 1కి	522 రు॥
తక్కిన మంత్రులకు	..	376 ..
అమెరికా		
ప్రెసిడెంటుకు	..	17062 ..
వారి మంత్రికి	..	3412 ..
ఇంగ్లండు		
ప్రధానమంత్రికి	..	11111 ..
తక్కిన మంత్రులకు	..	5555 ..

సాధారణ సివిలు ఉద్యోగికి ఎప్పుడు రు॥ 3333 లకంటె ఎప్పుడు మించదు.

కెనడా		
ప్రధానమంత్రికి	..	3375 ..
తక్కిన మంత్రులకు	..	2250 ..

మొత్తం సివిలు, పోలీసు శాఖల మీద ఇండియా గవర్నమెంటు ఖర్చు మొత్తం ఖర్చులు 20% ఉంటుంది. ఇక పోతే మిగిలిన 28% లో తక్కిన దేశ సౌభాగ్య శాఖలకు మిగులుతుంది. దీనికి మార్పు రావాలంటే, మిలిటరీ ఖర్చు తగ్గించుకోవటం. సివిలు శాఖాధికారుల జీతాలు బాగా తగ్గించటం జరగాలి.

కాంగ్రెసు మంత్రివర్గాలు 7 రాష్ట్రాలలో ఏర్పడ్డాయి. సుమారు రెండు సంవత్సరాలు కావచ్చింది. కాని విద్య విషయము మాత్రం చాల రాష్ట్రాలు గప్‌చిప్‌గా ఉన్నవి. 1920 లో ఏ పాఠశాలలు, ఏ పుస్తకాలు, ఏ విద్య జాతీయ నిరోధకమని, భారతీయుల్ని బానిసలుగా తయారుచేస్తుందని గాంధీగారు పాఠశాలలు వదలిపెట్టి విద్యార్థులను బయటికి రమ్మన్నారో, ఆ పాఠశాలలే, ఆపుస్తకాలే, ఆ అధికారులే ఏమీ కదలకుండ ఈనాడు కూడ ఉన్నాయి. ఒక్క సంయుక్త రాష్ట్రాలలోమాత్రం ప్రభుత్వము కొంచెము శ్రద్ధ తీసుకున్నది. విద్యావిధానములో లోపాల్ని పరిష్కరించటానికి ఒక సంఘాన్ని నియమించారు. వయోజన విద్యా సమస్యను పరిష్కరించుతున్నారు. జూలైనుండి 7000 పాఠశాలలు స్థాపించటానికి ప్రయత్నాలు జరిగాయి, బొంబాయిలో కూడ నిరక్షరాస్యత నిర్మూలనానికి పూనుకున్నారు. మాద్రాసులో ఇంతవరకు ఎట్టిప్రయత్నము లేదు.

కాబట్టి ప్రభుత్వాలు ఇప్పటికి వయోజన విద్య విషయము కలిగించుకొనక పోయినా, విద్యార్థి సంఘాలు పూనుకోవటం సంతోషపడవలసిన విషయం. బొంబాయి రాష్ట్ర విద్యార్థి సంఘం తరపున గతసంవత్సరం చాల ప్రదేశాల్లో ప్రచారం పని బాగా సాగించారు. మైసూరులో, తిరువాన్కూరులో గూడ కొంచెం శ్రద్ధ తీసుకొంటున్నవి.

ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘంవారు భోగాపుర గ్రామములో ప్రారంభించి చూచారు.

ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘంవారు ఒక చిత్తు సిలబస్‌ను తయారు చేసినారు. దానిని ప్రకటించినట్లయితే దానిలోని లోటుపాట్లు సర్దుకోవచ్చును. ప్రభుత్వము వయోజన విద్యాప్రచారానికి పూనుకొనే దా॥ వి॥ సం॥ వారి సలబస్‌ను అమలుపరచి, ప్రతి విద్యార్థి సంఘము తప్పకుండా వయోజన విద్యా ప్రచారం చేయవలెను.

కొండపల్లి పరిస్థితులు.

చరిత్రాత్మక ప్రదేశమైన కొండపల్లి గ్రామము నేడు శిధిలమై వ్యాపారము, వ్యవసాయము లేక పోవుటయే గాక చేతి పనులు, సాంఘిక వృత్తులు కూడ నశించి. ప్రజలు పట్టణములకు వలస పోవుచుండుట అందరికిని తెలిసిన విషయము.

గ్రామ పరిస్థితు లిట్లుండ జిల్లా బోర్డువారికైనను యిట్టి కష్టములను పారద్రోలు దృష్టి కాన్పించదు. యెప్పుడో పదిమంది అధికార్లువచ్చి విశ్రాంతి గైకొను నిమిత్తము గ్రామ వెలుపలనున్న విశ్రాంతి భవనమునకు (Travellers rest house) పదివేల రూపాయలు దుర్వినియోగము చేయుచున్నారనిన ప్రస్తుత మాకలి మంటలకు ఆహుతి యగుచున్న ఏ వ్యక్తి వోర్చ గలడు? ప్రస్తుతమున్నటువంటి ఆ భవనమునకు రెండు వందల రూపాయలు వ్యయముచేసి మరమ్మతు చేసిన చాలును. మిగతా రు 9800 లు ఖర్చు పెట్టి గ్రామమునకు ఏమైన పరిశ్రమలు గాని. రైతుల పెట్టుబడికిగాని వినియోగించిన యెందరికో జీవనము కలుగును. ప్రస్తుత గవర్నమెంటువారి హయాములోనైన యిట్టి దుర్వినియోగములను అరికట్టించి ప్రజా క్షేమమయిన పనులు చేసిన బాగుండుననియు, పొలము దున్ని తయారు చేసుకొనిన రైతులు విత్తనములు లేక పొలమును పాడు పెట్టి, కూలిచేసి జీవించుతున్నారనియు, అట్టి కూలి కూడ ఒక దినము వుండి లేని పరిస్థితులతో యున్నారని కాంగ్రెసు గవర్నమెంటు వారికి యిందు మూలముగా గ్రామస్థుల తరపున మనవి చేయుచున్నాను.

పి. చలపతిరావు,
అధ్యక్షుడు.
వీర హనుమాన్ సంఘము.

★ ★ ★

హరిజన విద్యార్థి వసతి గృహము

రాజమహేంద్రవరము

ఆంధ్రమహాజనులారా!

తూర్పుగోదావరి మండలములో ఇంగ్లీషు చదువుకొను హరిజన బాలురకు ఉచితముగా అన్నము పెట్టి చదువు చెప్పించుటకు తగిన వసతి గృహము లేకపోవుటచే మేమురాజమహేంద్రవరములో అట్టి వసతిగృహం ఒకటి స్థాపించి జరుపుటకు నిశ్చయించినారము. "ధనమూల మిదం జగత్" అను సామెతనుబట్టి ప్రతి కార్యమునకు ధనము కావలయును కదా! అందులో యిటువంటి ఘనకార్యము ధనం లేకుండ ఒక్క గడియయు జరుగదు ఈ మండలములో నున్న తాలూకా ఒకటికి ఒక్క హరిజన బాలకుని తీసుకొనవలెనని మా సంకల్పము. అట్లయిన యీసంవత్సరము ఎనమండుగురు బాలకులు వసతి గృహములో నుందురు.

ఇంటి అద్దె, సేవకుల జీతములు, బాలుర భోజనపు ఖర్చులు కలసి నెలకు రమారమి 80 రూపాయలు కావలెను. జనసామాన్యము మనసార తలచుకొన్న పక్షమున యిది యొక గొప్ప మొత్తము కాదు. రాజమహేంద్రవర నివాసులయిన బోడ చిట్టెయ్య గారిని ఈ సంఘమునకు కార్యదర్శిగా ఏర్పరచినాము గనుక విరాళములు పంపువారు వారిపేర పంపి రశీదులు పొందగోరెదము.

కార్యనిర్వాహకులు

చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు: క్రొవ్విడి లింగరాజు: అరవ ఆదినారాయణ: బోడ చిట్టెయ్య: మద్దూరి అన్నపూర్ణయ్య: అరవ వెంకటస్వామి: బి. మల్లప్ప: డా॥ పి. గురుమూర్తి: దేవత శ్రీరామమూర్తి: బి. యస్. మూర్తి: సాము రామమూర్తి: మిత్తింటి నరసింహమూర్తి: రావుసాహెబు చుక్కా అప్పలస్వామి రెడ్డి: శ్రీమతి బత్తుల కామాక్షమ్మ: గోలి రామన్న: దిడ్ల పుల్లయ్య: కె. వెంకట్రామయ్య: కట్టా సూరయ్య: నేలపూడి సూర్యనారాయణ: పడ్డాది గురయ్య: సిరియాల అప్పలస్వామి: వంగల వెంకటరావు: సాక చెంద్రరావు; నక్కా వెంకటరెడ్డి: గోవాడ నిరీక్షణరావు: కర్పోతు సోమన్నగారలు.

లేఖలు

★ ★ ★

కాకినాడ కాంగ్రెసు కమిటీ చర్యలు.

1938 సంవత్సరములో జరిగిన కాకినాడ పట్టణ పురపాలక సంఘ సభ్యుల యెన్నికలో 9 వ వార్డునకు కాంగ్రెసు పార్టీ తరపున నిలువబడిన శ్రీయుత చావలి రామసోమయాజులుగారున్ను. వీరికి వ్యతిరేకముగా శ్రీయుత నోరి బాలక్రిష్ణమూర్తిగారున్ను అభ్యర్థులు. నోరి బాలక్రిష్ణమూర్తిగారు ఓడిపోయియున్నారు. అయినను వారిని 1939 సంవత్సరములో కాకినాడ పట్టణ నెం 2 రు సంయుక్త కాంగ్రెసు సభ్యునిగా పట్టణ కాంగ్రెసు కమిటీవారు యెన్నుకొని యున్నారు. లోగడ జరిగిన యెన్నికల సందర్భములో కాంగ్రెసు అభ్యర్థులకు వ్యతిరేకముగా పనిచేసిన శ్రీయుత సుబ్బవర్తి భీమలింగమూర్తిగారిని కాంగ్రెసు సంస్థలలో పాల్గొనరాదని శాసించియుండగా సదరు శాసనము కాంగ్రెసు అభ్యర్థి వ్యతిరేకముగా నిలచిన శ్రీయుత నోరి బాలక్రిష్ణమూర్తిగారికి మాత్రము వర్తించదా? చదువరులే వూహించుకో వచ్చును. కాకినాడ పట్టణ కాంగ్రెసు సంఘము వారి చర్యలు కడుంగడు శోచనీయముగా యున్నవి.

సూర్యారావుపేట, కాకినాడ.

ఇట్లు,
కాంగ్రెసు సభ్యుడు,
నోరి నరసింహ్వాం.

★ ★ ★

గ్రామ మునసబు సమక్షంలో యిండ్లకు నిప్పు!

3—6—39 వ తేదీని కొరుప్రోలులో అగ్నిప్రమాదం వలన 600 పైగా యిండ్లు కాలిపోయిన వార్త ఇదివరకందరకు తెలిసిన విషయమే. మరల 24—6—39 వ తేదీని మొదటిసారి ప్రమాదము సంభవించినచోటనే అగ్నిపడి 15 ఇండ్లవరకు కాలిపోయినవి. ఆ రెండవ దఫా కాలిన యిండ్లలో యీపూరి రామరాజుగారి ఇల్లు కాలిపోలేదు. అయనకు విరోధులగు పుట్టా బుల్లియ్య. పుట్టా చిన్నయ్య వగయిరాలు 26—6—39 వ తేదీని పగలు ఆ యింటికి నిప్పు అంటించిరి. ఇదివరకు జరిగిన ప్రమాదమునకు ప్రజలు భయపడి అర్పుటకువెళ్ళగా వెళ్లినవారిని అర్పనీయకుండా చెరువునుండి నీళ్లు తెచ్చే వాళ్లని తేనీయకుండా పై ఆసామీలు అటంకపరచిరి. యిల్లు కాలిపోయిన రాజుగారు యింటిపైనుండి ఆర్పుకొనుచుండగా పుట్టా బుల్లియ్య ఆయనను ఆర్పవద్దని క్రిందకు త్రోసివేసెను. ఆయన పడుటచే దెబ్బలుకూడ తగిలినవి. ఇట్టి దుర్మార్గమైన పనిచేయుట కూడదన్న మీనెల్లి నారాయణమూర్తి, యర్రా వెంకట్రావు అనువారిని కూడా కొట్టిరి. యింతే గాకుండ ఆ రాజులను "మీరు మీ యిండ్లలోనుండి పోయిన్నచో మీ ప్రాణములుండవని చెప్పి ఊరి బయటకు పిల్లలతోసహా తరిమివేసిరి. వారు పొలములలోకి పోయి నానా అవస్థలు పడుచు అల్లాడుచున్నారు. ఎవరితో చెప్పుటకు అంతా వారి హయాములోనే ఉన్నారు. గ్రామ మునసబుగారితో చెప్పుకొనుటకును ఆయన సమక్షమునే జరిగినందున యిక న్యాయము దొరకదని చెప్పుకోలేదు. కాంగ్రెసు వారి హయాములోనే మునసబు బంధువులు ఇటువంటి దుష్కృత్యమును జరిగించుట చాలా అన్యాయముగా ఉన్నది. యీ పుట్టా బుల్లియ్య, చిన్నయ్య వగైరాలు యిదివరలో కొరుప్రోలు బందిపోటు కేసులో జైలుకు వెళ్లినవారే. మరల ఆ గ్రామంలో యిటువంటి అన్యాయములు జరుగుచున్నందున ఆ యూరి ప్రజలు చాల భీతిల్లుచున్నారు. దీని విషయమై అధికారులు తగిన చర్య తీసికొనెదరని నమ్మి ఈ సంగతి తెలియపర్చడమైనది.

గుడివాడ

ఇట్లు
పేరిచర్ల లక్ష్మీపతిరాజు

★ ★ ★

ఎన్నికలలో ఓడిన కుడిపక్ష నాయకుల పన్నాగం.

5—7—39 తేదీని నర్సారావుపేటలో సమావేశమైన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘ కార్యనిర్వాహక వర్గము వారు చిత్తూరు జిల్లా కాంగ్రెసు సంఘమును ఖద్దరు నియమము ననుసరించి రద్దుపరచినట్లు 8-7-39 తేది ఆంధ్ర పత్రికలో ప్రచురించియున్నారు. ఆ సంఘ ఎన్నికల నామినేషను 22-2-39 తేదీని జరిగెను. తర్వాత రెండు మాసములకు (28-4-39) అధ్యక్ష, కార్యదర్శి, కార్యనిర్వాహకవర్గ ఎన్నికలు జరిగెను. నామినేషనులు దాఖలు చేసినట్లుగాని, అధ్యక్షుని ఎన్నిక జరిగినప్పుడుగాని, ఎవ్వరున్ను ఎట్టి ఆక్షేపణ చేసియుండలేదు. ఖద్దరు కట్టని ఏసభ్యుడును సమావేశంలో పాల్గొనినట్లు నాకు తోచలేదు. ప్రస్తుత ఆక్షేపణకు కారకులు నూతన అధ్యక్షునికిన్ని కార్యనిర్వాహవర్గం వారికిన్ని అభివందన సందేశములు కూడా పొసగియుండిరి. 1938 సం॥రంలో జరిగిన జిల్లాసంఘ సమావేశంలో అధ్యక్షుని ఎన్నిక సందర్భంలో నొక సభ్యుడు ఖద్దరు నిబంధనను అనుసరించమని ఎన్నికోద్యోగిని కోరగా, అప్పట్లో ఎన్నికోద్యోగిగాయుండిన శ్రీ కె వరదాచార్యులుగారు రూలొౌటు యిచ్చి ఎన్నిక జరిపినారు. ఆనాడు వారిపై ఎట్టి చర్యయు తీసుకొనక, యీ సంవత్సరము ఎన్నికలు జరిగిన అయిదు నెలల అనంతరం, జిల్లా సంఘ సాధారణ సమావేశములు రెండున్ను, కార్యనిర్వాహకవర్గ సమావేశములు నాలుగున్ను జరిగిన పిదప, సంఘమును రద్దుపరచడం చూడ జిల్లా సంఘములో ఓడిన కుడిపక్షనాయకుల పన్నాగమే కారణమైయుండునని తోచకమానదు.

చిత్తూరు జిల్లాకాంగ్రెసు ఎన్నికోపసంఘము గావించిన పొరపాటుకు వారి వల్ల సంజాయిషీ పుచ్చుకొని తప్పు ఏర్పడగలపట్ల వారిపై చర్య జరుపవలసినదే కాని. నిష్కారణంగా జిల్లాసంఘమును కొందరు పన్నిన పన్నాగముచే రద్దుపరచడం ఏలాటి నిరంకుశత్వమో విశదమగుచున్నది. దీనికి కారణం అధ్యక్షులు వామపక్షమువారనియా? కాంగ్రెసులో ఒక భాగమైన వామపక్షమువారికి కాంగ్రెసులో స్థానమే లేదా?

వీటినన్నిటిని గమనించి రాష్ట్రసంఘ అధికారవర్గం వారు తమ నిర్ణయమును మార్చుకొనవలయునని కోరుచున్నాను.

ఇట్లు
డి. రామబ్రహ్మం
చిత్తూరు జిల్లా కాంగ్రెసు సంఘ కార్యనిర్వాహక వర్గ సభ్యుడు.

కుప్పం
10—7—39

మైపాడు రాజకీయ పాఠశాల రిపోర్టు


కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు 100 మంది విద్యార్థులను తరిఫీదు చేయడానికి ఉద్దేశించబడిననూ 30 మంది విద్యార్థులే చేరారు. వచ్చిపోతూ వుండే విద్యార్థులు మరియొక నలుగురైదుగురు ఉండేవారు.

ఈ 30 మందిలోను కడప జిల్లా నుండి ఒకరూ రాలేదు, చిత్తూరు జిల్లానుండి 5 గురు, మద్రాసునుండి ఒకరు, మిగిలినవా రందరూ నెల్లూరు జిల్లానుండి వచ్చారు; 30 మందిలో పార్టీ సభ్యులు 15 మంది; స్త్రీలు ముగ్గురు.

స్కూలు మే నెల 15 వ తేదీ కామ్రేడ్ దర్శి సుభద్రమ్మగారిచే ప్రారంభించబడింది. 16 వ తేదీనుండి పాఠాలు ప్రారంభించబడ్డాయి. జూన్ 12 వ తేదీ సాయంకాలము కామ్రేడ్ రంగాగారి అంత్యోపన్యాసముతో ముగించబడింది. సోషలిజముయొక్క ప్రధాన సిద్ధాంతములు ప్రపంచ కార్మికోద్యమ చరిత్ర, భారత దేశ జాతీయోద్యమ చరిత్ర, ప్రస్తుత భారతీయ రాజకీయ కక్షలు. రష్యా విప్లవానంతరము సోవియటు యూనియను అభివృద్ధి. ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు, వివిధ సంఘాలలో ఎలాగు పనిచేయవలసినది మొదలగు విషయముల గూర్చి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారు వివరముగా తెలియజేసారు భారత దేశ కార్మికోద్యమ చరిత్ర, భారత కమ్యూనిస్టుల చరిత్ర, ట్రేడు యూనియనులలో ఎట్లు పని చేయవలసినదీ కామ్రేడ్ ఘాటే తెలియజేశాడు. ఫెడరేషన్‌పై కామ్రేడ్ నరసింహారెడ్డిగారు ఉపన్యసించారు. భూగోళశాస్త్రము, జీవశాస్త్రముపరిణామవాదమునుగూర్చికామ్రేడ్ బల మరెడ్డిగారు తెలియజేశారు. వర్కింగ్ క్రీన్ లీగు గాంధిజీనాయకత్వమును విమర్శిస్తూ, స్వతంత్రంగా ఆలోచించవలసినదని విద్యార్థులకు బోధించారు.

మొత్తానికి ఉపన్యాసాలు ఎక్కువ కామ్రేడ్ సుందరయ్యగారే ఇచ్చారు. ఈ ఉపన్యాసాలు కూడముందుగ తయారు చేసుకోక. ఎప్పటికప్పుడు ఇస్తూ వచ్చారు. అందుచే ఒకరే ఉపన్యసించడమువలన గలిగే విసుగుతోపాటు. విద్యార్థులకు కావలసినన్ని వివరములుకూడ లేకుండ పోయుండవచ్చును. కాని విద్యార్థులకు సోషలిజంయొక్క ప్రాథమిక సూత్రములను. రాజకీయాలలో ప్రధానాంశములను తెలియజేయ డానికి ఈ మాత్రము. చాలు నిర్మాణ సమస్యలనుగూర్చి చెప్పునప్పుడు గ్రామస్థులకు, రైతులకు పారిశ్రామిక కార్మికులకు ప్రస్తుతమున్న చట్టములలోను. ప్రభుత్వపు ఆర్డర్లలోను ఎట్టి సదుపాయాలున్నదీ వివరముగా తెలుప చాలక పోవడము గొప్పలోపము. దాదాపు 15 రోజులు మధ్యాహ్నకాలము. రోజుకొకరు ఒక గ్రామమును తీసుకొని అచ్చటి పరిస్థితులనుగూర్చి, ప్రజల కష్టములగూర్చి, వానిని తొలిగించడానికి వారుచేసిన కృషినిగూర్చి రిపోర్టు ఇచ్చేవారు. ఆ రిపోర్టుపై ప్రశ్నలు. ఆ ప్రశ్నలకు జవాబులు రిపోర్టు ఇచ్చేవారు. తదుపరి ఈవరకు పని చేసినదానిలో లోపాలను తెలియజేస్తూ ముందు ఎలాగు పనిచేయవలసినదీ విద్యార్థులు సూచనలు చేసేవారు. అఖరిని ప్రిన్సిపాలు చర్చను క్రోడీకరించి తన అభిప్రాయాన్ని సూచనలను చేసేవారు. ఈ చర్చలు విద్యార్థులకు ఎక్కువ లాభకరంగా ఉండినవి.

ఉదయము 5 గంటలకు విద్యార్థులు లేచేవారు, 5-30 6-30 గంటల వరకు మిలిటరీ డ్రిల్లు కామ్రేడ్ సుందరయ్యగారు విద్యార్థులకు గరిపేవారు. అఖరివారములో కర్ర తుపాకుల కవాతు కామ్రేడ్ పట్టాభి రామయ్యగారు నేర్పారు. ఉదయము 7-30 11 గంటలవరకు 3—5 వరకు పాఠాలు ఉండేవి. సాయంకాలము 5-30—6-30 వరకు సముద్ర తీరమున ఇసుకలో ఆటలు మొదటి 15 రోజులు సాగాయి. కాని విద్యార్థులలో ఎక్కువమందికి వీనిమీద తగినంత శ్రద్ధలేకపోవడముచేత ఇవి మానివేయబడ్డాయి. కాని ప్రతిరోజు సాయంకాలము సముద్రతీరమునకు విద్యార్థు లందరూ నిర్బంధముగా వెళ్లవలసి ఉండినది. ఉదయము 7 గంటలకు ఫలహారము. 11-30 గంటలకు భోజనము, మధ్యాహ్నము 2-30 గంటలకు టీ, రాత్రి 8 గంటలకు భోజనము.



పల్లెకోన రాజకీయ పాఠశాల విద్యార్థులు

ఈ స్కూలులో శిక్షణ మిలిటరీ శిక్షణలాంటిది లేకపోయిననూ సంతృప్తికరంగానే ఉండినది.

ఈ పాఠశాలవలన విద్యార్థులకు కలిగిన లాభాలు ఏమిటి అని పరిశీలించినపుడు అట్టే సంతృప్తికరంగా లేదు అని చెప్పవచ్చును. మునుపు పనిచేస్తూన్న విద్యార్థులుగాక మరి యొక 5 గురు విద్యార్థులు పనిచేయడానికి ముందుకు రావచ్చు. సోషలిజమును గూర్చి కొద్దిగనో గొప్పగనో తెలసికొని ఉన్న పార్టీ సభ్యులకు, సోషలిస్టు సిద్ధాంతాలనుగూర్చి మరింత స్పష్టభావాలు ఏర్పడి ఉండవచ్చు. కొంతమంది కామ్రేడ్స్ తెలియజేసినట్లు ఈ పాఠశాల తాము సరిగా పనిచేస్తూ ఉన్నదీ, తాము ప్రస్తుత రాజకీయాలనుగూర్చి గలిగిఉన్న భావాలు ప్రస్తుత పరిస్థితులమగూర్చి తాము అర్థము చేసుకొన్న తీరు, సరిగా ఉన్నదీ లేనిదీ సరిచూచుకోడానికి కొంతవరకు ఉపయోగపడి ఉండవచ్చు. విద్యార్థులందరూ తెలియజేసినట్లు వివిధ స్వభావములు గల వ్యక్తులు, ఒకే ఆశయంకోసం, ఒకే స్థలమున నివసించి పనిచేయడమునకు అలవాటు పడడము, ఒకరితో ఒకరు కలసిమెలసి ఉండడము, కామ్రేడ్ షిప అభివృద్ధి గావడానికి ఇది కొంత తోడ్పడి ఉండవచ్చు. కాని ఈ స్కూలు అర్గనైజర్లు పడిన శ్రమ, అయిన ధన వ్యయము, పార్టీ సభ్యులనుకూడ పనిలో నుండి ఒక మాసమురోజులు ఇట్టిస్కూల్సు తొలగించి యుండడము చూచిన దీనికన్న వివిధ సంఘముల ద్వారా వివిధసంఘ సభ్యులకు అధ్యయన తరగతులు ప్రతిరోజూ గాని, వారానికి రెండుమూడురోజులు గాని పెట్టడమువలన ఎక్కువ ప్రయోజనముంటుందన్న అభిప్రాయము కలుగక మానదు, అట్టి అధ్యయన తరగతులతోపాటు పార్టీ అర్గనైజర్లకు ప్రతేక పాఠశాలలు. వారమురోజులుగాని పక్షము రోజులు గాని పెట్టవలయును. వాలంటీరు శిక్షణలు మిలటరీ డ్రిల్లుకోసం ఏర్పర్చడం డ్రిల్లు చెప్పునప్పుడు ముఖ్య రాజకీయ సూత్రాలు బోధించడము కూడ ఉండాలి. కాని వివిధ దశల రాజకీయ చైతన్యము కలిగినవారికి సిద్ధాంతాలు ఆచరణమార్గాలు బోధించడానికి పాఠశాలలు ఏర్పర్చడము అంత లాభకరముగా లేదు.

కార్మికవర్గ పార్టీ ఎలా వుండాలి?

(గత పేజీ తరువాయి) కాదు" అన్నారు.... బూర్జువా విజ్ఞానిని బుద్ధి ఏలావుంటుందో, తాను పార్టీ డిసిప్లిను, నిర్మాణానికి అతీతుడుగా వుండాలసిన "కొలదిమంది ఘనుల"లో ఒకరినని ఎలాతలుస్తాడో యీమాటలు స్పష్టంగా తెలియజేస్తాయి"

"మన పార్టీ నిర్మాణాం అభివృద్ధి చెందు కొలదీ వర్గచైతన్యం పొందిన కార్మికుడు కార్మికవర్గ సైన్యంలోని వీరుని దృక్పథానికి బూర్జువా విజ్ఞాని దృక్పథానికి వున్నభేదం తెలిసికోవాలి. సామాన్య సభ్యులేగాక పైవారుసైతం పార్టీ నిబంధనలు పాటించాలనీ, కార్యక్రమాన్ని అమలు జరపాలనీ అతడు కోరాలి."

ఆదర్శ ఐక్యత చాలదు

పార్టీ నిర్మాణం విషయంలో మెన్షివిక్కుల ధోరణి అవకాశ వాదమనీ, మెన్షివిజంలోని ప్రధానలోటు శ్రమికవర్గ పోరాటంలో పార్టీ నిర్మాణంయొక్క ప్రాధాన్యతను గుర్తించక పోవుటేనని లెనిన్ చెప్పాడు. —

మెన్షివిక్కులు విప్లవ విజయానికి కార్మికవర్గ పార్టీ నిర్మాణం అత్యంత అవసరమని గుర్తించలేము. తద్విరుద్ధంగా లెనిన్ ఆదర్శ ఐక్యత మాత్రం వుంటేనే జయం సాధ్యపడదనీ, జయంపొందాలంటే దానితోపాటు నిర్మాణ ఐక్యతబలం వుండాలనీ వాదించాడు. ఒకే ఆదర్శం బలమైన నిర్మాణం వున్నపుడే కార్మికవర్గం మొక్కవోని శక్తిని సంపాదిస్తుందని లెనిన్ భావించాడు.

నిర్మాణమే ప్రధాన ఆయుధము.

లెనిన్ యిలా వ్రాసాడు :- "అధికారం కొరకు పోరాటంలో కార్మికవర్గానికి నిర్మాణానికి మించిన ఆయుధం వేరొకటిలేదు. బూర్జువా ప్రపంచంలోని పోటీలో ఐక్యతను గోల్పోతూ, నిర్బంధంగా పనికి పంపబడుతూ అత్యంత హీన స్థితిపోవున్న కార్మికవర్గం బలమైనశక్తిని మొక్కవోని బలాన్ని సంపాదించుతుంది. ఆదర్శాల ఐక్యతతో పాటు నిర్మాణ ఐక్యత వుండి లక్షలకొలది కష్టజీవులగు ప్రజానామాన్యాన్ని సైన్యంగా తయారు చేయగలిగితేనే సాధ్యమవుతుంది. అపుడు జారు చక్రవర్తి నిర్బంధపాలన, అంతర్జాతీయ పెట్టుబడివారల పెత్తనంకూడ యీ సైన్యధాటికి ఎదురు నిలువజాలవు"

దిగ్బాయి ఆయిల్ పనివారి సమ్మె

దిగ్బాయి ఆయిలు పనివారల సమ్మె యిప్పటికి 108 రోజులనుంచి సాగుతోంది. కాంగ్రెసు మహాసభ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ దిగ్బాయి కార్మికులను, కంపెనీ యజమానులను సమాధానపరచ ప్రయత్నించి విఫలుడై, కార్మికులు శక్తివంచన లేకుండా సమ్మె సాగించవలసినదేనని ప్రకటించి, వర్కింగు కమిటీలో ఈవిషయమై ఆలోచించెదమని తెలియజేశాడు. జూన్ 25 వ తేదీ జరిగిన అఖిల భారత కాంగ్రెసు వర్కింగుకమిటీ సమ్మెదారులకు సానుభూతి చూపుచూ; పనివారలను యేవిధముగా పనిలో చేర్చుకోవాలి అనే విషయాన్ని గూర్చి తీర్పు చెప్పడానికి ఒక సమాధాన సంఘాన్ని యేర్పరచాలనే కాంగ్రెసు అధ్యక్షుని సూచనను కంపెనీ యజమానులు అంగీకరించనందులకు విచారించుచూ; ఈ నూనె పరిశ్రమ కూడ ముఖ్య పరిశ్రమలలో నొకటనియు: కరాచీ కాంగ్రెసు తీర్మానము ననుసరించి ముఖ్య పరిశ్రమలు ప్రభుత్వ ఆధీనములో వుండాలను విధానము కాంగ్రెసు మార్చుకొనలేదనియు, కంపెనీవారు సమాధానకమిటీ నియామకమునకు అంగీకరించుతారని యాశించుచూ; లేనియెడల సమాధాన కమిటీ నిర్ణయాన్ని అంగీకరించునట్లు చేయటానికి ప్రభుత్వం శాసనముచెయ్యాలనియు; కంపెనీవారు సమాధానమునకు రాకపోతే అస్సాం ప్రభుత్వము ఇప్పుడున్న కంట్రాక్టుకాలం పూర్తి అయిన తరువాత యజమానులకు తిరిగి కంట్రాక్టు యివ్వకుండుటకు తగిన చర్య తీసుకోవచ్చనీ; కాంగ్రెసు అధ్యక్షుని సూచనను అంగీకరించాలని కంపెనీవారిని తిరిగి కోరుతూ, కాంగ్రెసు ప్రజా సానుభూతి నిలుపుకోవలెనంటె కార్మిక సంఘం ఈ కమిటీ సలహాను అంగీకరించాలని సూచించింది.


ఎ.ఐ.సి.సి లో డా॥ బి. సి. రాయిగారు (కాంగ్రెస్ కార్యనిర్వాహక వర్గ సభ్యులు) సమ్మె పుట్టుపూర్వోత్తరాలు తెలియజేశారు. ఈతీర్మాన ఉద్దేశములతో ఎ.ఐ.సి. సి అంతా ఏకీభవించింది. అంతే గాక అతివాదులు కార్మికులకు పూర్తిగా సహకారము చేయుటకు మార్గములను సూచించుచూ కొన్ని సవరణలు తెచ్చిరి. ఆర్. కె. సిద్వా. ధైర్యముగా నిలబడిన కార్మికులను అభినందించాలని, సమ్మెను విచ్ఛిన్నము చేయుటకు జరిగిన ప్రయత్నములను నిరసించాలని, బర్మా ఆయిల్ కంపెనీ వస్తువులను బహిష్కరించాలని తెలియజేశారు.

బి. సన్యాల్ సమ్మెదారులందరిని పనిలోనికి తీసుకోవలెనని గట్టిగా చెప్పాలనీ యీ విషయమై రాజకోటలో మాదిరిగా అఖిలభారత ప్రతిష్టంభన కల్గించాలనీ సూచించాడు. శివనాథ బెనర్జి జులై 10వ తేది దిగ్బాయి దినముగా జరపాలని కోరాడు.

కాని, యీ సూచనలేవియు ఎ. ఐ. సి. సి అంగీకరించలేదు. పైసవరణలు అంగీకరించి వున్నట్లయితే కంపెనీవారిపై శాసనముద్వారా ఒత్తిడి చేయుటయే కాక, ప్రజాపోరాటముద్వారా కూడ ఒత్తిడి గల్గించి వుండేవారు. కాంగ్రెసువాతావరణము కార్మికులందుసానుభూతిగ వున్ననూ దిగ్బాయిలో 144 శక్షన్ తిరిగి రెండు నెలలవరకు అమలులో నుండునని ఈ నెల 5 తేదీని అస్సాం గవర్నరు వుత్తరవు చేశాడు. కాంగ్రెస్ మంత్రివర్గమైనను కార్మికులపై యీనిర్బంధ విధానమును తొలగించి, యజమానులపై 144 సెక్షను అమలుజరపాలి. కార్మికులలో యూనియన్ సభ్యులు దిగ్బాయిలో తిరుగుచుండగా కొంతమంది రౌడీలు కత్తులు కఠార్లతోవచ్చి హింసించిరి. దౌర్జన్యమును పురికొల్పి హింసావాతావరణమును కల్గించుటకు కంపెనీవారి పన్నాగమే ఇది.

ప్రభుత్వవిచారణ

దిగ్బాయిసమ్మె పరిస్థితులను, కారణాలను, ఏప్రిల్ 18 వ తేదీ మిలిటరీ కాల్పులను గూర్చి విచారించడానికి, ఒక కమిటీని నిర్ణయిస్తూ ఈ నెల 9 తేదీని అస్సాం ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. కలకత్తా హైకోర్టు రిటైర్డుజడ్జి సర్ మన్మథనాథ్ ముఖర్జీని ఈ విచారణకమిటీకి అధ్యక్షుడుగా నియమించింది.



ఈ కమిటీ ముఖ్యంగా ఈక్రింది విషయాలను గురించి విచారణ చేస్తుందని తెలుస్తోంది. (1) ఏప్రిల్ 18 వ తేదీ కాల్పులకు కారణాలు, తమపరి పరిస్థితులు (2) ఈ కాల్పుల సందర్భంలోను, తరువాత అక్కడి స్థానిక ఆఫీసర్లు ఏమిచేసినది, (3) అసలు ఈసమ్మెకు కారణాలు తెలుసుకొని ఇకముందు ఇట్టి సంఘటనలు రాకుండ చేయడానికి సూచనలు.

ఈ కమిటీవారు, ఈనెల 13 న తేదీని కార్మిక సంఘంవద్ద, కంపెనీ యజమానులవద్ద స్టేటుమెంట్లు తీసుకొని, విచారణను ఆగస్టు 7 వ తేదీకి వాయిదా వేశారు.

మదరాసు

"ఆంధ్రపత్రిక" లో సమ్మె

మద్రాసులో "ఆంధ్రప్రభ" "దినమణి" "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" ప్రెస్ కార్మికులు ఇప్పటికి 20 రోజులనుండి సమ్మెచేయుచున్నారు. ఈసమ్మెలో పికెటింగు సందర్భమున అరెస్టుచేయబడిన కామ్రేడ్ బి. శ్రీనివాసరావు (అ. భా. కాంగ్రెసుకమిటీసభ్యులు, తమిళనాడు కాంగ్రెసు సోషలిష్టుపార్టీ కార్యదర్శి) గారికి ఒక నెలరోజులు జైలుశిక్ష విధింపబడింది. మద్రాసు ప్రెస్ వర్కర్సుయూనియన్ కార్యదర్శి అయిన కామ్రేడ్ ఎ. యస్. కె.అయ్యంగారిపై తేబడిన కేసు ఈనెల 13, 14 తేదీలలో విచారింపబడినది. యూనియన్ ఉపాధ్యక్షుడైన పి. ఆర్. కె. శర్మగారును కామ్రేడ్ దర్శి సుభద్రమ్మగారు సాక్షులుగా విచారింపబడ్డారు. 14 వ తేదీని, ప్రాసిక్యూషనువారు కామ్రేడ్ అయ్యంగారిపై ఇంకను రెండు సెక్షనులపై కేసులున్నాయని చెప్పుటవలన పూర్తివిచారణకు 18 వ తేదీకి వాయిదా వేసిరి.

ఇవిగాక 12 వ తేదీని 3 గురను 13 వ తేదీని 8 మందిని పికెటింగువద్ద అరెస్టుచేసి అందులో 5 గురికి వారంరోజులు చొప్పున జైలుశిక్ష విధించారు.

16 వ తేదీ ఆదివారంనాడు మద్రాసులోని ప్రెస్ వర్కర్లందరు, సమ్మెచేయుచున్న "ఆంధ్రప్రభ", "దినమణి" ప్రెస్ కార్మికులకు సానుభూతి తెల్పుటకు పెద్ద ఊరేగింపు చేసినారు. సమ్మె యింకా సాగుతూనే వున్నది. ఇప్పటికి 84 అరెస్టులు జరిగాయి.

కాకినాడ

ప్రెస్సు కార్మికుల విజయం

రంగా అండు కో పనివారి సమ్మె పరిష్కారం

రంగా అండు కో ప్రెస్ పనివారు 17 రోజులు సమ్మె చేశారు. సమ్మెచేస్తూన్నంతకాలం ప్రతి రోజూ బహిరంగసభలు జరుపుతూ యజమానుల దోపిడీని, సమ్మెను విడగొట్టడానికీ, చెడగొట్టడానికీ చేసే ప్రయత్నాలు, ప్రజలకీ, కార్మికలోకానికీ వెల్లడిచేశారు. 3-7-39 వ తేదీని కాకినాడ లేబరు తహస్సీల్దారు ఎ. భాస్కరరావుగారి సమక్షంలో సమ్మె పరిష్కారము జరిగింది.

రాజీ షరతులు

పాత జీతాలు యిచ్చుట

ఆదివారానికి బదులుగా శుక్రవారం శలవుదినం

పనివానిని తగినంత కారణం లేకుండా పని నుండి తొలగించకూడదు.

వారం రోజులు ముందు నోటీసు ఇవ్వనిదే ఉభయ పార్టీలలో ఎవరు గాని పని మానివేయకూడదు.

ఉభయపార్టీలూ అంగీకారాన్ని తెలియజేస్తూ ఒడంబడిక పత్రంపై సంతకం చేశారు.

అచ్చుపనివారూ, యితర కూలీలూ, 'జయ జయ' ధ్వానాలతో ఊరేగింపు జరిపారు.

పీచుపనివారల సమ్మె

పచ్చిపులుసు వెంకట్రాజు పీచుకొట్టులో కొందరి పనివారిని తొలగించినందున పనివారు సమ్మెచేసిరి. అదికూడా 3-7-39 వ తేదీని తహస్సీలుదారు గారిసమక్షంలో పరిష్కారం జరిగింది. పీచు షాహుకారు తగినంతకారణం లేనిదే ఏపనివానినీ పనినుండి తొలగించకుండుటకునూ, వారం రోజులు ముందు నోటీసు యివ్వనిదే పని మాన్పించివేయకుండుటకునూ ఒప్పుకున్నాడు.

పుల్లూరికరణంగారి కేసు

పుల్లూరు గ్రామము (బెజవాడ తాలూకా) జమీందారీ గ్రామమై ఉండుటవలన ఆ గ్రామ కర్ణంగారైన శ్రీ గొల్లపూడి నర్సయ్యగారే జమీందారుగారి కరణంగాకూడా ఉండి జమీందారుగారి లెక్కలను కూడా చూచుచున్నాడు. ది 18-8-38 వ తేదీన పుల్లూరుగ్రామ రైతులు 14 మంది శ్రీ సుంకర సూర్యనారాయణ, (కార్యదర్శి, జిల్లా రైతుసంఘం, 1938) గారికి తమ గ్రామకరణంగారు తమ వద్దనుండి అక్రమంగా రూపాయ 1కి అర్ధణా చొ॥ మామూలు వసూలు చేయుచున్నాడని స్టేటుమెంటు నిచ్చిరి.

ఈ విషయమును విచారించవలసినదిగా శ్రీ సూర్యనారాయణగారు బెజవాడ తహశ్శీలుదారు గారికిన్నీ, బెజవాడ సబుకలెక్టరుగారికిన్నీ, జిల్లా కలెక్టరుగారికిన్నీ తెలియపర్చిరి. అందుపై బెజవాడ తహశ్శీలుదారుగారు 15-9-38 వ తేదీన కొండపల్లిలో వాయిదావేసి, అప్పటినుండి నేటివరకు విచారణ జరిపిరి.

రైతులను అనేకవిధములుగా కరణంగారు జడిపించి నిజమైన సాక్ష్యమురాకుండా చేయు అనేక ప్రయత్నములు చేసినారు. గవర్నమెంటుకూడ విచారణలో రైతులకు ఎక్కువ సౌకర్యములు కలగచేయక 18 మైళ్ళ దూరములోనున్న కొండపల్లిలో వాయిదా వేయుచు 9 నెలల 15 రోజులు జరిపినారు. అయినప్పటికిని రైతులు ధనవ్యయ, ప్రయాసలకోర్చి, ధైర్యముతో తమను అనేక సంవత్సరముల నుండి పీడించుచు, తమదగ్గర నిర్బంధముగా మామూళ్ళు వసూలు చేసిన కర్ణంగారిపై సాక్ష్యమునిచ్చిరి.

విచారణ అంతయు పూర్తిచేసి గవర్నమెంటు తమ తీర్పు నిచ్చుకాలములో శ్రీ గొల్లపూడి నర్సయ్యగారు తమ కరిణీక ఉద్యోగమునకు రాజీనామా యిచ్చినారు. ఇందువల్ల కేసు విచారణ నిల్పివేసితిమని నెం. 9473/38 రు ఆర్డరును 30-6-39 వ తేదీన జారీ చేసిరి.

నేడు శ్రీ గొల్లపూడి నర్సయ్యగారు తమ స్నేహితుల ద్వారా తాను రాజీనామా యిచ్చిన కరణం ఉద్యోగమునకు ప్రయత్నములు చేయుచున్నట్లు తెలియుచున్నది. ప్రజలను నానావిధములుగా హింసించి, చివరకు కోర్టులో తనపై వచ్చిన కేసును తాను నిరపరాధినని రుజువుచేసుకోలేక, రాజీనామా ఇచ్చిన వానికి తిరిగి ఉద్యోగము యివ్వవలదని ప్రజలు గవర్నమెంటును కోరుచున్నారు.

బెజవాడ, 15-7-39

ఇట్లు
వెల్లంకి విశ్వేశ్వరరావు
కార్యదర్శి, జిల్లా రైతు సంఘం.

సంయుక్త నాయకత్వమే నేటి నినాదం

కామ్రేడ్ జి. అధికారి

ఈమధ్య, ప్రముఖ కమ్యూనిస్టుల కొందరి ఉపన్యాసాలను అవక తవకగలగా ప్రచురించిన ప్రెస్ రిపోర్టులను ఆధారం చేసికొని కొందరు మంచి అవకాశం తీసుకొన్నారు. మళ్ళా పాత కేక వేయసాగారు. "కమ్యూనిస్టులు గాంధిజానికి లొంగిపోయారు. కమ్యూనిస్టులు గాంధిగారి నాయకత్వం పోరాటానికి అవశ్యం, విడిచిపెట్టరానిది అంటున్నారు." "గాంధిగారి చిన్న కుటీరానికి మార్చింగ్ ఆర్డర్స్" కోరుతున్నారనే పూర్వపు అపహాస్యానికి ఇది క్రొత్తరూపం. మా "సంయుక్త నాయకత్వ" నినాదం 'ఒకే నాయకత్వం' ముందు లొంగి పోవడమని పెడర్థం తీశారు.

సాధారణంగా, ఈ అవక తవక వ్రాతలను, రాజకీయ నిందలను మేము చెవిని బెట్టాలిసిన పనిలేదు. ఊరకే 'మరోనాయకత్వపు' నాయకుడు యం. యన్. రాయ్‌గారి మొన్న మొన్నటి తాజా లొంగుబాటును చూపించి "డాక్టరుగారూ! ముందు మీ రోగం కుదుర్చుకోండి!" అని అనేవాళ్ళం. కాని వెటకారం-వెక్కిరింతల వలన లాభం లేదు. కాన, రాజకీయ సమస్యల్ని సీరియస్‌గా విశదీకరించదలచుకొన్నాం. మా స్వంత అనుయాయిలలోనే సంయుక్త నాయకత్వ నినాదాన్నీ, గాంధిజం యెడల మావైఖరినీ తప్పుగా అర్థంచేసికొన్నట్లు కన్పడుతోంది.

మా అనుచరులు కొందరు సంయుక్త నాయకత్వాన్ని, మెకానికల్‌గా పొందవచ్చునని అర్థం చేసుకొన్నారు. ఊరక దేశ వ్యాపితముగా స్థానిక పోరాటాలను తెచ్చుటద్వారా ప్రస్తుత నాయకత్వాన్ని పోరాటానికి 'లాగ' వచ్చునని తలచారు. ప్రస్తుత 'ఒకే నాయకత్వముతో కూడిన గాంధిగారి నాయకత్వం' యొక్క పోరాట వ్యతిరేక చర్యల్ని, ఐక్య విరుద్ధ చర్యల్నీ, బయటపెట్టడం తప్పని తలచారు. ఐక్యతకోసం-ఐక్య నాయకత్వంకోసం-చేసే పోరాటం సరిగ్గా ఉండాలంటే, మితవాదుల ఐక్యవ్యతిరేక విధానాన్ని, పోరాట వ్యతిరేక విధానాన్ని సక్రమమైన (Balanced) విమర్శనతోకూడి యుండియుండక తప్పదు. లేకపోతే, మితవాదుల చర్యలు సామ్రాజ్యవాదములో రాజీకి, లొంగుబాటుకు దారితీస్తాయి. జూలై 9 వ తేదీ తర్వాత ఏర్పడిన పరిస్థితుల ననుసరించి, కాంగ్రెసు ఐక్యతను కాపాడే నిర్మాణాత్మక పోరాటాన్ని-మితవాదుల విధ్వంస విధానాన్ని రాజకీయంగా బయటపెట్టడాన్ని-యుక్తియుక్తంగా కలపవలసిన భారం మనయందు ఉంది.

ఇది వెన్వెంటనే ఆచరణలో పెట్టవలసిన నినాదం

మా "సంయుక్త నాయకత్వ" నినాదం వెంటనే ఆచరణలో పెట్టవలసిన నినాదం. అది నేటి ప్రజాసామాన్య రాజకీయ చైతన్య స్థాయికి సరిపోతుంది. ఆ రాజకీయ చైతన్యాన్ని తరువాత దశకు తీసుకపోడానికి ఈ నినాదం సరిపోతుంది. ప్రస్తుత డ్రిఫ్టు (దిగజారుడు) విధానంయెడల కావలసినంత అసంతృప్తి ఉంది. ప్రజాసామాన్యంలోని సంఘటిత

శక్తులు-రైతులు, కార్మికులు, సంస్థాన ప్రజలు తమతమ పోరాటాల్ని సాగిస్తున్నారు. దానిని దేశవ్యాపితంగా జేసి, ఐక్యపరచి, సామ్రాజ్యవాదంపై దాడి సలపాలని, అస్పష్టంగా దేశంలో కోరిక ఉంది. ఆపాదమస్తకం సర్వ ఐక్యత (ఆల్ రౌండ్ యూనిటీ) కావాలనే కోరికకూడా ఉంది. ఈ ఐక్యత సాధ్యమైనంత త్వరలో రావాలి. అది ఒక్కటే పోరాటాన్ని తీసుకు రాగల్గుతుంది. ప్రజాసామాన్యం పోరాటాన్ని కోరుతున్నది. ఇంతేగాదు. కాంగ్రెసులో ఐక్యత, నాయకత్వంలో ఐక్యతకూడా కోరుతున్నది. ఈ ఐక్యతే వారిలో ముందుకు సడవడానికి విశ్వాసాన్ని కల్గించుతుంది.

సాధ్యమైనంత త్వరలో ఈ స్థంబన పోవాలంటే, మన శత్రువులు పన్నుచున్న మహా విధ్వంసాన్ని ఆపాలంటే, డ్రిఫ్టు విధానాన్ని బహుళ ప్రజానీకంచేత పోరాడేటట్లు చేయుడానికి మనం ప్రజాసామాన్యాన్ని విరివిగా ప్రోవు చేయాలంటే, మంచి నినాదం "సంయుక్త నాయకత్వం" అనేది. సంయుక్త నాయకత్వం అంటే యావత్తు కాంగ్రెసూ, యావత్ దేశమూ, విశ్వాస ముంచుతుంది. ఈ సంయుక్త నాయకత్వం జాతిని పోరాటానికై ముందుకు తీసుకు వెళ్లుతుంది.



వ్యాసకర్త

డ్రిఫ్టును అరికట్టడం

ప్రజా సామాన్యం కోరే ఈ సంయుక్త నాయకత్వం, ఇపుడు ఒకేరకపు నాయకత్వం అనుసరించుచున్న డ్రిఫ్టు విధానంతో, విధ్వంస విధానంతో విడిపోవక తప్పదు. ఈ విడిపోవడం కాంగ్రెస్ ప్రధాన ఆశయాలతో విడిపోవడం కానేకాదు. పైగా, ఇప్పుడు ప్రస్తుత కాంగ్రెసు నాయకత్వం అవలంబించే విధానమే కాంగ్రెసు ప్రధాన తీర్మానాలకు విరుద్ధం.

సంయుక్త నాయకత్వం కావాలని కోరడం, ఒకేరకపు నాయకత్వానికి లొంగిపోవడమేనా, కానేకాదు. ఇది ప్రజల ఒత్తిడివలన వస్తుంది. అంటే, ప్రస్తుత నాయకత్వం ఉన్న స్థానాన్నుండి కదలడం అన్నమాట. అంటే పోరాటంవద్దు, ఐక్యతవద్దు, అనే ప్రస్తుత మితవాద నాయకత్వం విడిపడి పోవడం అన్నమాట. తక్కినవారు పోరాటంలోకి దిగవలని వస్తుంది ఒత్తిడిపల్ల. ఇదంతా, సోషలిస్టులు, కమ్యూనిస్టులు, లెఫ్టిస్టులు వృద్ధిచేసిన ప్రజా ఉద్యమ ఒత్తిడి వలననే వీలవుతుంది. కాబట్టి సంయుక్త నాయకత్వంలో తీవ్రవాదుల ప్రత్యేక బలం, చాలా ప్రాముఖ్యత కల్గిఉంటుంది. ఇది, పోరాటానికి వ్యతిరేకంగా ఉన్న మితవాదులకు లొంగుబాటా? కాదు. పైగా, కాంగ్రెసును ఐక్యపరచే, పోరాటాన్ని ఆరంభించే, పాత్ర వహించడంవలన తీవ్రవాదులు ముందుకు పోతున్నారన్నమాట.

ఇది లొంగుబాటా?

"మరొక నాయకత్వం సృష్టించనిదే పోరాటమే లేదు" అను సిద్ధాంతాన్ని బలపరచే వారందరూ ఈవిధంగా వాదించవచ్చు: - "గాంధీవాదులతో కలిసి వచ్చే పోరాటంలో పాల్గొనడం, వారికి నాయకత్వాన్ని అప్పచెప్పడమే. అంటే 1930-32 లో జరిగిన ద్రోహాన్ని మరొకదానిని మీరు తయారు చేస్తున్నారన్నమాట" ఈవాదన సరియైనది కాదు. 1930-32 నాటికీ, నేటికీ చాల వ్యత్యాసం ఉంది. గత సత్యాగ్రహోద్యమము నాటికి, సంఘటిత కర్షకోద్యమం లేదు. కార్మికోద్యమం కూడా చిన్నది. ఐకమత్యం లేదు, జాతీయోద్యమం ప్రారంభించక ముందు పెద్ద అపజయాలు పొందింది. (ఉదా: 1929 టెక్స్టయిలు సమ్మె 1930 జి.ఐ.పి. రైల్వే సమ్మె) గాంధిగారి నాయకత్వం ఆనాడు ఎదురు లేనిది. ఆనాయకత్వపు ఊగులాటలను ఆపగల్గిన సంఘటిత తీవ్రవాద ఉద్యమం లేదు. నేడు కూడా అంతే. వచ్చే పోరాటంలో పాల్గొనే తీవ్రవాదుల వెనుక సంఘటిత కర్షకోద్యమం వుంది; సంయుక్త, సంఘటిత కార్మికోద్యమము వుంది. శ్రామిక సంఘటన సంఖ్యలోను, విస్తీర్ణంలోను రాజకీయ చైతన్యంలోను వృద్ధి పొందింది. రాజకీయసమ్మెల రూపంలో, దేశవ్యాపిత రాజకీయ కార్యాచరణకు శ్రామికులు శక్తి కల్గి ఉన్నారు ఇంతేగాక, సోషలిస్టులు కమ్యూనిస్టులు, కిసాన్ సభవారు, వివిధ కాంగ్రెస్ కమిటీలలో పాతుకుపోయి ఉన్నారు. తీవ్రవాదులు తమలో తాము ఐక్యపరచుకొనగలిగితే; కాంగ్రెసును పోరాటానికి నడపగలిగితే; ఊగులాటగాని, రాజీకి దిగజారడంగాని రాకుండా చేయగల పలుకుబడి, శక్తి, సంయుక్త నాయకత్వములో తీవ్రవాదులు కలిగిఉంటారు.

పోరాటాలు, గాంధిగారి పొరబడే అంతరాత్మ చెప్పినట్లు నడిచికొనే సత్యాగ్రహంతో, ముడి పెట్టుక కూర్చోవు. శ్రామికుల, రైతుల ఉత్సాహంతో, ప్రజాసామాన్య పోరాటాల తగిన మార్పును చెందుతాయి, పోరాటాన్ని ఉన్నతస్థాయికి లాగుతాయి. సంయుక్త నాయకత్వ నినాదం క్రింద తేబడిన పోరాటం-కాలక్రమేణా-నాయకత్వపుటుసికిని ఇంకా కొంత ముందుకు జరుపుతుంది; చివరకు (సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించడానికి, హిందూదేశంలో బూర్జువా డెమాక్రటిక్ విప్లవం రావడానికి అవసరమైన పోరాటాన్ని ముందుకు సాగించే) ప్రొలిటేరియన్ హెజిమొనీకి దారి తీస్తుంది.

సంయుక్త నాయకత్వ నినాదం నేడు లొంగుబాటుకు దారి తీయదు; కాని ప్రొలిటేరియన్ హెజిమొనీకి దారి తీస్తుంది.

విప్లవ నాయకత్వం 'విడిపోవడం'

హిందూదేశపు దేశవు బూర్జువా విప్లవపాత్ర వహిస్తుందని మనకు నమ్మకంఉందా? బూర్జువా సామ్రాజ్య వ్యతిరేక పోరాటంలో, సంస్థానవ్యతిరేకపోరాటంలో చివరిదాకా విప్లవపాత్రనే వహిస్తుందని నమ్ముతామా?

మన కలాంటి భ్రమలు లేవు.

హిందూదేశ బూర్జువా నాయకత్వం ఇపుడు సామ్రాజ్య వాదానికి ప్రతికూలంగా ఉందనీ, ఊగులాడుతుందనీ మనకు తెలుసు, వెంటనే

అపాయకరమగు ప్రజా విప్లవభయం ఉన్నపుడే నిప్లవ ప్రతికూల శిబిరంలోకి బూర్జువా పోతుంది. ఈలోగా, మన కర్తవ్యం దాని ఊగులాటను తటస్థ పరచడం. క్రమ క్రమంగా ప్రజా సామాన్యాన్నుండి దానిని విడిపడ చేయడం, అని అనువారితో మేమేకీభవిస్తాం. ఈనాడున్న ప్రత్యేక పరిస్థితిలో, ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడం ఎలా అనేదే ఇప్పటి సమస్య. కాంగ్రెసులోనూ, ప్రజలతోనూ దూరమై పోతున్నా, నేటి బూర్జువా నాయకత్వానికి ఇంకా ప్రజా పలుకుబడి ఉంది. బూర్జువా, కాంగ్రెస్ నాయకత్వంలో తిష్ఠవేసుక కూర్చుంది. కాని డ్రిప్టు విధానానికి అసంతృప్తి వృద్ధి అవుతోంది. ఐక్యతకూ, పోరాటానికీ, ప్రజలలో వాంఛ వృద్ధిఅవుతోంది. ఈవాంఛను ప్రతిబింబించే, (పరివర్తనకాలంలో ఉపయోగించ వలసిన) నినాదం సంయుక్త నాయకత్వమే.

ఈనాడు బూర్జువా, తిష్ఠవేసుకొన్న నాయకత్వాన్నుండి, సంయుక్త నాయకత్వానికి కదిలించంటే, పైన చెప్పినటుల బూర్జువా నాయకత్వం క్రమక్రమంగా (ప్రజలనుండి) విడివడిపోవడం అన్నమాట:

సంయుక్త నాయకత్వానికి పునాది.

ప్రస్తుతం యుద్ధ వాతావరణం మనలను ఎదుర్కొంటూంది. ఈ పరిస్థితులలో భారత పెట్టుబడిదారీ వర్గానికి సామ్రాజ్యవాదులకు పరస్పర విరుద్ధ ఆర్థిక రాజకీయ హక్కుల విషయమై వున్న వైరుధ్యమే సంయుక్త సంఘటనానికి, సంయుక్త నాయకత్వానికి పునాదిగా వుంటుంది. కాని యీ వైరుధ్యం వున్నంత మాత్రాన అదొక్కటే ఐక్యతకు పోరాటానికి దారీ తీస్తుందనుకోడం పొరపాటే అవుతుంది. దానంతటకి దాన్ని వదలివేస్తే భారత పెట్టుబడిదారీ వర్గం పోరాటం అభిలషింపదు. అది ప్రజా సంస్థ అయిన కాంగ్రెసును ఏడురాష్ట్రాలలోని కాంగ్రెస్ మంత్రులను తన పలుకుబడిలో వుంచుకొని, ఆ పలుకుబడి వినియోగించుకొని పోరాటం లేకుండానే యింకో మెట్టు ముందుకు పోవాలని కోరుతూంది. అందుచేతనే "ఒకవైపు హింసాయుత విప్లవం లేకుండా చేయడానికి, రెండోవైపు ఇదివరకు కనివిని యెరుగనంతటి బ్రహ్మాండమైన శాసనోల్లంఘనోద్యమం రాకుండా చేసి" గాంధీజీ పోరాటం కోరే శక్తులను విచ్ఛిన్నం గావించి తీవ్రవాదులను అణచివేయాలి. ఇందుకే కాంగ్రెసు నిబంధనావళిలో మార్పులు. డిసిప్లినరీచర్యలు. తీవ్రవాదులను కాంగ్రెసు నుండి తరిమివేయాలి. దీని ఫలితము ప్రస్తుతమున్న నిస్పృహ, సంధిగ్ధావస్థ కొనసాగి విధ్వంసానికి దారి తీయడమే అవుతుంది.

విమర్శనయొక్క అవసరం.

ప్రస్తుత సంధిగ్ధావస్థ తొలగటానికి నాయకత్వంపై ఒత్తిడితేడానికి ఒకటే మార్గముంది. సోషలిస్టులు తీవ్రవాదులతో కలసి ప్రస్తుత నాయకుల ముందు "పోరాడే శక్తులతో కలుస్తారా లేక వెనుకబడిపోతారా" అనే సమస్యను పెట్టాలి. కాని కేవలం ప్రజల కనీసపు హక్కులకై జరుపబడు స్థానిక పోరాటాలు, యావద్భారత జాతీయ పోరాటం కావాలని చేసే ప్రచారము మాత్రమే ప్రస్తుత ఏకపక్షనాయకత్వాన్ని పోరాటంలోకి లాగ కలుగుతా యనుకోరాదు. ఈ ఏకపక్షనాయకత్వాన్ని సున్నితమైన విమర్శన చేస్తూ వుండాలి. కుహనా ఐక్యత, కుహనా డిసిప్లిన్ పేరుతో యీ నాయకత్వం గావించే పోరాటానికి విరుద్ధమైన ప్రతిపనినీ, ఐక్యతకు, విరుద్ధంగా చేసే ప్రతికార్యాన్ని స్పష్టంగా బయటపెట్టాలి. ఇట్టి విమర్శనలు లేకుండా పోరాటానికి విరుద్ధులైనవారిని బయలు పరచడం సాధ్యంకాదు.

గాంధీజంతో మనకున్న భేదాలు దాచకూడదు.

మనం తప్పకుండా గాంధీయుల నాయకత్వాన్ని పోరాటాన్ని సాగించాలని ఒత్తిడి చేయడానికి ప్రయత్నించుతాము. మనం వారితో కలసి, ఫెడరేషనుకు యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడాలని, కోరుతాము. కాని దీని అర్థం సిద్ధాంతాలలో గాంధీజాన్ని, దాని సంస్కరణ తత్వాన్ని, హృదయపరివర్తన సిద్ధాంతాన్ని, లొంగుబాటుకు అపర రూపమైన 'నూతన టెక్నిక్'ను, గాంధీయుల ముఠా మాత్రమే కాంగ్రెసులో వుండాలనే విధ్వంసక తత్వాన్ని, తప్పకుండా విమర్శించుతాము. ప్రజలలో దౌర్జన్యరాహిత్య వాతావరణం కలిగించడానికని ప్రజలపై ప్రయోగించబడే దౌర్జన్యాన్ని సమర్థించే అహింసా తత్వాన్ని తప్పక విమర్శించుతాము. గాంధీయులు కోరునటులే మంత్రివర్గాలు పనిచేస్తే సామ్రాజ్యవాదులతో రాజీకి దారి తీస్తుందని విమర్శించడం మానివేయము. ఎటుల కార్మికవర్గ ఐక్యత కొరకుచేయుప్రయత్నాలలోసంస్కరణతత్వాన్ని, 'సోషల్ డిమాక్రసీ'ని విమర్శించడము ఎలా మానమో అటులే సంయుక్త జాతీయ ఐక్యత నిర్మించడానికిచేయుప్రయత్నాలలో గాంధీజాన్ని, సిద్ధాంతాలను విమర్శించడం వదలుకోజాలము.

డిమిట్రావ్ మాటల్లో:— "ప్రజా ఐక్యసంఘటన వుందని, కార్మికవర్గ ప్రధాన హక్కులు, కార్మికోద్యమం యొక్క మూలసూత్రాలకొరకు పోరాడవలసిన బాధ్యత. కార్మికవర్గానికి వ్యతిరేకమైన సిద్ధాంతాలను విమర్శించ వలసిన అవశ్యకత లేదనుకోటం పొరపాటు. అలాంటి పోరాటం సాగించడము ఐక్యసంఘటనకు విరుద్ధంకాదు: పైగా దాన్ని బలపరుస్తుంది."

గాంధీజానికి 'మరోభాష్యం' పునరవతారం సాధ్యం కాదు.

గాంధీయుల నాయకత్వంతో కలసి పోరాటము సాగించాలంటే దాని అర్థం గాంధీజాన్ని "నూతన మార్క్సిస్టు దృక్పథంతో" చూడాలని కాదు. 1920 నాటి గాంధీజానికి, సంయుక్త సంఘటనకోసం నూతనభాష్యం చెప్పాలని కాదు. గాంధీతత్వం సామ్రాజ్యవాదానికి—విప్లవానికి మధ్య ఊగిసలాడే భారత పెట్టుబడిదారీ వర్గము యొక్క దేశవాళీ రాజకీయ విధానం. అది రాజీ కొరకు ప్రాకులాడే, ప్రజాపోరాటాన్ని భద్రమైన మార్గాల నడిపే, సాంకేతిక విధానం. ప్రజాపోరాట శక్తులు నిర్మాణయుక్తం కానపుడు, చైతన్యము పొందనపుడు గాంధీజం యీ శక్తులను తన అదుపు అజ్ఞల్లో వుంచుకొని సామ్రాజ్యవాదముతో బేరం సాగించేది. ప్రజాసామాన్యము కొత్తగా పోరాటంలోకి వచ్చేటప్పుడు అది జాతీయైక్యతను కాపాడి అభివృద్ధికరమైన పాత్రను వహించింది. ప్రజాపోరాటం విజృంభించి చెలరేగిన ప్రతిసారి వెనుకఅడుగు వేసింది. అయినప్పటికి 1920—22 లోనూ, 1930—32 లోనూ గాంధీజం ప్రజలలో చైతన్యం కలిగించి పోరాట శక్తులను అభివృద్ధిపరచింది: జాతీయ ఐక్యతకు, అభివృద్ధికి దారి తీసింది. నేడు నిర్మాణం విషయంలోనూ, రాజకీయ చైతన్యం విషయములోనూ, కార్మిక కర్షక ప్రజాసామాన్యం నూతన దశకు వచ్చింది. ప్రజాపోరాటాన్ని నడుపగల మరోనాయకత్వం, కార్మికవర్గ నాయకత్వము సోషలిస్టు జెండాక్రింద బయలుదేరుతూంది. ఈ శక్తులను అదుపు, ఆజ్ఞలలో పెట్టడానికి గాంధిగారి సత్యాగ్రహ తత్వానికి సాధ్యపడదు. అందుచే ప్రస్తుతము గాంధీజం కేవలము కాని స్టిట్యూషనలిజము (శాసనబద్ధమయిన ఆందోళన)గా మారిపోయింది, అది త్వరత్వరగా పోరాటాన్ని ఆటంకపరచే టెక్నిక్‌గా మారిపోతూంది. అందుచే గాంధీజాన్ని పునరుద్ధరించడము, మార్పు చేయడము అనే ప్రశ్నే రాకూడదు.

గాంధీతత్వంయొక్క నిరుపయోగతను బయటపెట్టాలి.

గాంధీజం నేడు చీకటి సందులో పడింది. అది పూర్వంవలే ప్రజాపోరాట శక్తులను తన అదుపు అజ్ఞల్లో పెట్టుకొని నాయకత్వం వహించి నడిపే స్థితిలోలేదు. గాంధీజీయే నిస్పృహ చెందాడు ఈనెల 8 వ తేదీ హరిజన్ పత్రికలో యిలా వ్రాసాడు:

"కాని కాంగ్రెసువాదులు ఇదివరకు కంటె ఎక్కువగా అహింసను పాటించకపోతే, బ్రిటిషు ప్రభుత్వం, సంస్థానాధిపతులు తమంతటతామే సరియైన పని చేయనిచో, నూతన టెక్నిక్ ననుసరించి హింసకు బదులుగా వినియోగపడే దౌర్జన్యరాహిత్యమైన కొత్తవిధానమేదైనా కనుగొనాలి లేదా దేశాన్ని హింసకొరకు తయారైనా చేయాలి."

అర్థం స్పష్టంగానేవుంది. గాంధిగారిమాటల్లో చెప్పాలంటే: "ప్రస్తుత సమయంలో దౌర్జన్యరాహిత్యంపేర ప్రజాఉద్యమము ప్రారంభించినట్లయితే, అది తప్పకుండా ఎక్కువగా నిర్మాణరహితమైపట్టియు, కొలదిగా నిర్మాణయుక్తమైనట్టియు దౌర్జన్య ఉద్యమముగా మారిపోతుంది." అందుచే ప్రజాఉద్యమమే వద్దంటున్నాడు. కాని సమిష్టి సత్యాగ్రహం ప్రారంభించక పోయినప్పటికీ పోరాటం తప్పకుండా ప్రారంభమవుతుంది. దానిని ఆపేదియెలాగు? గాంధిజీకి రెండే మార్గాలు కాన్పించుతున్నాయి, సామ్రాజ్యవాదులు, సంస్థానాధిపతులు హృదయ పరివర్తనం జరిగి, మంచివారయి, స్వార్థరహితంగా మనంకోరేది యివ్వనైనా యివ్వాలి: లేదా మనంతట మనమే "నూతన టెక్నిక్" ననుసరించి పోరాటం లేకుండా లొంగిపోయి, మన కోరికలను మన సాధ్యమైనంత తగ్గించివేయాలి. భిక్షాపాత్ర: లేక పూర్తిగా లొంగిపోవడం: ఈ రెండేమార్గాలను శిధిలమైపోతూన్న గాంధీజం నేడు విప్లవంకొరకు ఘూర్ణిల్లుతున్న ప్రజలకు చూపగలుగుతూంది:

గాంధీయుల నాయకత్వంతో ఐక్యసంఘటన కావాలంటే దాని అర్థం గాంధీజాన్ని సంస్కరించాలనీ, పునరుద్ధరించాలనీ కాదు: సోషల్ డిమాక్రేటులతో ఐక్యసంఘటన కావాలంటే సోషల్ డిమాక్రసీని (సంస్కరణతత్వాన్ని) పునరుద్ధరించడంకాదు. పైగా సున్నితంగా, జాగ్రత్తగా, స్పష్టంగా గాంధీ తత్వంయొక్క ప్రస్తుత శిధిలావస్థను విమర్శించుటే, పోరాటం కోసం ఐక్యతను సాధించు ప్రయత్నాలలో ఒక భాగం.

కొలది మాటల్లో చెప్పాలంటే నేడు మన కర్తవ్యం కొలది కాలంలోనే అంతా కలసి, పోరాటం ప్రారంభించడానికి, కాంగ్రెసు ఐక్యతను కాపాడటానికి ముందంజ వేయుటయే. సంయుక్త నాయకత్వ నినాదం ఇట్టి ఐక్యతను సాధ్యమైనంత త్వరలో సాధించడానికి, ప్రజల విశ్వాసాన్ని జూరగొనడానికి చక్కని సాధనమవుతుంది. ప్రస్తుతమున ఏక ముఠా నాయకత్వానికి, సంయుక్త నాయకత్వానికి చాలా భేదముంటుంది. దాని కంటే ముందంజ వేస్తుంది. సంయుక్త సోషలిస్టు నాయకత్వాన తీవ్రవాదుల ఐక్యత లేనిదే, వారు ముందంజ వేసి రాజకీయ ప్రజా ఉద్యమాలు కొనసాగించనిదే: పోరాటానికి తయారు చేయనిదే సంయుక్త నాయకత్వం నిర్మించడం సాధ్యపడదు. కాని దీనితోపాటు పోరాటానికి వ్యతిరేకమైన ఐక్యతకు విరోధమైన ప్రస్తుత నాయకత్వ దిగజారుడు పంథాను ప్రజలనుండి వేరు పరచడం కూడా అవసరమే. ఇందుకొరకు గాంధీతత్వం యొక్క విధానంలోని లోట్లను సామాన్య కాంగ్రెసు వాదులకు అర్థమయ్యేలాగు వివరించాలి. ఈ రెండు విధులను చక్కగా సమీకరణమొనర్చి నెరవేర్చుటే ప్రస్తుత పరిస్థితులలో ప్రధానమైన పని.

—నేషనల్ ఫ్రంటు నుండి.

[ఈ వ్యాసంలో ప్రొలిటేరియన్ హెజిమొనీ అనే పదంవాడాం. దీని అర్థం శ్రామిక నాయకత్వం అని కాదు. శ్రామికులు జాతీయ పోరాటాన్ని ముందుకు త్రోసే ప్రధానశక్తిగా ఉంటారు.—సం.]

నవశక్తి

జూలై

19 వ తేదీవరకు చేర్పించినవి.

	సం. చం.	½ సం.	విరాళాలు
విశాఖపట్టణం	1	2	
తూర్పుగోదావరి	2	0	4-0-0
పశ్చిమ గోదావరి	17	5	44-2-9
కృష్ణా	9	4	5-0-0
గుంటూరు	5	5	24-8-0
నెల్లూరు	10	2	15-0-0
ఇతరస్థలాలు	3	2	
	47	20	92-10-9

ఆంధ్రరాష్ట్రంలో మున్సిపల్ స్కావెంజర్ల ఇబ్బందులు

రాబోవు కార్మికశాసనంలో వీరికికూడా రక్షణ వుండాలి

కామ్రేడ్ సి. రామసుబ్బారావు

మన రాష్ట్రంలో దాదాపు 20 వేల స్కావెంజర్లు వున్నారు. స్కావెంజర్లందరు, ఎక్కడున్నా అనుభవించే కష్టాలొక్కవిధమైనవే. తమ యిబ్బందులను తొలగించుకోటానికి ఎన్నిసార్లు అధికారులను సమీపించినప్పటికీ ఎట్టి లాభం లేకపోతోంది. పైగా ఇబ్బందులెక్కువయ్యాయి. వారు శానిటరీ ఇనస్పెక్టర్లు, మేస్త్రీలచే పడు బాధలు చెప్పరానివి. ఘోరముగా వుంటాయి. మేస్త్రీలు, శానిటరీ ఇనస్పెక్టర్లు మొదలగువారు స్త్రీల నవమానపరచుట, తిట్లు, శాపనార్థాలు పెట్టుట మామూలైనవి. అవిద్య, బీదరికం, అనారోగ్య పరిస్థితులు స్కావెంజర్ల నెదుర్కొనుచున్నాయి. అప్పుల బాధ మిక్కుటం.

పై యిబ్బందుల నివారించుటకై, కొన్ని సౌకర్యాలను చేకూర్చుటకై కొన్నిశాసనములు చేయబడి ఉండవచ్చును. కాని, వాటినితెల్లకాగితములపైనే చూడగలము. ఆచరణలో అవంతైనా జరగటంలేదు. మ్యునిసిపలు కౌన్సిళ్ళలో తీర్మానాలు చేయబడి ఉండవచ్చు. వాటిగతి చిత్తుకాగితముల బుట్టల పాలు. అంతేగాని ఏవిధమైన ఉపకారము గాని, కష్టాలు తొలగుట గాని జరుగుట లేదు. శానిటరీ ఇనస్పెక్టర్లు, మేస్త్రీలు స్కావెంజర్ల పైన సర్వాధికారం. కూర్చోమంటే కూర్చోవాలి. లేవమంటే లేవాలి. వెట్టి చాకిరీ సంగతి వేరే చెప్పబనిలేదు. ఇనస్పెక్టర్లు మొదలగు మ్యునిసిపల్ అధికారుల యిండ్లకు పోయి చూస్తే ప్రతి యింటివద్ద యిద్దరు ముగ్గురికి తక్కువ వుండరు స్కావెంజర్లు.

ఈ పరిస్థితుల గమనించే 1938 మార్చిలో బెజవాడలో కొంతమంది కలసి రాష్ట్ర స్కావెంజర్ల సంఘాన్ని నెలకొల్పారు. కాని ఎక్కువ పనిచేయలేకపోయింది. ఆందోళన పూర్వకంగా గాని, సంఘాల నేర్పరచటంగా గాని ఏమీ జరిపియుండలేదా సంఘం. స్కావెంజర్ల కష్టాలుమాత్రం ఎప్పటియట్ల ఏమాత్రం తగ్గక హెచ్చుతున్నాయి.

బీదలపాలిటి కల్పతరువనదగు కాంగ్రెసుప్రభుత్వం గూడా, అధికారం వహించి రెండు వత్సరములైనా, వీరి విషయంలో ఎట్టి శ్రద్ధవహించక ఉదాసీనత బూనటము గర్హింపదగిన విషయం. కాని కొద్ది రోజులలో కార్మిక శాసన మొకదానిని అసెంబ్లీలో ప్రవేశపెట్టబోవుచున్నారు. ఇప్పటికైనా మేల్కొన్నందుకు మద్రాస్ కాంగ్రెసు ప్రభుత్వానికి ధన్యవాదాలు.

ఆశాసనంలో స్కావెంజర్లకు కూడా స్థానముందా? లేక యింకా ఈ మ్యునిసిపలు అధికారుల అన్యాయాలు నిరాఘాటంగా సాగవలసిందేనా? దీనికి ప్రభుత్వం ఏం చెపుతుందో విందామని కూర్చోకూడదు. ఇప్పుడే తగినంత ఆందోళన చేయాలసిన అవశ్యకత కనబడుతోంది. కనుక కాంగ్రెసు, సోషలిస్టు, యువజనసంఘాలవారు తగిన శ్రద్ధబూని పాటుబడాలసిన అవసరం ఉన్నదని వేరే చెప్పబనిలేదు. సంఘాలు స్థాపించి కార్మికశాసనం స్కావెంజర్లకు కూడా వర్తింపజేసేటట్లు సక్రమపద్ధతులలో ఆందోళన జరుపుతారని ఆశిస్తున్నాము.

ఆంధ్రరాష్ట్రంలో స్కావింజర్లు అనుభవిస్తూన్న కష్టాలను ఈక్రింద ఉదహరిస్తున్నాను.

జీతాలు

ప్రస్తుతం యిస్తున్న జీతాలు చాల తక్కువగా ఉన్నాయి. నెలకు 9 నుండి 12 రూపాయల దాకామాత్రమే జీతాలున్నాయి. ఇంత తక్కువైన జీతాలైనా సరిగా మొదటి తేదీ కివ్వరు. ఏ 10, 15 తేదీలకో ఇస్తుంటారు. 30 సం॥ల సర్వీసున్నా జీతముల హెచ్చింపు లేదు. యీ కొద్దిజీతములతో తమ జీవితాలను వెళ్ళబుచ్చుకొనలేక అప్పులపాలౌతున్నారు. (కొన్ని చోట్ల 100 కి 50—70 వరకు వడ్డీ వుంది. అంటే రూపాయకు అణా వడ్డీ) కనీసం నెలకు రు॥ 15 లు, సర్వీసును బట్టి జీతాల హెచ్చింపు ఉండాలి. ప్రావిడెంటు ఫండు నేర్పాటు చేయాలి. జీతములు ప్రతి నెల 1 వ తేదీకి యిచ్చునట్లు చేయాలి.

ఈసందర్భంలో ఒక ప్రభుత్వ ఉత్తర్వు వుంది. అది సాకుగా తీసికొని మ్యునిసిపలు అధికారులు జీతాల హెచ్చింపుకు ఒడబడుట లేదు. ఆ జి. ఓ.ను వెంటనే రద్దుపరిచేటట్లు ప్రభుత్వానికి ఒత్తిడి కలిగించాలి.

పనిచేయు గంటలు.

సాధారణంగా 10 గంటలు తక్కువ లేకుండా పని చేస్తున్నారు. ఉదయం 4 గంటలకే ఎంత చలి-వానలోనైనా మస్తరుకు వెళ్లాలసి యుంటుంది. మస్తరు తీసుకుంటే స్థలాలు వీండ్లుండే క్వార్టర్సుకు చాలా దూరానవుంటాయి. మస్తరుకు 5 లేక 10 నిమిషాలు ఆలస్యమైతే ఆరోజు నాగా. నాగాపడినా పనిచేయుట తప్పదు. కాబట్టి పనిచేయుకాలము రోజుకు 8 గంటలకంటె ఎక్కువ వుండగూడదు. మస్తరు వీలైనంతదగ్గర ప్రదేశాల్లో వుండేటట్లు చూడాలి.

సెలవులు

(ఎ) జబ్బుచేసినపుడు సెలవులేదు. కనుక మెడికల్ సర్టిఫికెట్లతో తప్పని సరిగా సెలవివ్వాలి.

(బి) సంవత్సరంలో ఒకనెలజీతంమీద సెలవు

(సి) గర్భిణీస్త్రీలకు ప్రసవించే ముందు 1 నెల, తరువాత 1 నెల జీతంమీద సెలవుండాలి. యిప్పుడు ఒక నెలమాత్రమే యిస్తున్నారు.

(డి) ఆదివారం మధ్యాహ్నం చట్టప్రకారం సెలవుంది. కాని సెలవులేకుండా అదనపు జీతమేమి యివ్వకుండ పనిచేయిస్తున్నారు. కనుక ఆదివారం తప్పని సరిగా సెలవు వుండాలి.

పరిశుభ్రముచేయు దొడ్లసంఖ్య

మ్యునిసిపల్‌చట్టప్రకారం 35 దొడ్లు. కాని యిప్పుడు ఒక్కొక్కరిచేత 50 మొదలు 60 వరకు చేయిస్తున్నారు. అట్లు చేయించువారిని శిక్షించాలి.

దుస్తులు

మ్యునిసిపల్ చట్టప్రకారం దుస్తు లివ్వడంలేదు. ప్రతిఒకరికి కనీసం రెండు జతలదుస్తులు, కాళ్లకు జోళ్లు యివ్వాలి.

వైద్యసహాయం

వుచితంగా చికిత్స చేసేందుకు మ్యునిసిపాలిటీ స్కావింజర్ల క్వార్టర్సుకు ప్రత్యేకంగా నొక డాక్టరును నియమించాలి.

విద్య

వీరిపిల్లలకోసం వీరుండే ప్రదేశాల్లో స్కూళ్లనేర్పాటుచేసి అజ్ఞానాన్ని నిర్మూలించాలి. వయోజనుల కొరకు రాత్రిపాఠశాలలు నేర్పాటుచేయాలి.

లంచగొండితనం

చీటికిమాటికి లంచం బుచ్చుకొంటారు. ఏకొద్దిపనికైనప్పటి లంచమిచ్చి దీరాలి. లేకపోతే ఉద్యోగం వూడటమో, జరిమానా పడటమో జరుగుతుంది. వెట్టి చాకిరిమాట ఎత్తనవసరంలేదు. యీ బాధలు తొలగేటట్లు తగిన కట్టు దిట్టాలు ఏర్పడాలి.

పనిలోనుండి తొలగింపు

చట్టప్రకారం తొలగించుటకు నెలరోజుల నోటీసుండాలి. కాని చట్టందారి చట్టందారే, అధికారులవారి అధికార్లదే. వాండ్ల ఆగ్రహానుగ్రహాలమీదే ఆధారపడి వుంటాయి వీళ్ళవుద్యోగాలు. చట్టం అమల్లోకొచ్చేట్లు చూడాలి.

కో ఆపరేటివ్ స్టోర్సు

పనివారల కవసరమైన వస్తువులను, ఆహారపదార్థములను సప్లయిచేసి, నెలచివరకు బిల్లుచెల్లించే పద్ధతి మీద పరపతి సంఘాల నేర్పాటు చేయాలి.

ఉద్యోగాలు

ఉద్యోగాలు తాత్కాలికమే, ఖాయంలేదు. యీసటంధమైన జి. ఓ ను రద్దుపరచేట్లు చూడాలి.

స్థానాలు

స్కావింజర్లకు అనేక కష్టాలున్నాయి. వాటిని తొలగించుకొనేందుకు వాండ్లతరపున మాట్లాడేందుకు మ్యునిసిఫల్ కౌన్సిల్‌లో, కొన్ని స్థానాలుండేట్లు ప్రభుత్వం చూడాలి.

గృహవసతులు ఏర్పాటుచేయాలి. మంచినీళ్లవసతి దీపములు మొదలగు సౌకర్యాలు కలుగజేయాలి.

స్కావింజర్ల సంఘాలను అధికార్లు గుర్తించేట్లు ఆందోళన చేయాలి.

★ ★ ★

కళింగపట్టణం

కార్మికసేవకుని నిర్యాణము

వమరవెల్లి వాస్తవ్యులు, శ్రీ లోపింటి నారాయణ రెడ్డిగారు ఈ నెల 12 వ తేదీని కీర్తిశేషులైరని వినుటకు చింతిల్లుచున్నాము. కళింగపట్టణం కార్మికసంఘమును స్థాపించి, బైటిప్రపంచము నెరుగని కార్మికులలో చైతన్యము కలిగించి కంపెనీవారి దౌష్ట్యము నెదుర్కొనుటకు వారిని తయారుచేసిరి. కళింగపట్నం పోర్టు, వర్కర్సు సమ్మెలో కార్మికుల కన్నివిధముల తోడ్పడి సమ్మెను జయప్రదమొనరించుటకు వీరుచేసిన సేవను కార్మికులు మరచిపోలేరు. వారికుటుంబమునకు మా సానుభూతిని వెల్లడించుచున్నాము.

మీ
వ్యాపారం
వృద్ధి కావాలంటే
ప్రతిపల్లెలోనూ
ప్రచారంలో ఉన్న
నవశక్తిలో
ప్రకటించండి

నవశక్తి

అందమైన
అచ్చుకావాలంటే
నవశక్తి ప్రెస్
లో వేయించండి

Published by M. Chandrasekhara Rao }
Printed by Tummala Venkata Ramiah } at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE